
## కంధమల్ నుండి కరావళి దాకా

# ప్రజాస్వామ్యంపైన సంఘ్‌పరివార్ దాడి



## క్రిస్టియన్ల మీద దాడులపై మానవహక్కుల నివేదిక

# కంధమల్ నుండి
# కరావళి దాకా



# ప్రజాస్వామ్యంపైన
# సంఘ్‌పరివార్ దాడి

# కంధమల్ నుండి కరావళి దాకా
# ప్రజాస్వామ్యంపైన సంఘ్ పరివార్ దాడి


మానవహక్కుల వేదిక ప్రచురణ

ప్రచురణ సంఖ్య: 21
తొలిముద్రణ : అక్టోబర్ 2009
పునర్ముద్రణ : డిసెంబర్ 2022
**వెల : రూ. 50/-**
కవర్ : శ్రావణ్
డిటిపి: కె.వి.ఆర్
ముద్రణ : అనుపమ ప్రింటర్స్, హైదరాబాద్



ప్రతులకు :
**ఎస్. జీవన్ కుమార్**
3-12-117/ఎ-2/1, పి.ఎస్. కాలనీ
గణేష్‌నగర్, రామంతపూర్
హైదరాబాద్ - 500 013, ఫోన్ : 98489 86286
**నవ తెలంగాణ, నవోదయ బుక్ హౌస్‌లు**

మా వెబ్ సైట్స్
www.humanrightsforum.org
www.balagopal.org

# ముందుమాట

ఇది 2008 ఆగస్ట్-సెప్టెంబర్ నెలలలో ఒరిస్సా, కర్నాటక రాష్ట్రాలలో క్రైస్తవులపైన జరిగిన తీవ్రమైన దాడులమీద, ఆ తరువాత కర్నాటకలో కేవలం క్రైస్తవుల పైననే కాక మొత్తంగా 'మన సంస్కృతి' అని దాడి చేసినవారు భావించే ఆచారాలకు భిన్నంగా నడుచుకొంటున్న వారిపైన జరిగిన దాడుల మీద వివిధ హక్కుల సంఘాలు సేకరించిన సమాచారాన్ని పొందుపరచిన నివేదిక. ఈ దాడులకు పాల్పడింది సంఘ్‌పరివార్ సంస్థలు, ప్రధానంగా బజరంగ్‌దళ్. వారి రాజకీయ ముఖం అయిన భారతీయ జనతాపార్టీ అప్పట్లో ఆ రెండు రాష్ట్రాలలోనూ అధికారంలో ఉండింది. కర్నాటకలో ఇప్పటికీ ఉంది. ఆ కారణంగా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు ఉండిపోయింది. ఇంకా నిర్మొగమాటంగా చెప్పాలంటే దాడిచేసిన వారికే సహకరించింది. సంఘ్‌పరివార్ మాతృసంస్థ అయిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) భావజాలం ఆ రెండు రాష్ట్రాలలోనూ మీడియాలో ఎంత బలంగా ఉందంటే కొన్ని అభినందనీయమైన మినహాయింపులతో అవి బాధితుల మీదనే తప్పు పెట్టాయి. వాళ్ల తప్పులవల్లనే వాళ్లపైన దాడి జరిగిందని చెప్పాయి.

ఒరిస్సాలో జరిగిన దాడి గురించి వివిధ హక్కుల సంఘాల ఉమ్మడి నిజనిర్ధారణ కమిటీ విశాఖపట్నంలో తలదాచుకున్న వారితో 2008 సెప్టెంబర్ 18న మాట్లాడి, 20-22 తేదీలలో కంధమల్ జిల్లాలో పర్యటించింది. భువనేశ్వర్, కటక్‌లలోని శిబిరాలలో ఉన్న వారితో అక్టోబర్ 25, 26 తేదీలలోనూ, శ్రీకాకుళం జిల్లాలో తలదాచుకున్నవారితో అక్టోబర్ 30వ తేదీన మాట్లాడింది. కర్నాటకలో నిరుడు సెప్టెంబర్‌లో క్రైస్తవులపైన జరిగిన దాడుల గురించి సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లోని వివిధ తేదీలలో బాధితులతో మాట్లాడడం జరిగింది. ఒక పెద్ద టీం అక్టోబర్ 10-11 తేదీలలో మంగళూరులో పర్యటించింది.

ఆ తరువాత కర్నాటకలో 'మన సంస్కృతి' అని సంఘ్‌పరివార్ భావించే నడవడికను అతిక్రమించిన వారిపైన జరిగిన దాడుల గురించి ఈ సంవత్సరం మార్చినెల దాకా వివిధ సందర్భాలలో సమాచారం సేకరించడం జరిగింది.

ఈ కృషిలో అన్ని సంస్థలూ అన్ని సందర్భాలలో పాల్గొనలేదు గానీ మొత్తం మీద

ఇందులో భాగం పంచుకున్న సంఘాలు ఇవి:

| | | |
|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | : | మానవహక్కుల వేదిక<br>ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం<br>ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ |
| కర్నాటక | : | పీపుల్స్ డెమొక్రటిక్ ఫోరం (పిడిఎఫ్)<br>పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పియుసిఎల్)<br>(ఒరిస్సా, కర్నాటక రాష్ట్ర శాఖలు) |
| పుదుచ్చేరి | : | ఫెడరేషన్ ఫర్ పీపుల్స్ రైట్స్ (ఎఫ్‌పిఆర్) |
| తమిళనాడు | : | కమిటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ లిబర్టీస్ (సిపిసిఎల్)<br>పీపుల్స్ యూనియన్ ఫర్ హ్యూమన్ రైట్స్ (పియుహెచ్‌ఆర్) |
| ముంబాయి | : | కమిటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమొక్రటిక్ రైట్స్ (సిపిడిఆర్) |

ఈ విస్తృత అధ్యయనం ఫలితాన్ని ఇంగ్లీష్‌లో అన్ని సంస్థల ఉమ్మడి నివేదికగా ప్రచురించాము గానీ తెలుగులో మా ప్రచురణగానే తెస్తున్నాము.

1 అక్టోబర్ 2009

హైదరాబాద్

**మానవహక్కుల వేదిక**

**Human Rights Forum (HRF)**

# ప్రస్తావన

**ఒరిస్సా** కర్నాటక రాష్ట్రాలలో 2008 ఆగస్ట్-సెప్టెంబర్ నెలలలో క్రైస్తవులపైన బజరంగ్‌దళ్ తదితర సంఘ్ పరివార్ సంస్థలు చేసిన హింసాత్మక దాడులు దేశవ్యాప్తంగా ఆగ్రహాన్నీ ఆవేదననూ కలుగజేసాయి. క్రైస్తవులేకాదు, భారతదేశం ఒక ప్రజాస్వామ్య దేశంగా, నాగరిక సమాజంగా ఉండాలని కోరుకునే వారందరూ తీవ్ర ఆందోళనకు లోనయ్యారు.

కానీ ఆశ్చర్యపోయి ఉండే అవకాశం లేదు. తమకు అధికారం ఉన్న ప్రాంతాలను హత్యారాజకీయాల 'ప్రయోగశాలలు'గా సంఘ్‌పరివార్ ప్రకటించిన నాడే ఇటువంటివి జరగగలవని అర్థం అయి ఉండాలి. 2002లో గుజరాత్‌లో జరిగిన మారణకాండను ప్రస్తావిస్తూ 'గుజరాత్ ప్రయోగం' విజయవంతమయిందనీ దానిని దేశమంతటా అమలు చేస్తామనీ ప్రవీణ్ తొగాడియా వంటి దురహంకారి మాత్రమే కాదు, మేధావులుగా గుర్తింపు ఉన్న అరుణ్‌జైట్లీ, జస్వంత్ సింగ్ వంటి వారు, పెద్దమనుషులలాగా కనిపించే సుష్మాస్వరాజ్, వెంకయ్య నాయుడు వంటివారు ఆనాడే ప్రకటించారు. ఒరిస్సాకు సంబంధించినంతవరకూ ఒక సంవత్సరం క్రిందనే బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ సుభాష్ చౌహాన్ ఒక సామాజిక శాస్త్రవేత్తతో మాట్లాడుతూ 'భారతదేశంలో ఒరిస్సా రెండవ హిందూ రాష్ట్రం' అన్నాడు. (గుజరాత్ మొదటిది కాబోలు)

గుజరాత్ 'ప్రయోగం' వారికి దేశమంతటా అమలు చేయడానికి అందిచ్చిన సూత్రం ఏమిటంటే, బల ప్రయోగంతో మైనారిటీల మెడలు వంచినట్టయితే హిందూ దేశంగా తాము రూపొందించగోరే భారతదేశంలో రెండవ శ్రేణి పౌరులుగా నోరు మూసుకుని బతకడానికి వారు సిద్ధపడతారనేది. ఇప్పటికే దేశంలోని ఉత్తర, పశ్చిమ ప్రాంతాలలో చాలా చోట్ల వారు మైనారిటీలను ఈ స్థితికి తీసుకొచ్చారు. కర్నాటకను వారు చాలా కాలంగా దక్షిణ భారతానికి ముఖద్వారంగా వర్ణిస్తున్నారు. ఇక ఒరిస్సాలోని కంధమల్ జిల్లా అంటారా, అది మనం చూసేదాన్ని బట్టి దక్షిణానికైనా తూర్పుకయినా ముఖద్వారమని వ్యాఖ్యానించవచ్చు. ఆగస్ట్-సెప్టెంబర్ 2008లో హింసాత్మక దాడులకు గురయిన కంధమల్‌వాసులు రెండు వైపులా పారిపోయారు. దక్షిణం లేక

ఆగ్నేయం దిశగా విశాఖపట్నంవైపు, తూర్పు లేక ఈశాన్యం దిశగా కటక్ వైపు.

ఒరిస్సా, కర్నాటకలలో జరిగిన దాడుల మధ్య ఒక విచిత్రమైన సంబంధం ఉంది. ఒరిస్సాలో దాడులు 2008 ఆగస్ట్ 24న మొదలయ్యాయి. 29వ తేదీనాడు ఈ దాడులపట్ల నిరసన తెలుపుతూ కర్నాటకలో క్రైస్తవ సంస్థల యాజమాన్యంలో వున్న విద్యాలయాలను ఒక దినం మూసేయడం జరిగింది. అటువంటి నిరసన చర్యలు ఇతర రాష్ట్రాలలోనూ క్రైస్తవ విద్యాసంస్థలు చేపట్టే ఉంటాయి గానీ కర్నాటకలో సంఘ్‌పరివార్ ప్రభుత్వం అధికారంలో ఉంది. వారు ఈ నిరసనను సీరియస్‌గా తీసుకున్నారు. విద్యా సంస్థలను ఏ అధికారంతో మూసేసారో వివరణ ఇయ్యవలసిందిగా క్రైస్తవ సంస్థలకు కర్నాటక ప్రభుత్వం నోటీసు జారీ చేసింది. ఇంతకూ కర్నాటక ప్రభుత్వానికి ఈ విషయంలో ఫిర్యాదు చేసింది ఎవరు? బజరంగ్‌దళ్ చేసిన ఫిర్యాదు మీదే నోటీసు ఇచ్చినట్టు ఆ నోటీసులే తెలుపుతాయి! తరువాతి నెలలో కర్నాటకలో క్రైస్తవులపైన జరిగిన దాడులకు ఇదే నాంది అని వారు భావిస్తున్నారు. యెడ్యూరప్ప బెంగుళూరులో గద్దెనెక్కిన నాటినుండి ఇటువంటి సందర్భం కోసం బజరంగ్‌దళ్ ఎదురు చూస్తున్నట్టు అర్థం అవుతుంది.

సంఘ్‌పరివార్ ఒక పద్ధతి ప్రకారం అబద్ధాలను ప్రచారం చేస్తుంది, పథకం రచించి క్రూరమైన హింసకు పాల్పడుతుంది. అబద్ధాలను కేవలం ప్రచురణల ద్వారానే కాక బ్రాహ్మణీకరణ చెందిన సామాజిక వర్గాల మాధ్యమం ద్వారానూ ప్రచారం చేస్తుంది. ఈ మాధ్యమం సంఘ్ పరివార్ సంస్థల సభ్యత్వాన్ని దాటి చాలా దూరం పోతుంది. సెక్యులర్ రాజకీయ శక్తుల ప్రభావంలో ఉన్నట్టు భావించే సామాజిక వర్గాలలోకి కూడ ఇది చొచ్చుకు పోతుంది. వారు ప్రచారం చేసే అబద్ధాల పరిధి విస్తృతమైనది. దేశ చరిత్ర, మన సమాజం, సమకాలీన వ్యక్తులు, సమకాలీన సంఘటనలు అన్నిటినీ అది తాకుతుంది. భౌతిక దాడి మొదలు పెట్టేముందు అబద్ధాలను ఒకదానిమీద ఒకటి పేర్చి కుప్ప చేస్తారు. దాడి మొదలయ్యే నాటికి దానిని సమర్థించుకోవడానికి అవసరమైన అబద్ధాలన్నీ తయారుగా ఉంటాయి.

సంఘ్‌పరివార్ భౌతిక దాడితోనే మొదలు పెట్టదు. సంస్కృతి గురించి, భారతీయత గురించి మాట్లాడుతుంటుంది. గణేశ్ నిమజ్జనాలు, దుర్గ పూజలు చేస్తుంటుంది. త్రిశూలాలు, తల్వార్లు బయటకు తీసే సమయం ఆసన్నమయేదాకా తన బ్రాండు సాంస్కృతిక ప్రచారం ప్రదర్శనాత్మకంగా చేస్తూ ఉంటుంది. తరచుగా దాడి చేసే అదను కోసం తన రాజకీయ బంధువయిన భారతీయ జనతాపార్టీ ఆ రాష్ట్రంలో లేక ప్రాంతంలో అధికారంలోకి వచ్చి పోలీసు యంత్రాంగాన్ని అదుపులోకి తెచ్చుకునేదాకా ఆగుతుంది.

హెడ్గెవార్, గోల్వాల్కర్ల వారసుల నైజం ఇదని హక్కుల సంఘాలకు తెలుసు. ఇది మళ్ళీ మళ్ళీ కనిపెట్టవలసిన విషయం కాదు. మరి కంధమల్ అడవులలోనూ పశ్చిమ కర్నాటకలోని కరావళి ప్రాంతపు కొండలలో మైదానంలోనూ నిజ నిర్ధారణ చేయడం దేనికోసం అంటే ఈ సత్యాన్ని రుజువు చేయడం కోసం కాదు. దాని వ్యక్తీకరణ రూపాలను అధ్యయనం చేయడం కోసం, అది మన సమాజంలో ఉన్న పగుళ్లను, నెర్రెలను వాడుకునే వైనాన్ని అర్థం చేసుకోవడం కోసం, ఇతర 'ప్రయోగశాలల'లో వారి 'ప్రయోగాలను' నివారించడానికి ఏం చేయాలో తెలుసుకోవడం కోసం.

సంఘ్‌పరివార్ పైన పోరాటం – భారతదేశాన్ని మనం ఏవిధంగా భావించుకుంటాం, ఏవిధంగా రూపొందించుకుంటాం అనే విషయాలకు సంబంధించిన పోరాటం. ఆ పోరాటం రాజకీయరంగంలో ఉండవచ్చు, పౌర సమాజంలో ఉండవచ్చు, అధికారం గురించి కావచ్చు, విలువలకు సంబంధించినది కావచ్చు. మనము ఏ రకమైన భారతదేశాన్ని కోరుకుంటున్నాం? సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయానికి కట్టుబడి ఉన్న సమాజం, భయం నుండి లేమి నుండి విముక్తమైన సమాజం, ఆలోచనలకూ విశ్వాసాలకూ స్వేచ్ఛ ఉండే సమాజం, మనిషికి మనిషిగా విలువ ఇచ్చే సమాజం, సమాన అభివృద్ధికీ ఇతర సమాజాలతో శాంతియుత సంబంధాలకూ ప్రకృతితో సమతుల్య సహజీవనానికీ భరోసా ఇచ్చే సమాజం (ఒక్క మాటలో చెప్పాలంటే సమానతా విలువను ప్రాతిపదికగా గల సమాజం) కోరుకుంటున్నామా? లేక హెచ్చుతగ్గుల నిచ్చెన మెట్ల నమూనాలో రూపొంది అధికార కాంక్షను వ్యవస్థీకరించిన సమాజం కోరుకుంటున్నామా? ప్రశ్న ఈ విధంగా వేస్తే జవాబు సులభమనే అనిపిస్తుందిగానీ జీవితంలోని అభద్రత, సంప్రదాయక అణచివేత వ్యవస్థలనుండి పుట్టిన అమానుషత్వం, వృద్ధిరేటును ఆరాధించే రాజకీయార్థిక వ్యవస్థ నుండి ఉత్పన్నమయిన సంక్షోభం దానిని కష్టతరం చేస్తున్నాయి. సంఘ్‌పరివార్ ఆ అభద్రతను, లేమిని అవకాశంగా తీసుకొని, తాను నమ్మే నిచ్చెన మెట్ల వ్యవస్థ వల్ల నష్టపోయే సామాజిక వర్గాలలో సహితం ఆవేశాలు రెచ్చగొడుతుంది. విధ్వంసకరమైన వారి ఆచరణను ఎదుర్కొనడానికి నిర్దిష్టమైన కార్యాచరణ అవసరం. అది సాధ్యం కావాలంటే ఆ విధ్వంసం ఏవిధంగా పని చేస్తుందో తెలుసుకోవడం అవసరం. ఈ నివేదిక తయారు చేయడంలో మేము ఆ అవసరాన్ని దృష్టిలో పెట్టుకున్నాము. అందుకోసం చారిత్రక పూర్వరంగాన్ని ఒకసారి స్పృశించి ఘటనల వివరాలలోకి పోదాం.

# ఒరిస్సా : పూర్వరంగం

**ఒరిస్సా** రాష్ట్రంలో హింసాకాండ ప్రధానంగా కంధమల్ జిల్లాలో జరిగింది. వేరే ఎక్కడయినా జరిగి ఉండవచ్చును గానీ కంధమల్ లక్ష్మణానంద సరస్వతి కార్యక్షేత్రం కావడంవల్ల, అతని హత్య హింసాకాండకు నాంది కావడం వల్ల, కంధమల్ జిల్లాలో జరిగింది. యాభై సంవత్సరాలకు పైగా ఆర్ఎస్ఎస్ ఒరిస్సా రాష్ట్రమంతటా తన అజెండాను అమలు చేస్తున్నది. దాని రాజకీయ ప్రతినిధి అయిన బిజెపి అప్పటికి రెండు పర్యాయాలు బిజు జనతాదళ్ (బిజెడి)తో కలిసి ఆ రాష్ట్రంలో అధికారంలో ఉంది. ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థలయిన బజరంగ్‌దళ్, విశ్వహిందూపరిషత్ తదితరుల అక్రమాలను బిజెడి చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నది. దీనికి గల కారణాన్ని అర్థం చేసుకోవడం కష్టంకాదు. హైందవ సమాజానికి తానే ఏకైక ప్రతినిధి అన్న సంఘ్ పరివార్ ప్రకటన ఇతర రాజకీయ పార్టీలను అభద్రతకు గురిచేస్తున్నది. వారికి నిజానికి తాము ప్రకటించుకునే లౌకికత పట్ల గట్టి నమ్మకం లేదు. అది ఒక అసహజమైన విలువ అని వారి మనసులలోనే సందేహం ఉంది. అందువల్ల బిజెపిని గట్టిగా వ్యతిరేకిస్తే హిందూ ఓటర్లు తమకు దూరం అవుతారేమోనని వారికే భయం. ఒరిస్సాలోనే కాదు, దేశమంతటా కూడ అగ్రకుల మధ్యతరగతి ఆలోచనా రీతులు ఆర్ఎస్ఎస్‌కు చాలా సన్నిహితం. మన దేశంలోని రాజకీయ పార్టీలు ఎక్కువ భాగం ఈ వర్గం పెత్తనంకిందే ఉన్నాయి. భారత రాజకీయాలలో లౌకికవాదం బలహీనంగా ఉండడానికి గల కారణాలలో ఇదొకటి. ప్రళయ్ కనుంగో అనే ఒరిస్సాకు చెందిన పరిశోధకుడు, ఎకనమిక్ అంటే పొలిటికల్ వీక్లీ 2003 ఆగస్ట్ 2వ తేదీ సంచికలో రాసిన ఒక వ్యాసంలో ఆ రాష్ట్రంలో ఆర్ఎస్ఎస్ ఎదుగుదలకు దాని సభ్యులు కానటువంటి కాంగ్రెస్‌వారూ ఇతర ప్రముఖులూ ఎంతగా తోడ్పడిందీ వివరించారు. ఇది దేశమంతటికీ వర్తిస్తుంది.

ఆర్ఎస్ఎస్ భావజాలం చాతుర్వర్ణ్యాన్ని ప్రత్యక్షంగానూ, ఒక్కొక్కసారి ఆధునిక పరిభాషలో ముస్తాబు చేసి పరోక్షంగానూ అనుసరిస్తుంది. అది బ్రాహ్మణులకు, బ్రాహ్మణీకరణ చెందిన ఇతర అగ్రకులాలకు మాత్రమే స్వతహాగా ఆకర్షణీయంగా ఉంటుంది. అయితే ఆ కులాలను దాటిన విస్తృత

సామాజిక పునాదిని అన్వేషించే క్రమంలో ఆర్ఎస్ఎస్ తన అనుబంధ సంస్థలయిన విశ్వహిందూపరిషత్ తదితర వేదికలద్వారా శ్రామిక ప్రజలు ఆదరించే దేవతల పూజలను వినియోగించుకొని ఈ పరిమితిని అధిగమించే ప్రయత్నం చేసింది. పైన ప్రస్తావించిన వ్యాసంలో పూరీజగన్నాధుని ఆదివాసీ మూలాలను అంగీకరించడం ద్వారా ఆదివాసీ ప్రజలను కలుపుకోవడానికి ఆర్ఎస్ఎస్ చేసిన ప్రయత్నాన్ని ప్రళయ్ కనుంగో వివరించారు. పూరీ జగన్నాధుడు ఒరిస్సాలో అత్యంత ఆదరణగల దేవుడు. దాదాపు ఒరిస్సాలో హైందవానికి అతడు చిహ్నమని చెప్పవచ్చు. అతని మూలాలు ఆదివాసీ ప్రజల పూజలలో ఉన్నాయని ఒప్పుకోవడం ఆదివాసులను హైందవం వైపు ఆకర్షించడానికి శక్తివంతంగా పని చేస్తుందనడంలో సందేహం లేదు. ఆ రాష్ట్రంలో నాలుగవ వంతు జనాభా ఆదివాసులేనని గుర్తుంచుకుంటే దీని ప్రాముఖ్యం అర్థం అవుతుంది. ఇతర రాష్ట్రాలలో, ఇతర అణగారిన సామాజిక వర్గాలను కలుపుకోవడానికి దుర్గపూజ, గణేశ్‌పూజ పనికొచ్చాయి. ఈ వర్గాలు తమను తాము 'హిందువులుగా' (కనీసం ఆర్ఎస్ఎస్ ఉపయోగించే అర్థంలో) భావించవు. ఒకవేళ భావించినట్టయితే చాలా హీనమయిన స్థితిలో తమను తాము చూసుకోవలసి ఉంటుంది. అటువంటి ప్రజల హైందవీకరణ క్రమాన్ని ఆర్ఎస్ఎస్ ఈ పద్ధతిలో చేపట్టింది.


## హైందవీకరణ

అయితే ఈ హైందవీకరణ దానంతటది ఒక లక్ష్యమేకాక వేరే లక్ష్యాలకు సాధనం కూడ. ఒరిస్సాకు సంబంధించినంత వరకు క్రైస్తవం వ్యాప్తిని నిరోధించడానికి అదొక సాధనం. క్రైస్తవం వ్యాప్తి తీర ప్రాంత మైదానాల కంటే ఆదివాసీ ప్రాంతాలలో ఎక్కువ జరిగింది. దీనిని నిరోధించడం కూడ దానంతటది ఒక లక్ష్యమే కాక వేరే లక్ష్యానికి సాధనం. ఆదివాసులలో హైందవ గుర్తింపును బలోపేతం చేసి వారిని సంఘ్‌పరివార్ గుప్పిట్లోకి తెచ్చుకొని భారతదేశ భవితవ్యానికి సంబంధించిన సంఘ్ పరివార్ లక్ష్యానికి వారిని సాధనంగా వాడుకోవాలన్నది ఆలోచన. ఆదివాసులు, దళితులు, ఇతర అణగారిన వర్గాల ప్రజల దేవతలకూ పూజలకూ హైందవంలో ప్రదర్శనాత్మకమైన స్థానం కల్పించడం ద్వారా వారిని ఆకర్షించడం, ముస్లింలనూ క్రైస్తవులనూ ఈ హైందవానికి శత్రువులుగాను, ఈ హైందవానికి నిలయమైన భారత్‌లో ద్రోహులుగాను చూపించడం, ఆ ప్రజలను ఈ ద్రోహులపైకి రెచ్చగొట్టడం, ఆ క్రమంలో వారికి హైందవంతో ఉన్న మమేకతను పెంచడం, సంఘ్ పరివార్‌తో వారి అనుబంధాన్ని పెంచడం, దానిని వాడుకొని దేశంపైన తన ఆధిపత్యాన్ని బలోపేతం చేసుకొని ఈ దేశ భవితవ్యాన్ని తిరగరాయడానికి కావలసిన శక్తిని పొందటం – ఇది ఆర్ఎస్ఎస్ దేశవ్యాప్తంగా అనుసరిస్తున్న విధ్వంసకరమైన వ్యూహం. దీనికి బజరంగ్‌దళ్ వంటి సంఘ్‌పరివార్ సంస్థలను సాధనాలుగా ప్రయోగించి తన ప్రభావం వ్యాప్తికి తన మనువాద దృక్పథం నుండి వచ్చే పరిమితులను అధిగమించే ఎత్తుగడ వేస్తున్నది. అయితే సంఘ్‌పరివార్ యావత్తు ఆర్ఎస్ఎస్ యొక్క మనువాద ప్రాపంచిక దృక్పథం అదుపులోనే ఉంటుంది. అందులో రాజీ ఉండదు. అంతిమంగా ఆర్ఎస్ఎస్ కాంక్షించేది మాత్రం కేవలం అన్యమతస్తులు రెండవ శ్రేణి పౌరులుగా బతికే హిందూ రాష్ట్రం కాదు. ఆధిపత్యం, పెత్తనం అనే విలువలను నిక్షిప్తం చేసుకున్న సామాజిక ఆర్థిక వ్యవస్థ. ఇది పిడికెడు మంది పెత్తందార్లకు తప్ప అందరికీ శత్రువే. అందుకే సంఘ్

పరివార్‌పైన పోరాటం కేవలం మైనారిటీల హక్కులకోసం, మనుగడ కోసం పోరాటం కాదు. మన దేశం కోసం, మన సమాజం కోసం పోరాటం.

కంధమల్‌లో జరిగిన హింసాకాండలో ఈ వ్యూహం ప్రతిఫలనాన్ని చూడవచ్చు. 23 ఆగస్ట్ 2008 నాడు జాలస్‌పేటలో లక్ష్మణానంద సరస్వతి హత్యకు గురయ్యాడు. క్రైస్తవ మిషనరీలే అతనిని చంపారు లేక చంపించారు అనీ, వారు ఘనంగా చెప్పుకునే విద్యా ఆరోగ్య సేవలు అతను కూడ అందిస్తున్నందుకే చంపారనీ సంఘ్‌పరివార్ వెంటనే ప్రచారం చేపట్టింది. (క్రైస్తవ మిషనరీలు ఆ సేవలు అందిస్తున్నట్టు వీళ్లు ఒప్పుకున్నట్టయితే వాళ్లు దేశద్రోహులు, దేశానికి శత్రువులు ఎట్లా అయ్యారో!). క్రైస్తవ మిషనరీలు చేపట్టిన విద్యా తదితర సేవలకూ లక్ష్మణానంద అందిచ్చిన సేవలకూ మూడు ముఖ్యమైన తేడాలున్నాయి. ఒకటి, మిషనరీలు మతమార్పిడి చేసారుగానీ వారి సేవలకు అది షరతుకాదు, అన్ని వేళలా అదే వారి లక్ష్యం కాదు. లక్ష్మణానంద సేవలకు ఆదివాసుల హైందవీకరణ ప్రత్యక్ష లక్ష్యం. రెండు, మిషనరీలు తమ స్కూళ్లలో పిల్లల చేత బైబిల్ చదివించి ఉండవచ్చును గానీ ప్రాధమికంగా వారికి జీవితంలో ఉపయోగపడే లౌకిక విద్య బోధించారు. లక్ష్మణానంద పాఠశాలలు సంస్కృతం నేర్పాయి, సంఘ్‌పరివార్ నమ్మే హైందవ సంస్కృతి నేర్పాయి. మూడు, మిషనరీలు మతమార్పిడి కోసమైనా, మతం మార్చుకున్న వారు వెనక్కి పోకుండ నిరోధించడం కోసమైనా హింస ఎప్పుడూ ప్రయోగించలేదు. లక్ష్మణానంద క్రైస్తవం వ్యాప్తిని నిరోధించడానికి అత్యంత హింసాత్మకమైన పద్ధతులు ప్రయోగించాడు. మతం మార్చుకున్న వారిని హిందువులుగా మార్చడానికి అత్యంత అవమానకరమైన తంతు రూపొందించాడు.

ఈ విషయాలు సులభంగానే అందరికీ అర్థం అయిఉండాలిగానీ భారతదేశంలోని ఆదివాసులు, దళితులు హిందువులనీ, వారిని క్రైస్తవంలోకి మార్చడం మతమార్పిడి అవుతుంది తప్ప వారిని హైందవీకరించడం మతమార్పిడి కాదనీ, క్రైస్తవులుగా మారిన వారిని హైందవ సంప్రదాయంలోకి తీసుకురావడం కేవలం పునరాగమనమేననీ (లక్ష్మణానంద పరిభాషలో 'ఘర్‌వాపసీ' అని) అనాలోచితంగా చాలామంది నమ్ముతుండడం వల్ల లక్ష్మణానంద చర్యలతో ఏకీభావం లేని వారికి సహితం ఈ విషయాలు చెప్తే తప్ప అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. భారతదేశపు ఆదివాసుల పూజలు, సంప్రదాయాలు కాలక్రమంలో కొంత హైందవీకరణ చెంది ఉండవచ్చును గానీ వారు హిందువులు కారు. ఈ విషయం మానవ శాస్త్రమేకాక చట్టం కూడ గుర్తించింది. హిందువుల సంప్రదాయాలను క్రోడీకరించే అన్ని చట్టాలలోనూ హిందువు అనే వర్గీకరణలో షెడ్యూల్డు తెగలు రారని చట్టసభలు అన్నాయి. ఇక దళితులు నాలుగు వర్ణాల హైందవ వ్యవస్థకు వెలుపల ఉన్న అవర్ణులు. ఈ రెండు వర్గాల క్రైస్తవీకరణ లాగే హైందవీకరణకూడ మతమార్పిడియే. కంధమల్ జిల్లాలో బలవంతపు మతమార్పిడిని నిషేధించే 'ఒరిస్సా మత స్వేచ్ఛ చట్టం, 1967' కింద అందరికంటే ముందు అరెస్టు చేయవలసింది మతమార్పిడికి బలప్రయోగంతో కూడిన సంస్కారాలను తయారుచేసి అమలు చేసిన లక్ష్మణానంద సరస్వతిని. దీనిని వివరించి చెప్తే తప్ప అర్థంకాకపోవడానికి ఒక కారణం మెజారిటీ మతతత్వాన్ని కూడ మైనారిటీ మతతత్వంలాగ ఒక మతతత్వంగా చూడలేకపోవడం. అంతేకాక ఇండియాను హైందవంతో సమానంగా చూసే భావజాలాన్ని ఛేదించలేక పోవడం. ఈ భావజాలానికి




**లక్ష్మణానంద మృత దేహాన్ని ఊరేగించిన మార్గం**

కర్త కేవలం ఆర్ఎస్ఎస్కాదు. ఏ దురుద్దేశ్యం లేనట్టు కనిపించే జాతీయవాదులు చాలామంది పాత్ర కూడా ఇందులో ఉంది.

## కంధాలు, పాణోలు

ముందు మరికొన్ని విషయాలు చూద్దాం. కంధమల్ హింసలో ప్రధానంగా దెబ్బతిన్నది క్రైస్తవ పాణోలు. పాణో అనేది ఒక దళిత కులం. ఈ జిల్లాలో వారిలో అందరూ కాకున్నా చాలామంది క్రైస్తవం పుచ్చుకున్నారు. వారిపైన దాడి చేసింది బజరంగ్దళ్. బజరంగ్దళ్ ఈ దాడిలో ప్రధానంగా సమీకరించింది కోందు లేక కంధా అనే ఆదివాసీ తెగను. కంధాలు కంధమల్ జిల్లాలోని ప్రధాన ఆదివాసీ తెగ. కంధమల్ ఒరిస్సా మధ్యభాగాన ఉంది. అది కొండలమయమైన జిల్లా. మొదట్లో బౌధ్తో కలిసి బౌధ్కంధమల్ జిల్లాలో సగభాగంగా ఉండేది. అయితే 1994 ఏప్రిల్ 1న బౌధ్ను వేరే జిల్లాచేసి మిగిలిన దానికి ఫూల్బని జిల్లా అని పేరు పెట్టారు. అదే సంవత్సరం ఫూల్బని జిల్లా పేరు కంధమల్ జిల్లాగా మార్చారు. ఈ పేరు మార్పిడి న్యాయమైనదే, ఎందుకంటే ఆ జిల్లా జనాభాలో మెజారిటీ ఆదివాసులు, వారిలో అత్యధికులు కంధాలు. అయితే ఈ మార్పు ఒక వికృతమైన మత ఘర్షణ పెట్టిన ఒత్తిడి కారణంగా జరిగింది.

కంధమల్ జిల్లా జనాభాలో 52.7 శాతం ఆదివాసులు. అందులో 89 శాతం కంధాలు (తక్కిన వారు గోండు, సవర మొదలయినవారు). దళితులు జిల్లా జనాభాలో 16.9 శాతం. వారిలో

అత్యధికులు పాణోలు (తక్కిన వారు డోం, ఘాసి తదితర కులాలవారు). మిగిలిన దాదాపు 30 శాతం జనాభా సవర్ణ హిందువులు. వీరిని కంధాలు, పాణోలు కూడ 'ఒరియాలు' అని పిలుస్తారు. భాష దీనికి కారణం కావచ్చు. సవర్ణ హిందువులు ఒరియా మాట్లాడతారు. అది కంధాల భాషకాదు, పాణోల భాష కాదు. ఈ ఒరియాలలో బ్రాహ్మణులు, కరణ్ లేక కాయస్తులు, సారా వ్యాపారులయిన సుందీలు, తెలుగు కోమట్లు ప్రధాన కులాలు.

కంధమల్ జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. ఒకటి కంధమల్, రెండవది బాలిగుడ. కంధమల్ డివిజన్ 1500 అడుగుల ఎత్తున ఉన్న దట్టమయిన అడవుల మయమయిన పీఠభూమి. దాని చుట్టూ ఎత్తయిన కొండలున్నాయి. బాలిగుడ కొండ ప్రాంతం. దాని ఎత్తు 3300 అడుగుల దాకా పోతుంది. అయితే తూర్పున సస్యశ్యామలమయిన లోయలున్నాయి. బాలిగుడలోని దరింగబాడిని 'ఒరిస్సా రాష్ట్రపు కాశ్మీర్' అంటారట. ఎందుకంటే అక్కడ శీతాకాలంలో మంచు కురుస్తుందంట. అది నిజమయితే తూర్పు కనుమలలో మంచుకురిసే ఏకైక ప్రదేశం దరింగబాడి అయివుండాలి. మంచు సంగతి అట్లాగుంచి, ఇవ్వాళ అక్కడ నెలకొన్న భీతావహవాతావరణం కారణంగా దానిని 'ఒరిస్సా రాష్ట్రపు కాశ్మీర్' అనడం ఉచితమేనేమో!

2008 నాటి హింసాకాండ ప్రధానంగా బాలిగుడ డివిజన్‌లో జరిగింది. బాలిగుడ, జి. ఉదయగిరి ఈ డివిజన్‌లోని తాలూకాలు. పంచాయతి బ్లాకులు బాలిగుడ, చకాపద, దరింగబాడి, జి. ఉదయగిరి, కె. నువాగాం, రైకియా, తికాబలి, తుమిడిబంద. పాణోలకూ కంధాలకూ మధ్యనున్న వైరం ఈ హింసాకాండకు మూలం అని చూపబడుతున్నది కాబట్టి వారి మధ్యనున్న సంబంధాన్ని కొంచెం వివరంగా చూద్దాం. కంధాలు నిస్సందేహంగా ఆ ప్రాంతానికి స్థానికులు కాగా పాణోలు కోస్తా ప్రాంతం నుండి వచ్చిన బయటివారు. అయితే వాళ్లు వచ్చింది ఈ మధ్యకాదు. 200 సంవత్సరాలకు పైగా అక్కడున్నారు. బ్రిటిష్ జమానాలో 1908లో ప్రచురించిన జిల్లా గెజెటీర్ వారిని కంధాల భూములు సాగుచేసే కౌలుదార్లుగా వర్ణించింది. వారి స్థితి బానిసలవంటిదని సూచించే పదాలు గెజెటీర్ ప్రయోగించింది. ప్రతీ కంధా గ్రామానికీ అనుబంధంగా పాణోలగూడెం ఒకటి ఉండేదని అంటారు. వలస వచ్చిన పాణోలు కంధాలకు ఎంత దగ్గరంటే, మైదాన ప్రాంతంలో ఉండిపోయిన పాణోలను దేశీపాణోలు అనీ, అడవులలోనికి వలస వెళ్ళిన వారిని కోందు పాణోలు అనీ పిలిచేవారని మానవ వికాస శాస్త్రజ్ఞుడు థర్స్టన్ అంటాడు. 1891 జనాభా లెక్కలలో పాణోలు అనేకులు తమను తాము కంధాలు అని చెప్పుకున్నారని కూడ ఆయన అంటాడు. ఆనాడు ఎవరికీ ప్రత్యేకమైన హక్కులు లేవు కాబట్టి ఇందులో దురుద్దేశ్యం ఉండే అవకాశం లేదు.

ఈ రోజు కూడ ఇతర గిరిజనేతరులు రహదార్లమీద ఉన్న పెద్ద ఊర్లలో నివసిస్తుండగా పాణోలు మాత్రమే కంధాలతోబాటు అడవి లోతట్టు గ్రామాలలో నివసిస్తున్నారు. బాలిగుడ సమీపంలోని దమీకియా గ్రామానికి చెందిన ఒక కంధా మాతో మాట్లాడుతూ, పాణోలు ఈ నాటికీ వేరే పద్ధతిలో కంధాల భూములు కౌలుకు తీసుకుంటున్నారని అన్నాడు. ఆదివాసీ గ్రామ కమిటీ అనుమతితో పాణోలు ఒకటి రెండేళ్ల పాటు కొంత భూమిని సాగుచేసి తిరిగి ఇచ్చేస్తారని చెప్పాడు. బహుశా, భూమిలేని అవర్ణులైన పాణోలు జీవనం కోసం అన్వేషిస్తూ అడవులలోకి వచ్చి, ఆహార సేకరణ చేస్తున్న ఆదివాసుల భూములను వారి అనుమతితో తీసుకొని సాగుచేసి ఉండవచ్చు. బ్రిటిష్

పాలకులు అటువంటి వలసలను ప్రోత్సహించారని ఒక వామపక్ష సంస్థ ప్రచురించిన కరపత్రం పేర్కొంది. సాగు విస్తీర్ణాన్నీ భూమి శిస్తు పరిమాణాన్నీ పెంచడం కోసం ప్రోత్సహించి ఉండవచ్చు. కంధమల్ డివిజన్‌లోని గ్రామాలలో కంధాలు పాణోలను అంటరానివారిగా చూస్తారుగానీ బాలిగుడ డివిజన్‌లో అది లేదు. అక్కడ కుయి సంస్కృతి, కుయి సమాజం అనే భావనలు నిన్న మొన్నటి దాకా బలంగా ఉండేవి. ఆ కుయి సమాజంలో కంధాలు, పాణోలు ఇద్దరూ భాగమే.

1908 నాటి గెజెటీర్ ప్రకారం పాణోలు కంధాలకు సలహాదార్లు, అప్పులవాళ్లు కూడ. బయటి ప్రపంచానికీ కంధాలకూ మధ్య సంధానకర్తలుగా వ్యవహరించేవారు. మైదాన ప్రాంతానికి చెందినవారు కాబట్టి వారికి ఈ పాత్ర తగినది. అయితే కంధాలు ధరణిపేను (భూమి దేవత) కు ఇచ్చే మానవ బలి విషయంలో పాణోలకు ఇబ్బందికరమైన పాత్ర ఉండింది. బలి ఇవ్వబడే వ్యక్తిని 'మెరయ్యా' అనేవారు. ఈ మెరయ్యాను మైదాన ప్రాంతాలనుండి కొని, లేక అపహరించి పాణోలు తీసుకువచ్చి కంధాలకు ఇవ్వాలి. లేకపోతే తమ పిల్లలనే అప్పగించాలి. ఈ మెరయ్యాలను కంధాలు వెంటనే చంపరు. వారు కంధాల గ్రామంలో అందరితోబాటు పెరుగుతారు. బలి ఇచ్చేదాకా బాగానే చూసుకునేవారు.

సారాంశంలో, కంధాలకూ పాణోలకూ మధ్య సంబంధం ఇబ్బందికరంగా ఉండి ఉండాలి. 1908 గెజెటీర్ పాణోలను 'దుర్మార్గులు, చతురులు, నీతిలేనివారు' అని వర్ణించడాన్ని 1983లో ఒరిస్సా ప్రభుత్వం ప్రచురించిన గెజెటీర్ తప్పుపట్టింది. బహుశా మెరుగయిన పంట తీయడం కోసం మైదాన ప్రాంతాలవాళ్లను కౌలుదార్లుగా నియమించినప్పటికీ, వారిని అనుమానంగా చూసిన ఆదివాసుల వైఖరినే వలసకాలం నాటి గెజెటీర్ అనుకరించిందేమో. ఈ సంబంధం గురించి ప్రఖ్యాత మానవ వికాసశాస్త్రవేత్త వెరియర్ ఎల్విన్ ఈ విధంగా అన్నాడు. 'కంధాలు పాణోలను బయటి ప్రపంచంనుండి తమను కాపాడే కవచంగా వాడుకుంటారు... పాణోలు కంధాలను దోచుకుంటారు గానీ కాపాడతారు.. కంధాలకు పాణోలంటే సాంఘికంగా చిన్నచూపు గానీ ఆర్థికంగా వారిపైనే ఆధారపడతారు'.

ప్రస్తుత విషయానికొస్తే ఒరిస్సా దేశంలోని అతి పేద రాష్ట్రాలలో ఒకటి. సగటు తలసరి వార్షిక ఆదాయం ఒరిస్సాలో 790 రూపాయలు. బీహార్ రాష్ట్రమొక్కటే అంతకంటే పేదది. ఎస్‌సి, ఎస్‌టిల సగటు తలసరి ఆదాయం (558 రూపాయలు), గ్రామీణ ప్రాంతాల సగటు తలసరి ఆదాయం (422 రూపాయలు) రెండూ బీహార్ కంటే తక్కువే. ఒరిస్సాలో కంధమల్ జిల్లా మరీ పేదది. మానవ అభివృద్ధి సూచిక ప్రకారం ఆ రాష్ట్రంలోని 30 జిల్లాలలో 29వ స్థానంలో ఉంది. ఆ జిల్లాలోని 20 లక్షల ఎకరాల భూభాగంలో 12 శాతం మాత్రమే సాగు యోగ్యమయినది. (రెండు పంటలు వేసే భూమిని లెక్కబెట్టినట్టయితే నికర సాగుభూమి 14.5 శాతం). 71.19 శాతం భూభాగంలో అడవులున్నాయి. తక్కినది (16.8) శాతం) బంజరు భూమి. దళితుల వద్ద (వారిలో పాణోలు అత్యధిక సంఖ్యాకులు) ఉన్న భూమి చాలా స్వల్పం. 80 నుండి 90 శాతం భూమిలేని వారే. జిల్లా జనాభాలో దళితులు 16.9 శాతంకాగా సాగుయోగ్యమైన భూమిలో 9 శాతం మాత్రమే వారి వద్ద ఉంది. జిల్లా తొలినాటి నివాసులయిన ఆదివాసుల దగ్గర 77 శాతం ఉంది. వర్తకులుగా,

అధికారులుగా వచ్చిన సవర్ణ హిందువుల (స్థానిక పరిభాషలో 'ఒరియాలు') వద్ద 14 శాతం ఉంది. అయితే ఇదంతా సాగుయోగ్యమైన 12 శాతం భూభాగంలోనే.

కంధమల్ కొండలను బ్రిటిష్ పాలకులు లోబరచుకున్న క్రమమే సవర్ణ హిందూ కులాలవారి ప్రవేశానికి బాటవేసింది. కంధాల 'మెరయ్యా' నరబలి అమానుషమైనదని చెప్తూ, దానికి ముగింపు పలికే నెపంతో బ్రిటిష్‌వాళ్లు కంధమల్ కొండలలోకి ప్రవేశించారు. అయితే వారి సంస్కరణ కార్యక్రమం బలప్రయోగంతో సాగడాన్నిబట్టి, అది చివరికి కంధమల్ కొండలను బ్రిటిష్ ప్రభుత్వ అజమాయిషీలోకి తీసుకురావడంతో ముగియడాన్ని బట్టి కారణమేమి చెప్పినా సామ్రాజ్య విస్తరణే అసలు లక్ష్యమని అనుమానించడంలో తప్పులేదు. ఇందులో వారికి సహకరించిన గిరిజనేతరులకు ఆ తరువాత నెలకొన్న పాలనా యంత్రాంగంలో చోటు కల్పించారు. కంధమల్ జిల్లా బ్రిటిష్ పాలిత ప్రాంతంలో చేర్చబడ్డ తర్వాత కంధమల్ డివిజన్ బెంగాల్ ప్రెసిడెన్సీలోనూ, బాలిగుడ డివిజన్ మద్రాసు ప్రెసిడెన్సీలోనూ భాగం అయ్యాయి. బెంగాల్ ప్రెసిడెన్సీలోని ప్రాంతంలో ముఠా వ్యవస్థ ఏర్పాటు చేసారు. కొన్ని గ్రామాలను కలిపి ఒక ముఠాగా ఏర్పరచారు. దానికి ఒక ముఠాదారు లేక సర్దారు పెద్ద. ఇతనికి ఆ గ్రామాలలో శాంతి భద్రతలు నెలకొల్పి రెవెన్యూ సేకరించే అధికారం ఇవ్వబడింది. సేకరించే రెవెన్యూలో 12.5 శాతం ముఠాదారుకు చెందుతుంది. చాలాచోట్ల ముఠాదారుగా గిరిజనేతరుడిని నియమించడం జరిగింది. ముఠాదారు ఆ గ్రామాల రైతులనుండి 9 రకాల 'మామూళ్లు' సేకరించే అధికారం కలిగి ఉండేవాడు. దీని అర్థం వెట్టిచాకిరీ తప్ప వేరే ఏమీ కాదు. బాలిగుడ డివిజన్ ప్రాంతం మద్రాసు ప్రెసిడెన్సీలోని గంజాం జమీందారీలో భాగం అయింది. 1839లో ఆ జమిందారీని రద్దుచేసి అక్కడకూడ ముఠా వ్యవస్థ నెలకొల్పారు.

బ్రిటిష్ పాలనలో భాగంగా రోడ్లు వేయడం, స్వంత ఆస్తి వ్యవస్థనూ వర్తకాన్నీ ప్రవేశపెట్టడం కూడ గిరిజనేతరుల ప్రవేశానికీ వ్యాప్తికీ దారి సుగమం చేసింది. సారా వ్యాపారం సుందీలను తీసుకొచ్చింది. ఇది వేగంగా భూమి పరాయీకరణకు దారి తీసిందనడానికి బ్రిటిష్ పాలకులు రెండు ప్రెసిడెన్సీలలోనూ (బెంగాల్‌లో 1902లో, మద్రాసులో 1917లో) జారీ చేసిన భూమి బదలాయింపు నియమాలు తెలుపుతాయి. వీటి సారాంశం ఏమిటంటే ఆదివాసుల భూమిని ప్రభుత్వ అనుమతి లేకుండ ఆదివాసీయేతరులు కొనుక్కోవడానికి వీలులేదు. దీనివల్ల ఫలితం పెద్దగా రాలేదనడానికి బెంగాల్ ప్రాంతంలో 1902 నాటి రెగ్యులేషన్స్ జారీ చేసిన 25 ఏళ్లకు చేపట్టిన సర్వే తెలుపుతుంది. అప్పటికి ఆదివాసుల భూమిలో నాలుగోవంతు చేతులు మారిందని తేలింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఒరిస్సా రాష్ట్ర షెడ్యూల్డు ప్రాంత భూమి బదలాయింపు నియమాలను (రెగ్యులేషన్ 2 ఆఫ్ 1956) కూడ అదే ఉద్దేశ్యంతో జారీ చేసారు. దీని ఫలితం కూడ స్వల్పమేననడానికి రుజువు 2002లో చేసిన సవరణ. ఈ సవరణ ప్రకారం 1956 తరువాత జరిగిన అన్ని అమ్మకాలనూ ప్రభుత్వం పరిశీలించి అవి చట్టబద్ధమో కాదో తేల్చాలి. అవి చట్టబద్ధమని రుజువు చేసుకునే బాధ్యత భూమిని పొందిన గిరిజనేతరుడిపైన ఉంటుంది.

ఈ చరిత్ర పర్యవసానమేమిటంటే జిల్లాలోని సాగుభూమిలో 14 శాతం సవర్ణ హిందువులు (స్థానిక పరిభాషలో 'ఒరియా'ల) చేతిలో ఉంది. వ్యాపారస్తులుగా, పెత్తందార్లుగా కాక ఆదివాసుల భూమిని కౌలుకు సాగుచేసిన కూలి రైతులుగా ప్రవేశించిన పాణోల చేతిలో 9 శాతం ఉంది.

మొత్తంగా సాగుభూమే చాలా తక్కువగా ఉన్న కారణంగా అడవిలో పోడుకొట్టుకోవడం తరచుగా జరిగేది. కంధాలతోబాటు కొన్ని చోట్ల పాణోలు కూడ ఈ పని చేసారు. ఒక కంధా అడవిని కొట్టి సాఫు చేసిన భూమిని ఒక పాణో ఆక్రమించుకున్న ఉదంతాలు లేకపోలేదు. పాణోలలో కొందరు వ్యాపారం, ప్రత్యేకించి పశువుల వ్యాపారం చేపట్టారు. కంధాలకు పాణోలు అప్పులిచ్చే సంప్రదాయమూ కొనసాగింది. అయితే ఇప్పుడు భూమిని తనఖా పెట్టుకోవడం మొదలయింది. తనఖాపడ్డ భూమిని అప్పు తీరేంతవరకు అప్పిచ్చినవాడే అనుభవిస్తాడు. అప్పుకు వేరే వడ్డీ ఉండదు. అప్పు తీరిన తరువాత భూమి వెనక్కి ఇవ్వబడుతుంది. ఈ రకమైన తనఖా విస్తృతంగానే అమలయిందని కె. నువాగాం లోని జుగాపదర్ బస్తీకి చెందిన ఒక పాణో నాయకుడు మాతో అన్నాడు. ఇది తరచుగా భూమి పరాయీకరణకు దారితీసి ఉండాలి. అందుకే కాబోలు ఈ రకమైన అప్పులన్నీ రద్దు చేయాలన్నది కంధాలు తమ ఆందోళనలో లేవదీస్తున్న బలమైన డిమాండ్లలో ఒకటి.

> ఒరిస్సా దేశంలోని అతి పేద రాష్ట్రాలలో ఒకటి. ఒరిస్సాలో కంధమల్ జిల్లా మరీ పేదది. మానవ అభివృద్ధి సూచిక ప్రకారం ఆ రాష్ట్రంలోని 30 జిల్లాలలో 29వ స్థానంలో ఉంది. దీని 20 లక్షల ఎకరాల భూభాగంలో 12 శాతమే సాగు యోగ్యమయినది. 80 నుండి 90 శాతం దళితులు భూమిలేని వారే.

ఇది స్థూలంగా పాణోలకూ, కంధాలకూ మధ్యనున్న సంబంధం. దీనిని అణచివేత లేక దోపిడీ సంబంధంగా సూత్రీకరించలేము. పాణోలలో అత్యధికులు భూమిలేని కూలీలు. భూమిగలవారిలో కూడ చిన్నకారు సన్నకారు రైతుల శాతం పాణోలలోనే అధికం (95 శాతం). ఆదివాసులలో ఆ నిష్పత్తి 84 శాతం. పైగా ఆదివాసుల భూములను ఆక్రమించుకున్న వారిలో పాణోల కంటె సవర్ణ హిందువులే (ఒరియాలు) ఎక్కువ అని ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ విభాగపు ఉన్నతాధికారి ఒకరు మాతో మాట్లాడుతూ అంగీకరించాడు. వారికి వ్యతిరేకంగా సంఘ్‌పరివార్ ఏరోజూ కంధాలను సమీకరించలేదు. సంఘ్‌పరివార్ కంధాలను పాణోలు దోచుకుంటున్నారని ప్రచారం చేస్తుందిగానీ నిజానికి కేవలం మతపరమైన సమీకరణ మాత్రమే చేపట్టింది.

విద్యార్హతల విషయంలో పాణోలకూ కంధాలకూ మధ్య అంతరం చెప్పుకోదగినంత ఉంది. ఇది పాణోల తప్పుకాదుగానీ కంధాలలో ఇది కొంత నిరసనకు దారితీసిన మాట వాస్తవం. క్రైస్తవ విద్యాసంస్థలలో ప్రవేశానికి క్రైస్తవులయి ఉండాలన్న షరతు ఎప్పుడూ లేకపోయినప్పటికీ, క్రైస్తవం తీసుకోవడం విద్యకు ప్రోత్సాహకంగా పనిచేసే మాట వాస్తవం. దీనివల్ల పాణోలు ప్రయోజనం పొందారు. సగటున క్రైస్తవ పాణోల విద్యాస్థాయి ఆదివాసులతో పోలిస్తే ఎక్కువే. దీనివలన ఉద్యోగాలు తదితర విషయాలలోనూ కొంతమేరకు ముందున్నారు.

పాణోలు షెడ్యూల్డు తెగగా గుర్తింపు పొందడానికి ప్రయత్నం చేస్తున్నారనీ, హైకోర్టు నుండి ఆ మేరకు ఆదేశం పొందారనీ కూడ వారిపైన అభియోగం ఉంది. ఈ విషయంలో వాస్తవాలకంటె

అపోహలెక్కువ ఉన్నాయి. నిజానికి హైకోర్టుకు ఒక కులాన్నో, తెగనో షెడ్యూల్డు తెగ (ఎస్.టి)గా గుర్తించమని ప్రభుత్వానికి ఆదేశం ఇచ్చే అధికారం లేదు. ఎస్.సి, ఎస్.టి. జాబితాలను 1950లో రాష్ట్రపతి తొలుత ప్రకటించారు. ఆ తరువాత వాటిలో మార్పులూ చేర్పులూ పార్లమెంటు చట్టంద్వారా చేయాలి. జరిగినదేమిటంటే 2002లో ఒరిస్సా ప్రభుత్వం అభ్యర్థన మేరకు 'కుయి' అనే తెగను పార్లమెంట్ చట్టం ద్వారా ఒరిస్సాకు చెందిన ఎస్.టి. జాబితాలో చేర్చింది. అయితే నిజానికి కుయి అన్న తెగ ఏదీ లేదు. అది ఒక భాష. ఒక సంస్కృతినీ జీవన విధానాన్నీ కూడ సూచిస్తుంది. బాలిగుడ డివిజన్‌లో కంధాలు, పాణోలు కుయి భాష మాట్లాడతారు. వారిద్దరూ భాగమైన 'కుయి సమాజం' అనే భావన బాలిగుడలో ఉండేది. అక్కడి పాణోలను 'హరిజనకుయి' అని పిలిచేవారని జి. ఉదయగిరి బ్లాక్‌లోని కొటింగియా గ్రామానికి చెందిన పాస్టర్ సుఖ్‌దేవ్ డిగాల్ మాతో అన్నాడు. 1926లో బాలిగుడ ప్రాంతంలో నిఖిల్ ఉత్కల్ కుయి సమాజ్ సంఘం అనే సంస్థ ఏర్పడింది. అందులో కంధాలు, పాణోలు ఇద్దరూ సభ్యులుగా ఉండేవారు.

> **ఆదివాసుల భూములను ఆక్రమించుకున్న వారిలో పాణోల కంటె సవర్ణ హిందువులే (ఒరియాలు) ఎక్కువ అని ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ విభాగపు ఉన్నతాధికారి ఒకరు మాతో మాట్లాడుతూ అంగీకరించాడు. కాని వారికి వ్యతిరేకంగా సంఘ్‌పరివార్ ఏరోజూ కంధాలను సమీకరించలేదు.**

ఈ గుర్తింపు కాలక్రమంలో బలహీనపడింది. కుయి సమాజ్ సంఘంలో పాణోలు కూడ ఉండడాన్ని కంధాలు వ్యతిరేకించసాగారు. కేవలం కంధాలకే పరిమితం అయిన కుయి సమాజ్ సేవాసమితి 1945లో ఏర్పడింది. 1980-81 దాకా బాలిగుడ ప్రాంతంలో రెవెన్యూ రికార్డులలో కుయి అన్న తెగపేరు ఉండేది. ఆ తరువాత పాణో, కంధాలని వేరువేరుగా రాయడమేకాక పాత రికార్డులను కూడ మార్చారు. ఈ నేపథ్యంలో, 2002లో కుయి అన్న తెగను రాష్ట్ర ఎస్.టి. లిస్టులో చేర్చేసరికి పాణోలకు ఆశ కలిగినట్టుంది. కుయి అనే వేరే తెగ ఏదీ లేదనీ, బాలిగుడ డివిజన్‌కు సంబంధించినంతవరకు పాణోలూ కుయిలేననీ, కాబట్టి తమకు ఎస్.టి. సర్టిఫికేట్లు ఇవ్వాలనీ కోరసాగారు. స్వాతంత్ర్యానికి పూర్వం బాలిగుడ డివిజన్‌లోని పాణోలకు 'హిల్‌ట్రైబ్' (గిరిజన తెగ)గా గుర్తింపు ఉండిందనీ స్వాంతంత్ర్యం తరువాతే పోయిందనీ కూడ గుర్తు చేసారు. ఒక్క పాణోలేకాదు, మొత్తంగా మద్రాసు ప్రెసిడెన్సీలోని ఏజెన్సీ ప్రాంతాలలో నివసించే అవర్ణులందరినీ అప్పుడు గిరిజన తెగలుగానే గుర్తించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాతే వారిని ఎస్‌టిలుగా కాక ఏజెన్సీలో సైతం ఎస్‌సిలుగానే గుర్తించారు. బాలిగుడ అప్పట్లో గంజాం జిల్లాలో భాగంగా మద్రాసు రాష్ట్రంలో ఉండిందని ఇదివరకే చెప్పాము.

చరిత్ర, భాష, సంస్కృతి మొదలయిన ఈ ఆధారాలన్నీ పట్టుకొని ఫూల్‌బని కుయికళ్యాణ్ సమితి అనే సంస్థ పాణోల తరఫున హైకోర్టుకెక్కింది. పాత రెవెన్యూ రికార్డులలో 'కుయి'ని పాణోగా మార్చిన చోట తిరిగి కుయి అని రాయాలని కోరింది. హైకోర్టు ఆ మేరకు ఒరిస్సా ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీని అర్థం పాణోలకు కుయి అన్న గుర్తింపు లభించేసిందనీ వారంతా ఎస్.టి. జాబితాలో వచ్చి చేరిపోయారనీ కాదు. దానికింకా చాలా

జరగవలసి ఉంది. అయితే కంధాలు ఆందోళన చెందడం సహజమే. తమకంటే ఇప్పటికే కొంతబాగున్న వారిని ఎస్‌టి జాబితాలో చేరిస్తే ఎస్‌టిలుగా తాము పొందే ప్రయోజనాలు దెబ్బతింటాయన్న ఆదుర్దా న్యాయమైనదే. కానీ పాణోల కళ్లతో చూసినప్పుడు వారి కాంక్షను కేవలం అత్యాశ అనలేము. రాజ్యాంగంలోనే షెడ్యూల్డు తెగలు, షెడ్యూల్డు కులాల నిర్వచనంలో ఒక అసంబద్ధత ఉంది. షెడ్యూల్డు తెగకు చెందిన వ్యక్తి ఏ మతం పుచ్చుకున్నా షెడ్యూల్డు తెగ గుర్తింపు పోదు. కానీ షెడ్యూల్డు కులం అనే గుర్తింపు 'హైందవేతర మతాన్ని ఆచరించేవారికి వర్తించదు' అని రాజ్యాంగం (షెడ్యూల్డు కులాల) ఆదేశం, 1950 అంటుంది. దళితులసలు హిందువులేనా అన్న ప్రశ్న పక్కన పెడితే, దీని భావం ఏమిటంటే అవర్ణులయినవారు క్రైస్తవంగానీ ఇస్లాంగానీ వేరే ఏ మతమైనా గానీ పుచ్చుకుంటే ఎస్‌సిలుగా గుర్తింపు కోల్పోతారు. ఆ తరువాత దీనిని సవరించి సిక్కు మతాన్నీ, బౌద్ధమతాన్నీ స్వీకరించిన వారికి ఈ నిషేధం తొలగించారు గానీ క్రైస్తవానికీ ఇస్లాంకూ అది కొనసాగుతున్నది. దళితులు 'పరాయి మతాలు'గా భావించబడే ఈ రెండు కులాలలోకి పోయినట్టయితే ఎస్‌సిలుగా పొందే ప్రయోజనాలను కోల్పోవలసి వస్తుందని బెదిరించి వారిని హైందవ సమాజం అంచున ఉండేటట్లు నిర్బంధించాలన్న సంకుచితమైన ఆలోచన తప్ప దీనికి హేతుబద్ధమైన కారణమేమీ లేదు. కుయి అన్న గుర్తింపు ద్వారా ఎస్.టి. జాబితాలోకి ప్రవేశిస్తే క్రైస్తవం తీసుకున్నా ఆ గుర్తింపు పోదు కాబట్టి, అధికంగా క్రైస్తవులైన పాణోలు ఆ ప్రయత్నం చేయడంలో వారిని నిందించడానికేమీ లేదు.

కంధాలకూ పాణోలకూ మధ్యనున్న వైరుధ్యాల స్వరూపం ఇది. ఇవి నిజమయిన వైరుధ్యాలే గానీ పాణోలపైన జరిగిన అత్యంత క్రూరమైన దాడిని ఇవి వివరించజాలవు. ఒకటి - కంధాల ఆగ్రహానికి భూమిపరాయీకరణ, ఆర్థిక దోపిడీలు కారణమయివుంటే పాణోలకంటె ఎక్కువ సవర్ణ హిందువుల (ఒరియాల)పైన దాడి జరిగి ఉండాలి. అది జరగకపోగా, చాలాచోట్ల సవర్ణ హిందువులు కంధాలతో కలిసి క్రైస్తవ పాణోలపైన దాడి చేసారు. రెండు - క్రైస్తవ పాణోల పైననే కాక మతం మార్చుకోని పాణోలపైన కూడ దాడి జరిగి ఉండాలి. అది జరగకపోగా వారు సహితం కొన్నిచోట్ల క్రైస్తవ పాణోలపైన జరిగిన దాడిలో పాల్గొన్నారు. చివరిగా, క్రైస్తవ కంధాలపైన దాడి జరిగి ఉండకూడదు. కానీ చాలాచోట్ల వారిపైన కూడ దాడులు జరిగాయి, చాలామంది క్రైస్తవ కంధాలు పాణోలతో బాటు క్యాంపులలో ఉన్నారు కూడ.

## లక్ష్మణానంద సరస్వతి

కంధమల్ హింసాకాండను అర్థంచేసుకోవడానికి విశ్లేషించవలసింది కంధా-పాణోల వైరుధ్యాలను కాదు. లక్ష్మణానంద సరస్వతి కంధమల్‌లో సంఘ్‌పరివార్ కార్యకలాపాలను చేపట్టినప్పటినుండి అమలు చేసిన కార్యాచరణను. అతని అసలు పేరు లక్ష్మణ్ సేథి. అతను 1969లో కంధమల్ జిల్లాలో ప్రవేశించాడు. అతని కేంద్రం చకాపద గ్రామం. అక్కడ గురుకుల సంస్కృత మహావిద్యాలయం నెలకొల్పాడు. ఆదివాసుల హైందవీకరణకోసం సంఘ్‌పరివార్ స్థాపించిన వనవాసి కళ్యాణ్ ఆశ్రమ్ 1979 నుండి చకాపద కేంద్రాన్ని నడుపుతున్నది. ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఆదివాసీ విద్య పైన లక్ష్మణానంద దృష్టిపెట్టి ఆదివాసీ పిల్లలకు విద్యావకాశాలు కల్పించారని సంఘ్‌పరివార్ అతనిని పొగుడుతుంటుంది గానీ ఆ మహావిద్యాలయంలో చెప్పేది

సంస్కృతం చదువు. ఆదివాసుల జీవితాలు బాగుచేసుకోవడానికి అది ఎంతమాత్రం ఉపయోగపడదు. సంఘ్ పరివార్ భావజాలాన్ని వారి మెదళ్ళలోకి ఎక్కించడానికి మాత్రం బాగానే ఉపయోగపడి ఉంటుంది. నిజానికి ఈ విద్యాసంస్థను అందరూ నిందించే ముస్లిం మదసాల కంటే ఏరకంగానూ భిన్నమైనదిగా చూడలేము. లక్ష్మణ్ సేథిని కంధమల్‌కు పంపించడంలోగల ఉద్దేశ్యమే సంఘ్‌పరివార్ భావజాలాన్ని ఆదివాసులలో ప్రచారం చేయడం, క్రైస్తవం వ్యాప్తిని నిరోధించడం. జాలస్‌పేటలో సంస్కృత కన్యాశ్రమం 1985లో వచ్చింది. అదికూడ సంస్కృత పాఠశాలే. రెండుచోట్లా ఆర్ఎస్ఎస్ శాఖలు నిర్బంధంగా జరుగుతాయి. విశ్వహిందూ పరిషత్‌వారి సత్సంగ్‌లూ జరుగుతాయి. అక్కడ వారి ప్రచారకులు దేశాన్ని గురించి దేశసమస్యల గురించి తమ అవగాహన నేర్పుతారు. అందులో దేశం ఎదుర్కొంటున్న సకల సమస్యలకూ తప్పు మైనారిటీలమీద, లౌకిక పార్టీల 'బుజ్జగింపు' విధానాలమీద పెడతారు. అసలు జాలస్‌పేట విద్యాలయం లక్ష్మణానంద నెలకొల్పింది కాదనీ స్థానిక ప్రజలు దానిని నెలకొల్పగా లక్ష్మణానంద దానిని స్వాధీనం చేసుకొని అక్కడ పనిచేస్తున్న అధ్యాపకులను తొలగించి కాషాయవిద్య బోధించే అధ్యాపకులను తీసుకొచ్చాడనీ విన్నాము.

మొదటినుండి కూడ లక్ష్మణానంద ఆదివాసీ గ్రామాలు తిరుగుతూ 'సరయిన జీవన విధానం' పేరుమీద బ్రాహ్మణీయ విలువలనూ పద్ధతులనూ నేర్పించేవాడు. తరచుగా సంకీర్తనలనీ యాగాలనీ జరిపేవాడు. 'మేము ప్రజలకు క్రైస్తవానికి దూరంగా ఉండమనీ హిందూ ధర్మాన్ని ఆచరించమనీ బోధించాము. భారతదేశం హిందూరాష్ట్రం అని బోధించాం'. ఈ మాటలు మాతో అన్నది లక్ష్మణానంద అభిమాని అయిన శివరాం డిగాల్. జి. ఉదయగిరి బ్లాక్‌లోని కటింగియా గ్రామస్తుడయిన ఇతను పాణో కులస్తుడు. అయితే క్రైస్తవం పుచ్చుకోనివాడు. లక్ష్మణానంద వెంట ఊరూరా తిరిగేవాడు. భారతదేశం హిందూరాష్ట్రం అన్న అబద్ధాన్ని క్రైస్తవుల పట్ల ద్వేషాన్ని రెచ్చగొట్టే పద్ధతిలో అమాయకులయిన ఆదివాసీ గ్రామాలలో ప్రచారం చేయడం ఎటువంటి దుష్ప్రభావం వేయగలదో ఊహించవచ్చు. లక్ష్మణానంద చేపట్టే యాగాలు వగైరాలకు హాజరయ్యే కంధాలకు జంధ్యం వేసి గాయత్రీమంత్రం నేర్పించే తంతు కూడ జరిగేది.

క్రైస్తవానికి వ్యతిరేకంగా ద్వేషపూరిత ప్రచారం చేపట్టడం లక్ష్మణానంద కార్యక్రమాలలో ముఖ్యమైనది. 'మీరు పేదరికంలో ఉన్నారు. క్రైస్తవుల దగ్గర విదేశీ డబ్బు ఉంది కాబట్టి వాళ్లు ధనవంతులు' అని కంధాలకు చెప్పేవాడు. ఆయన నిర్వహించే సభలలో 'చర్చిలపైన దాడిచేయడానికి సిద్ధంగా ఉన్నవాళ్లు చేతులెత్తండి' అని అడిగేవాడు. ప్రతీ సంవత్సరం గుడ్‌ఫ్రైడే, క్రిస్టమస్ పండగలప్పుడు కావాలని ఏదో ఒక అల్లరి చేసి పండుగలు ప్రశాంతంగా జరుపుకోవడం సాధ్యంకాని పరిస్థితి కల్పించేవాడు. అతని రెచ్చగొట్టే మాటలు, చర్యలచేత ప్రభావితులయిన ఆదివాసులు క్రైస్తవులను పట్టుకొని మతం మార్చుకొమ్మని బలవంతం చేసేవారు. దీనికి లక్ష్మణానంద ఒక తంతును రూపొందించాడు. ఆ తంతు వివరాలు కటక్‌లోని ఒక శరణార్థుల శిబిరంలో తలదాచుకొని ఉన్న జి. ఉదయగిరి బ్లాక్ పిరిగడ గ్రామవాసి అయిన సైమన్ నాయక్ నుండి వివరంగా విన్నాము. ముందుగా క్రైస్తవుడికి గుండు గీయిస్తారు. నుదుటిమీద తిలకం దిద్దుతారు. అతని చేత పేడనీళ్లు తాగిస్తారు. ఆ తరువాత నెయ్యి కలిపిన అన్నం తినిపిస్తారు. ఒక బైబిల్ ప్రతి అతని చేతికి ఇస్తారు. దానిని అతను చింపి తగలబెట్టాలి. ఆ తరువాత తాను ఎప్పుడయినా మళ్లీ చర్చికి పోయినట్టయితే చచ్చిపోయినట్టేనని ఒక కాగితంమీద రాసి సంతకం పెట్టాలి. ఇంత తతంగం ఉంది. అయితే మతం

పుచ్చుకున్న ఆదివాసీకి వేసినట్టు దళితుడికి జంధ్యం వేయడం, గాయత్రి నేర్పించడం ఉండదు.

లక్ష్మణానంద కార్యక్రమాల ఫలితంగా 1986 నుండి క్రైస్తవులపైన దాడులు జరగసాగాయి. 1986-87 సంవత్సరాలలో లక్ష్మణానంద అనేక గ్రామాలలో యజ్ఞాలు నిర్వహించాడు. 1987లో జగన్నాథ రథయాత్ర జరిపాడు. ఆ సంవత్సరం 20 చోట్ల క్రైస్తవులపై దాడులు జరిగాయి. 1989 నాటికే అతను 18 వేల మంది క్రైస్తవులను హిందువులుగా మార్చినట్టు 17 మార్చి 1989 నాడు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రచురితమైన ఒక రిపోర్టు అంటోంది. ఆ తరువాత కూడ 'పునరాగమనం' అని పిలవబడే ఈ బలవంతపు మత మార్పిడి కొనసాగింది. 2006 ఏప్రిల్ నెలలో, గోల్వాల్కర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా చకాపదలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో 342 మంది క్రైస్తవులను హిందువులుగా మార్చడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఒరిస్సా న్యాయశాఖమంత్రి, కొందరు ఎం.పిలు, ఎం.ఎల్.ఏలు కూడ హాజరుకావడం విశేషం.

**రాజ్యాంగంలోనే షెడ్యూల్డు తెగలు, కులాల నిర్వచనంలో ఒక అసంబద్ధత ఉంది. షెడ్యూల్డు తెగకు చెందిన వ్యక్తి ఏ మతం పుచ్చుకున్నా షెడ్యూల్డు తెగ గుర్తింపు పోదు. కానీ షెడ్యూల్డు కులం అనే గుర్తింపు 'హైందవేతర మతాన్ని ఆచరించేవారికి వర్తించద'ని రాజ్యాంగం అంటుంది.**

## కుయి సంఘాలు

ఈ హింసాకాండలో, దాడులలో లక్ష్మణానంద వెంట పోయిన వారిలో సవర్ణ హిందువులతోబాటు కంధాలూ పెద్ద సంఖ్యలో ఉన్నారు. 2008లో జరిగిన హింసాకాండ కొచ్చేసరికి ప్రధానంగా కంధాలే సంఘ్ పరివార్ కాల్బలంగా పనిచేసారు. అయితే కంధాలు కేవలం విశ్వహిందూ పరిషత్ చేతిలోను, బజరంగ్‌దళ్ చేతిలోను పావులన్న అభిప్రాయం కలిగిస్తే పొరబాటవుతుంది. పాణోలతో వారికి ఉన్న వైరుధ్యాల కారణంగా వారిని రెచ్చగొట్టే అవకాశం ఉండిందని పైన వివరించాము. బజరంగ్‌దళ్ దౌర్జన్యాన్ని తిరస్కరించినవారు, ప్రతిఘటించి ప్రాణం కోల్పోయినవారు కూడ కంధాలలో ఉన్నారనేది తరువాత చూద్దాం. ప్రస్తుతానికి చెప్పవలసిందేమిటంటే పాణోలకు వ్యతిరేకంగా కంధాలు చేపట్టిన ఆందోళన, క్రైస్తవులపైన బజరంగ్‌దళ్ సాగించిన దౌర్జన్యకాండ సమాంతరంగా సాగిన రెండు వేరువేరు ఉదంతాలు. తరచుగా రెండింటి గొంతులూ కలిసినప్పటికీ, బజరంగ్‌దళ్ కూడగట్టిన గుంపులో కంధాలే అధికంగా ఉన్నప్పటికీ రెండూ ఒకటి కాదు. గడచిన దశాబ్దకాలంగా కంధాలకు పాణోలపైన ఉన్న ఫిర్యాదుల ప్రాతిపదికన ఆందోళన నిర్వహిస్తున్న సంస్థ ఒకటి ఉంది. దాని పేరు కుయి సమాజ్ సమన్వయ సమితి (క్లుప్తంగా సమితి అందాం). ఇది 1998లో ఏర్పడింది. 1926లో బాలిగుడ ప్రాంతంలో కంధాలనూ పాణోలనూ కలుపుకొని ఏర్పడిన నిఖిల్ ఉత్కల్‌కుయి సమాజ్ సంఘం గురించి పైన చెప్పాము. అది ఇప్పటికీ కొనసాగుతున్నది. 2008 దాడులప్పుడు దాడులలో పాల్గొనవద్దని ఆ సంస్థ ఉపాధ్యక్షుడు శంతను ప్రధాన్ తన అనుచరులకు చెప్పాడు.

అయితే 'కుయి' పేరుమీద పాణోలను కలుపుకోకూడదన్న నిర్ణయంతో 1945లోనే కుయి

సమాజ్ సేవా సమితి అనే సంస్థ ఏర్పడిన విషయం కూడ చెప్పాము. దీని కేంద్రం ఫూల్‌బని. 1982లో బాలిగుడలో కుయి కులసమితి అనే సంస్థ ఏర్పడింది. ఇవన్నీ కంధాల సంఘాలు. 1998లో కంధాల ఆందోళనను సమన్వయపరిచే ఉద్దేశ్యంతో కుయి సమాజ్ సమన్వయ సమితి ఏర్పడింది. దాని నాయకుడు లంబోదర్ కన్హర్ సంఘ్ పరివార్‌కు బాగా సన్నిహితుడేగానీ స్వంత రాజకీయ అజెండాగలవాడు. అప్పుడప్పుడు విశ్వహిందూపరిషత్ గొంతుతో మాట్లాడతాడు. అప్పుడప్పుడు వ్యతిరేకంగా మాట్లాడతాడు. ఒక్కొక్కసారి ఆదివాసులు ప్రకృతి ఆరాధకులే తప్ప హిందువులు కారనీ, గొడ్డు మాంసం తినడం వారి అలవాటనీ, అది మాన్పించాలన్న సంఘ్‌పరివార్ ప్రయత్నం ఖండించవలసిందనీ అంటాడు. తాగడం కూడ ఆదివాసుల సంప్రదాయం అంటాడు. తాగుడు మాన్పించాలన్న సంఘ్‌పరివార్ ప్రయత్నం తప్పంటాడు. లక్ష్మణానంద చేసే యాగాలలో నిప్పులో సారాయి పోయమని కంధాలకు అతను పిలుపు ఇచ్చిన సందర్భాలూ ఉన్నాయి. కానీ క్రైస్తవులగురించి, వారిపైన లక్ష్మణానంద ఆధ్వర్యంలో జరిగిన దాడుల గురించి మాత్రం పూర్తిగా విశ్వహిందూపరిషత్ గొంతుతోనే మాట్లాడతాడు.

## లంబోదర్ కన్హర్

లంబోదర్ కన్హర్ మొదట 1994లో వార్తలకెక్కాడు. ఖజురిపద బ్లాక్‌లోని ఖుడుటెంటులి గ్రామంలో 14 జనవరి 1994నాడు ఒక పాణో యువకుడు శివాలయంలోకి ప్రవేశించడాన్ని ఆ ఆలయం భక్తులయిన కంధాలు వ్యతిరేకించారు. అంటరానితనం కారణంగా వ్యతిరేకించలేదనీ, ఆ గుడి రిపేర్‌కు డబ్బులు ఇమ్మన్నప్పుడు పాణోలు ఇవ్వలేదనీ, అందువల్ల పాణో యువకుడు రావడాన్ని ఆదివాసులు వ్యతిరేకించారనీ కన్హర్ వివరణ ఇచ్చాడు గానీ అది నమ్మేవాళ్లెవరూ లేరు. వాళ్లు వ్యతిరేకించినా ఆ పాణో యువకుడు మొండిగా తన హక్కు వినియోగించుకుంటానని అనడంతో అది రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. లంబోదర్ కన్హర్ రంగంలోకి దిగి కంధాలను పెద్ద సంఖ్యలో సమీకరించాడు. అవతలి వైపు పాణో నాయకులూ అదేపని చేసారు. దళితుని ఆలయ ప్రవేశం హక్కు గురించి ఒక వికారమయిన దళిత – ఆదివాసీ ఘర్షణ ఆర్నెల్ల వరకు అంటే జూన్ నెలదాకా సాగింది. 18 మంది చనిపోయారు. పాణోలు గ్రామాలు వదిలి ఫూల్‌బనికి పారిపోయి ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరంలో తలదాచుకున్నారు. ఆ ఘర్షణలో భాగంగా లంబోదర్ కన్హర్ 5000 మంది కంధాలతో ఏప్రిల్ 6వ తేదీన తీసిన ఊరేగింపులో 'మీదగ్గర ఉన్న ఆయుధాలు తీసుకురండి, పాణోలను హతమార్చండి' అన్న నినాదం పదేపదే ఇచ్చారు. ఆ ఘర్షణ క్రమంలోనే ఫూల్‌బని జిల్లా పేరు కంధమల్‌గా మార్చాలని డిమాండ్ చేసి సాధించుకున్నారు.

లంబోదర్ కన్హర్ ఏరోజూ కూడ కంధాలను సవర్ణ హిదువుల దోపిడీకీ దౌర్జన్యాలకూ వ్యతిరేకంగా సమీకరించలేదు, కదిలించలేదు. బజరంగ్‌దళ్ ఎట్లాగూ ఆ పని చేయలేదు. భూమి పరాయీకరణ, వడ్డీ వ్యాపారం మొదలయిన విషయాలలో పాణోలకంటె సుందీలు, ఇతర సవర్ణ హిందూ కులాలు కంధాలకు ఎక్కువ శత్రువులయి ఉండాలి. కానీ వారిపైన ఏ పోరాటం లేకపోగా వారు సంఘ్‌పరివార్‌లో చేరి కంధాలను ముందుపెట్టి క్రైస్తవ పాణోలపైన భీకరమైన దాడులకు పాల్పడుతున్నారు.

# ఒరిస్సా : హింసాకాండ

**2008** ఆగస్ట్–సెప్టెంబర్ నెలల్లో కంధమల్ జిల్లాలో జరిగిన హింసాకాండ గురించి మాట్లాడుకోవడానికి ముందు 2007 డిసెంబర్‌లో మొదలయి 2008 జనవరిలోకి సాగిన దాడుల గురించి చెప్పుకోవాలి. నిజానికి బాధితులెవ్వరితో మాట్లాడినా 'గత డిసెంబర్' గురించి 'ఈ ఆగస్టు' గురించి మార్చి మార్చి చెప్పడం నిజనిర్ధారణ కమిటీలుగా వెళ్లిన వారందరి అనుభవం. సంఘ్‌పరివార్ కూడ రెండవ ఘటనను మొదటిదాని కొనసాగింపుగానే భావిస్తుంది. ఎటొచ్చీ రెండింటినీ తలక్రిందులుగా చూపిస్తుంది. ఒక్క మావోయిస్టులు మాత్రమే ఈ విషయాన్ని గ్రహించనట్టున్నారు. గ్రహించి ఉంటే లక్ష్మణానందపై హత్యాప్రయత్నం జరిగిందన్న కల్పితమైన సాకుని వాడుకొని 2007 డిసెంబర్‌లో క్రైస్తవులపైన జరిగిన దాడుల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని లక్ష్మణానంద సరస్వతిని చంపేవారు కారేమో. 2007 క్రిస్ట్‌మస్ దినానికి ముందు మొదలయి ఆ పండగ తరువాత కూడా కొనసాగిన దాడులలో 600 నుండి 700 దాకా ఇళ్లు, 90 చర్చిలు, వంద దాకా ఇతర క్రైస్తవ సంస్థల బిల్డింగ్‌లు ధ్వంసం అయ్యాయి. ఇతర సంస్థలలో కుష్టురోగుల పునరావాస కేంద్రం కూడ ఒకటి. త్రిశూలాలతో తల్వార్లతో జరిగిన దాడులలో చాలామందికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల సంఖ్య 11 అనేది అనధికార అంచనా.

## డిసెంబర్ 2007

ఈ హింసాకాండ పూర్వరంగాన్ని గురించి హిందుత్వవాదులదొక కథ ఉంది. దరింగబాడి బ్లాక్‌లోని బామునిగాం (బ్రాహ్మణిగాం) గ్రామంలో క్రిస్మస్ వేడుకలలో భాగంగా దుర్గ గుడికి అడ్డంగా క్రైస్తవులు ద్వారం కట్టారని వారి అభియోగం. ఇది రోడ్డుకడ్డంగా కట్టిన ద్వారం కాదు. రోడ్డు మార్జిన్ వెంబడి కట్టినది. ఆ దుర్గగుడికి నవరాత్రులప్పుడు తప్ప ఎవరూ పోరనీ, ఈ ద్వారం క్రిస్ట్‌మస్ సందర్భంగా తాత్కాలికంగా కట్టినదనీ క్రైస్తవుడయిన మాజీ ఎంఎల్ఏ సలూజా ప్రధాన్ అంటాడు. అంతేకాక బాలిగుడ సబ్‌కలెక్టర్ అనుమతితోనే ఆ ద్వారం నెలకొల్పారని, డిసెంబర్ 19 నాడు

అనుమతి తీసుకున్నామని తారీఖుతో సహా చెప్పాడు. 2006లో అదేచోట ద్వారం పెట్టినా అప్పుడేం అభ్యంతరంగానీ గొడవగానీ లేదు. దానికి ఇటూ అటూ రోడ్డువెంబడి ఉన్న అంగళ్లన్నీ క్రైస్తవులవే. అయితే సంఘ్‌పరివార్ ప్రతినిధి అయిన రాంమాధవ్ జనవరి 8వ తేదీన విడుదల చేసిన ప్రకటనలో ఏమంటాడంటే అప్పటికే ఒక ద్వారం ఉండగా క్రైస్తవులు ఏ సంవత్సరం లేనిది ఆ సంవత్సరం రెండవ ద్వారం నెలకొల్పారనీ, దానిని ఇతరులు నిరసించారనీ. మత సంబంధమైన సంబరాలలో పొదుపు ఎవరైనా ఎప్పుడు పాటించారో వారే తెలపాలి. సంఘ్‌పరివార్ సంస్థలు నిర్వహించే గణేశ్ చతుర్థి, నవరాత్రి ఉత్సవాలలోనయితే పొదుపు పాటించడం అటుంచి ఎన్ని మండపాలు పెడితే అంత గొప్ప అనేది వైఖరి.

అయితే ఇక్కడ సంఘ్‌పరివార్ అనుసరించే ఒక ఎత్తుగడను ప్రస్తావించాలి. వారి హింసాకాండ గురించి చర్చ వచ్చినప్పుడు దాని పరిమాణంతో పోలిక లేని చిన్న చిన్న కారణాలు చూపిస్తారు. చర్చిస్తున్నది మూకుమ్మడి హత్యాకాండ, విధ్వంసం, దహనకాండల గురించి కాగా చాయ్ దుకాణంలో కొట్లాట గురించి మాట్లాడుకుంటున్నట్టు జవాబు చెప్పి ఆ చర్చలోకి ఎదుటివారిని లాగుతారు. ఇది బాధితుల ఆవేదనను కించపరిచి వారి ఆగ్రహాన్ని చిల్లర సంభాషణ ద్వారా నీరసింపజేసే ఎత్తుగడ.

సంఘ్‌పరివార్ చూపించే మరొక కారణం డిసెంబర్ 24 సాయంత్రం లక్ష్మణానంద సరస్వతిపైన జరిగిన హత్యాప్రయత్నం, అది అతని అనుచరులలో కలిగించిన ఆగ్రహం. లక్ష్మణానందపైన నిజంగా హత్యా ప్రయత్నం జరిగిందా అన్నది తర్వాత చూద్దాం. అతనికి ఆ హత్యాప్రయత్నంలో గాయాలయ్యాయని సంఘ్‌పరివార్ సహితం అనడం లేదు. కాగా, దాడికి కారణాలుగా చూపించే ఈ రెండూ 2007 డిసెంబర్ నాటి హింసలో ఒక శతాంశాన్ని కూడ వివరించజాలవు. ఎందుకంటే క్రైస్తవులపైన దాడులు రెండవ ద్వారం 'అనవసరంగా' నిర్మించిన బామునిగాంలో మొదలు కాలేదు. లక్ష్మణానందపైన 'హత్యాప్రయత్నం' జరిగేంతవరకు వేచి ఉండలేదు. (బామునిగాంపైన జరిగిన విధ్వంసకమైన దాడి సహితం ఆ హత్యా ప్రయత్నం కంటే ముందే జరిగింది.) అప్పటికే చాలా ఊర్లలో దాడులు జరిగి ఉన్నాయి. వాస్తవానికి 2007 డిసెంబర్ మాసంలో జరిగిన దాడులు ఒక పథకం ప్రకారం, సువిశాల భూభాగంలో జరిగాయి. అనేక తాలూకాలనుండి, జిల్లా వెలుపలినుండి కూడ వచ్చిన వ్యక్తులు ఆ దాడులలో పాల్గొన్నారు. వాళ్ల చేతులలో మారణాయుధాలున్నాయి, బస్సులనిండా పెట్రోల్, డీజిల్ ఉన్నాయి. ముందుగా ప్రణాళిక వేసుకోకుండ ఇది సాధ్యం కాదు.


కేశోమతి ప్రధాన్

బాలిగుడ బ్లాక్‌లోని బారఖమా గ్రామం దాడులకు గురయిన ఊర్లలో ఒకటి. 2007 డిసెంబర్ కాలపు హింసాకాండ గురించి వివరమయిన నివేదిక రూపొందించిన సామాజిక శాస్త్రవేత్త అంగనా ఛటర్జీ ఆ

దాడిలో 4000 మంది పాల్గొన్నట్లు అంచనా వేసారు. మా బృందంతో ఈ దాడి గురించి కేశోమతి ప్రధాన్ అనే కంధా తెగకు చెందిన ఆదివాసీ స్త్రీ వివరంగా మాట్లాడింది. రైకియా బ్లాక్‌లోని సుకుడ్‌బాడి పంచాయితీలో ఉన్న కజూరి గ్రామ నివాసి అయిన ఈమె తన బంధువులను చూడడానికి డిసెంబర్ 21 నాడు బారఖమాకు పోయి డిసెంబర్ 25 దాకా అక్కడే ఉండింది. బారఖమాపైన దాడి జరిగింది ఆరోజే. కంధమల్ నారీ జాగరణ్ మంచ్ అధ్యక్షురాలయిన ఈమె ఆ దాడికి ప్రత్యక్షసాక్షి. తన తోటి ఆదివాసులను ఆ దాడిలో పాల్గొనకుండ నిలువరించడానికి ఈమె చాలా కృషి చేసింది. ఈమె చెప్పిన విషయాలను అంగనాఛటర్జీ చెప్పిన విషయాలతోనూ, అఖిలభారత కాథొలిక్ సమాజం అధ్యక్షుడు జాన్‌దయాల్ చెప్పిన విషయాలతోనూ పోల్చి చూసుకున్నప్పుడు 2007 డిసెంబర్ నాటి దాడి గురించి ఈ కింది చిత్రం కనిపిస్తుంది.

'మీదగ్గర ఏ **ఆయుధాలుంటే అవి తీసుకురండి, పాణోలను చంపండి' అనే నినాదాలతో బ్యానర్లు రాసారు. 'క్రైస్తవులను చంపండి' అన్నది నాటి ఆందోళనలో సర్వత్రా వినపడ్డ** నినాదం.

లంబోదర్ కన్హర్ నేతృత్వంలోని కుయి సమాజ్ సమన్వయ సమితి 2007 డిసెంబర్ నెలలో ఆందోళన కార్యక్రమం చేపట్టింది. క్రైస్తవ పాణోలు ఎస్‌సి సర్టిఫికెట్లు పొందకుండ చూడాలనీ, కుయి మాట్లాడే పాణోలను ఎస్‌టిలుగా గుర్తించాలన్న డిమాండ్‌కు అంగీకరించకూడదనీ, పాణోలు స్వాధీనం చేసుకున్న కంధాల భూములు వెనక్కి ఇప్పించాలనీ వారి డిమాండ్లు. కంధాల న్యాయమైన ఆందోళనను సంఘ్‌పరివార్ అజెండాతో కలిపిన వైనం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. లేకుంటే ఈ మూడింటిలో మొదటి డిమాండుతో ఆదివాసులకేం సంబంధం? క్రైస్తవ పాణోలు ఎస్‌సి సర్టిఫికెట్లు ఒకవేళ పొందుతున్నట్లయితే దాని గురించి ఆందోళన చెందవలసింది క్రైస్తవేతర పాణోలే తప్ప ఆదివాసులు కారు. సంఘ్‌పరివార్ అజెండాను మరింత స్పష్టంగా బయటపెట్టే విషయం, ఈ ఆందోళనలో భాగంగా డిసెంబర్ 24, 25 తేదీలలో జిల్లాలో బంద్ పిలుపు ఇవ్వడం. క్రిస్టమస్ వేడుకలను ఆటంకపరచడం తప్ప దీనికి వేరే కారణంగానీ లక్ష్యంగానీ లేదు.

డిసెంబర్ 22 నుండి గ్రామాలలో పెద్దెత్తున ఊరేగింపులు తీయసాగారు. క్రైస్తవ–వ్యతిరేక నినాదాలు ఇచ్చారు. కొన్నిచోట్ల క్రైస్తవులను హతమార్చమంటూ పిలుపు ఇచ్చారు కూడ. 2008 చివరి భాగంలో జరిగిన దాడులలాగ ఆ రోజు సవర్ణ హైందవుల పాత్రను దాచిపెట్టే ప్రయత్నం జరగలేదు. లక్ష్మణానంద హత్య తరువాత జరిగిన దాడులను అతని మరణానికి ఆగ్రహించిన ఆదివాసుల చర్యగా చూపించి సవర్ణ హిందువుల పాత్రను దాచిపెట్టారు. 2007 డిసెంబర్‌నాటి దాడులలో 'ఒరియాల' పాత్ర ప్రత్యక్షంగానే ఉంది. వారు కంధాలకు పెట్రోలు వాడడం నేర్పించారనీ, వాళ్ల నుదుట తిలకం దిద్ది బజరంగ్‌దళ్ చిహ్నమైన ఎర్రటిగుడ్డ తలకు చుట్టారనీ కేశోమతి అనింది. 'మీదగ్గర ఏ ఆయుధాలుంటే అవి తీసుకురండి, పాణోలను చంపండి' అనే నినాదాలతో బ్యానర్లు రాసారు. 'క్రైస్తవులను చంపండి' అన్నది నాటి ఆందోళనలో సర్వత్రా వినపడ్డ నినాదం. ఇతర నినాదాలు 'జై బజరంగ్‌బలి', 'భారత్‌మాతాకీ జై' మొదలయినవి.

బామునిగాంపైన దాడి డిసెంబర్ 24న జరిగింది. క్రైస్తవులు బంద్ పాటించడానికి నిరాకరించడంతో క్రిస్టమస్ సంబరాల కోసం వారు చేసుకున్న ఏర్పాట్లపైన 150–200 సంఖ్యగల గుంపు దాడి చేసింది. 20 దుకాణాలు లూటీ చేసి తగలబెట్టి, ఒక చర్చికి నిప్పుపెట్టి, కొంతమందిని గాయపరిచారు. 25వ తేదీన ఈ గ్రామంపైన మళ్లీ దాడి జరిగింది. తమపైన దాడులు జరగవచ్చునన్న భయంతో క్రైస్తవులు 21వ తేదీనుండే బాలిగుడ సబ్‌కలెక్టర్‌కు, డిఎస్‌పికి అర్జీలు ఇస్తూ వున్నారు. అయినప్పటికీ ఊరిమీదికి గుంపు వచ్చే సమయానికి ఎటువంటి రక్షణా లేదు. దాడి అయిపోతుండగా సబ్‌కలెక్టర్, డిఎస్‌పి వచ్చారు. బామునిగాంలో దుర్గ గుడికి అడ్డంగా క్రైస్తవులు తాత్కాలికంగా ఒక ద్వారం నిలబెట్టారన్న నిరసన హిందువులలో నిజంగానే ఉందనుకున్నా, ఆనాడు జరిగిన దాడి తీవ్రతను అది వివరించజాలదు. దాడి చేయడానికి క్రిస్టమస్ పండగ ముందురోజును ఎంపిక చేసుకోవడాన్నీ ఆ నిరసన వివరించజాలదు. ఆ రోజును ఎంచుకోవడంలో క్రైస్తవులను రెచ్చగొట్టాలన్నది తప్ప వేరే ఉద్దేశ్యం కనిపించదు. ఆ సాయంత్రం బామునిగాం వైపు వస్తున్న లక్ష్మణానంద కారుపైన క్రైస్తవులు దసింగబాడి అనే గ్రామం దగ్గర దాడి చేసారని సంఘ్‌పరివార్ ఆరోపణ. (ఇంతకూ ఆ యోగి బామునిగాంకు ఆ సాయంత్రం ఎందుకొస్తున్నాడో!) 'ఆరోపణ' అని ఎందుకు అంటున్నామంటే అతనిపైన దాడి జరిగిందని సంఘ్‌పరివార్ తప్ప వేరెవ్వరూ నమ్మడం లేదు. జాన్‌దయాల్ సేకరించిన సమాచారం ప్రకారం బామునిగాంకు లక్ష్మణానందను తీసుకొస్తున్న కారు దసింగబాడి దగ్గర ఒక బస్సు సిబ్బందితో ఘర్షణ కారణంగా ఆగింది. కారు డ్రైవర్ బస్సు సిబ్బందితో గొడవపడుతుండగా, లక్ష్మణానంద అంగరక్షకులు క్రిస్టమస్ వేడుకలకోసం రోడ్డుపక్కన తోరణాలు కడుతున్న క్రిష్టియన్ యువకులపైన దాడి చేసారు. వారు ఎదురుదాడికి దిగగా కొంతసేపు గొడవ అయింది. దీనిని లక్ష్మణానంద సరస్వతిపైన దాడిగా అభివర్ణించిన సంఘ్‌పరివార్ అందుకు నిరసనగా 36 గంటల బంద్ పిలుపు ఇచ్చింది. అప్పటికే డిసెంబర్ 24, 25 తేదీలలో కుయి సమాజ్ సమన్వయ సమితి బంద్ పిలుపు ఇచ్చి ఉంది కాబట్టి అదీ ఇదీ కలిసాయి. ఆ తరువాత విస్తృతంగా దాడులు జరిగాయి. దాడులకు గురయిన గ్రామాలలో బారఖమా ఒకటి. పెట్రోలు, ఇనుపరాడ్లు, త్రిశూలాలు, కత్తులు విరివిగా ఉపయోగించారు. ఇళ్లనూ, చర్చిలనూ తగలబెట్టి మనుషులపైన బలప్రయోగం చేసారు. డివిజన్ కేంద్రమయిన బాలిగుడలో సహితం 500 మంది గుంపు త్రిశూలాలు, కత్తులు పట్టుకొని చర్చిపైన దాడిచేసింది. బాధితులు ఊర్లనుండి పారిపోయి చలిలో, అడవులలో తిండిలేకుండ, కప్పుకోవడానికి గుడ్డలు లేకుండ కొన్ని రాత్రులూ, పగళ్లూ గడిపారు. కొంతమంది ప్రభుత్వం అనుమతించిన శిబిరాలలో చేరారు. బామునిగాం, ఆ పరిసరాలలో క్రైస్తవులు కొంతమేరకు ఎదురు దాడి చేయగలిగారు గానీ వారు అనుభవించిన నష్టంతో పోలిస్తే వారి ప్రతిచర్య చిన్నదే. ఈ ఘటనలలో నలుగురు చనిపోయారని ఒరిస్సా ప్రభుత్వం అంటుండగా, 11 మంది అని అంగనా ఛటర్జీ అంటారు. ఈ ఉదంతంపైన న్యాయవిచారణ జరపమని ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వం బాసుదేవ్ పాణిగ్రాహి అనే రిటైర్డ్ హైకోర్టు జడ్జిని నియమించింది. ఆ విచారణ ఇంకా జరుగుతుండగానే 2008 ఆగస్ట్ నెలలో అంతకు ఎన్నోరెట్లు ఘోరమైన దాడి మొదలయింది.

2008 ఆగస్ట్ 23 రాత్రి 8–30 గంటలప్పుడు తుమిడిబంద బ్లాక్‌లోని జాలస్‌పేటలో ఉన్న సంస్కృత కన్యాశ్రమం వద్ద కొందరు సాయుధులు లక్ష్మణానంద సరస్వతినీ అతని అనుచరులు నలుగురినీ కాల్చిచంపారు. అప్పటికి కొద్దిరోజులు ముందు మావోయిస్టుల నుండి లక్ష్మణానందకొక

బెదిరింపు లేఖ వచ్చిందనీ, అందులో అతను తన మతతత్వ కార్యకలాపాలు ఆపకపోతే చంపుతాం అన్న బెదిరింపు ఉందనీ, అతను ఆ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చినాకూడ పోలీసులు రక్షణ కల్పించలేదనీ పత్రికలు రాసాయి. ఏమయితేనేం, 23 రాత్రి 40–50 మంది సాయుధులు అతనినీ అతని అనుయాయులు నలుగురినీ కన్యాశ్రమం ఆవరణలోనే చంపారు.

చంపినవాళ్లు మావోయిస్టులన్న విషయంలో మొదటినుండీ ఎవరికీ సందేహం లేదు. మావోయిస్టులు సహితం అది తమ చర్యేనని ప్రకటించు కున్నారు. అయితే సంఘ్ పరివార్ మాత్రం దీనిని నమ్మడం లేదని అంటుంది. లక్ష్మణానందను చంపింది క్రైస్తవులేనని వారి ఉవాచ. అబద్ధాన్ని నిలబెట్టుకోవడం మరీ కష్టమయినప్పుడు 'ఒకవేళ మావోయిస్టులు చంపి ఉన్నా, క్రైస్తవులు వారిని కిరాయి హంతకులుగా వినియోగించుకొని చంపించి ఉంటారు' అంటున్నారు. ఆర్ఎస్ఎస్ ఏర్పడిన తొలిదినాల నుండి ముస్లిం–వ్యతిరేకత, క్రైస్తవ–వ్యతిరేకతతోపాటు కమ్యూనిస్టు – వ్యతిరేకతను కూడ సమపాళ్లలో ప్రకటించుకున్న హిందుత్వవాదులు కమ్యూనిస్టులు చేసిన ఒక హత్యను వారు చేసింది కాదంటూ క్లీన్ చిట్ ఇచ్చిన తొలిఘటన ఇదేనేమో! ఈ ఘటనలో చనిపోయింది తమ ప్రముఖుడైనా, అతనిని చంపింది తామేనని మావోయిస్టులు ఒప్పుకున్నా కూడా చంపింది వారు కాదనీ ఆర్.ఎస్. ఎస్. అనడం మరీ విడ్డూరం. ఇంతటి అవకాశవాదానికి ప్రేరణ ఒక్కటే. క్రైస్తవులపైన భారీగా దాడిచేయడానికి ఈ హత్య ఇచ్చిన సదవకాశాన్ని వదులుకోకూడదన్న దృఢమైన నిర్ణయానికి సంఘ్ పరివార్ రావడం.


కంధమల్ జిల్లాలో ఇలా ధ్వంసమైన ఇళ్లు 5వేల పైనే

లక్ష్మణానంద మృతదేహాన్ని అతని కార్యకలాపాలకు కేంద్రమైన చకాపదకు రోడ్డు మార్గాన తీసుకుపోతామని వారు పట్టుబట్టారు. అతని మృతదేహంతో విస్తృత ప్రదర్శన నిర్వహించాలనీ దానివల్ల రెచ్చిపోయే ఆవేశాలను వాడుకోవాలనీ వారు కృత నిశ్చయులయ్యారు. తరువాతి ఘటనలే దీనికి సాక్ష్యం. చకాపదకు సూటిగా వెళ్లేబాట వెంబడి పోకుండ బాలిగుడ సబ్‌డివిజన్ నలుమూలలా ప్రదర్శన నిర్వహిస్తూ వెళ్లారు. ఆ సబ్ డివిజన్‌లోని 11 బ్లాకులలో 8 బ్లాకులను చుట్టారు. జాలస్‌పేట నుండి తుమిడిబందకు పోయి అక్కడినుండి తిరిగి జాలస్‌పేట మీదుగా కుర్తంగడ్ దాటి బాలిగుడకు పోయి అక్కడినుండి కె.నువాగాం బ్లాక్ మొత్తం దాటి రైకియాకు పోయారు. రైకియా నుండి కొటింగియా మీదుగా జి. ఉదయగిరి చేరుకున్నారు. అక్కడినుండి నేరుగా చకాపదకు పోయి ఉండవచ్చునుగానీ దానిబదులు టికాబలి బ్లాక్‌లో ప్రవేశించి, అక్కడినుండి ఫిరింగియా, ఫూల్‌బని బ్లాక్‌లకు పోయి తిరిగి టికాబలికి వచ్చి అక్కడినుండి చకాపద చేరుకున్నారు. మొత్తం 250

కిలోమీటర్లు తిరిగారు. నేరుగా పోయి ఉంటే అందులో సగం దూరం కూడ అయిఉండేది కాదు.

సెప్టెంబర్ 13వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో జాతీయ మైనారిటీస్ కమిషన్ మృతదేహాన్ని యాత్రగా తీసుకుపోనిస్తే ఆవేశాలు పెరిగే అవకాశం ఉందని అధికార యంత్రాంగం గ్రహించకపోవడం పొరబాటనీ, ఏ కారణంగానయినా అంత్యక్రియలు జాలస్‌పేటలో జరపడానికి అతని అనుచరులు ఒప్పుకోని పక్షంలో హెలికాప్టర్‌తో మృతదేహాన్ని చకాపద తీసుకుపోవలసి ఉండిందనీ అనింది. పైగా తీసుకుపోయిన మార్గం, అంగీకరించిన మార్గం ఒకటికాదు. కె.నువాగాం చేరుకోగానే అక్కడున్న లక్ష్మణానంద అనుయాయులు మృత దేహాన్ని చూసే అవకాశం అందరికీ కల్పించడం కోసం మరింత ఎక్కువ తిరగాలని ఒత్తిడి పెట్టారు. లక్ష్మణానంద కార్యకలాపాల చరిత్ర ఎరిగిన అధికార యంత్రాంగం, అతని మృతదేహ ప్రదర్శన ఇంతగా జరిగితే సంభవించగల పరిణామాలను గ్రహించి ఉండవలసింది. అయితే మేము గమనించింది ఏమిటంటే ఒరిస్సాలోని పాలనా యంత్రాంగం దొమ్మీని అదుపు చేయాలంటే దొమ్మీ చేసే వారితో సున్నితంగా వ్యవహరించాలన్నది ప్రాథమిక సూత్రంగా భావించి నడుచుకుంది. ఉదాహరణకు జి. ఉదయగిరిలోని శరణార్థుల శిబిరం వర్షంనీరు మడుగయి నిలిచిన బహిరంగ ప్రదేశంలో ఉన్న సంగతి గమనించిన మా బృందం ఒరిస్సా రాష్ట్ర (దక్షిణ ప్రాంత) రిలీఫ్ కమిషనర్‌తో 2008 సెప్టెంబర్ 22 నాడు ఫోన్‌లో మాట్లాడి శిబిరాన్ని ఏదయినా పక్కా బిల్డింగ్‌లో నెలకొల్పడం సాధ్యం కాదా అని ప్రశ్నించగా శరణార్థులకు పక్కా ప్రభుత్వ భవనాలలో వసతి కల్పించడానికి 'ఇతర వర్గాలు' ఒప్పుకోవడం లేదు కాబట్టి సాధ్యపడదని జవాబు చెప్పాడు. వారిని శరణార్థులుగా మార్చింది ఆ 'ఇతర వర్గాలే' అయినప్పుడు వారి అభిప్రాయాన్ని లెక్కచేయాలని భావించడం వింత వైఖరే.



నేల కూలిన శిలువ

లక్ష్మణానంద మృతదేహాన్ని 24వ తేదీన ఈ విధంగా తీసుకుపోయిన ప్రదర్శకులు మార్గమధ్యంలో రైకియా, జి.ఉదయగిరి, టికాబలి, పహూరియాలలో క్రైస్తవుల షాపులు తగలబెట్టారు. అయితే అసలు హింస తరువాతి రోజు జరగనుంది. దానికి ప్రేరణ అంత్యక్రియలప్పుడు చేసిన ఉపన్యాసాలు. చకాపదలో జరిగిన అంత్యక్రియలకు ప్రవీణ్ తొగాడియాతో సహా చాలామంది సంఘ్‌పరివార్ నాయకులు హాజరయ్యారు. ప్రవీణ్ తొగాడియా తన మామూలు శైలిలో క్రైస్తవులపైన హింస రెచ్చగొడుతూ ఉపన్యసించాడు. అతను భారత రాజకీయాల ప్రధాన లైసెన్స్‌డ్ నేరగాడు. బహిరంగ సభలలో అతనంతగా హింసను వేరెవరయినా రెచ్చగొట్టే పని పెట్టుకున్నట్టయితే తమ జీవితంలో అధికభాగం జైలులో గడుపుతూ ఉందురు. తొగాడియాకు ఆ గతి పట్టకపోవడం

భారతపాలనా రంగంలో అప్రకటితంగా వచ్చి చేరిన పక్షపాతానికి తార్కాణం.

అంత్యక్రియలనుండి 25 ఆగస్టునాడు తిరిగివచ్చిన ప్రదర్శకులు భారీగా విధ్వంసానికీ, దహన కాండకూ, హత్యలు, లైంగిక అత్యాచారాలకూ పాల్పడ్డారు. దీనిని చావుతప్పించుకున్న బాధితుల మాటలలోనే చెప్పుకుంటే బాగుంటుంది. కొందరు బాధితులు మాకు చెప్పిన కథనాలు దిగువ ఇస్తున్నాం. అయితే అప్పట్లో – 2008 సెప్టెంబర్ నెలలో – వారు అనుభవించిన హింస గురించి వారిచేత చెప్పించడం గగనంగా ఉండింది. బీభత్సకాండకు అది కలిగించే భయం కంటే వేరే సాక్ష్యం అక్కరలేదు. బాలిగుడ సబ్‌డివిజన్‌లోని అడవులలోనూ గ్రామాలలోనూ భయం పుష్కలంగా ఉండడం మేము చూసాము. సెప్టెంబర్ 20 సాయంత్రం దరింగబాడి బజారులో పాలక బిజు జనతాదళ్‌కు చెందిన మాజీ ఎంఎల్ఏ, పాణో క్రైస్తవుడు అయిన సలూజాప్రధాన్ మాకు తారసపడ్డాడు. అప్పటికి చీకటి పడుతూ ఉంది. బజారు నిండా జనం ఉన్నారు. మమ్మల్ని మేము పరిచయం చేసుకోగా అర్థంకానట్టు చిరునవ్వు నవ్వాడు. ప్రశ్నలకు సైగలతో సమాధానం చెప్పాడు. ఆ తరువాత తనవెంట రమ్మన్నట్టు సైగచేసి మోటార్ సైకిల్ ఎక్కి ఊరి బయటకు పరుగుతీసాడు. అతనిని సరిగ్గా అర్థం చేసుకున్నామో లేదో అన్న సంశయంతోనే మేము మా వాహనంలో అతనిని వెంబడించాము. ఊరు దాటిన తరువాత అతని బండి ఎడమపక్కకు తిరిగి ఒక పర్యాటక ప్రదేశంవైపు వెళ్లింది. అక్కడి నుండి పర్యాటకులు చుట్టుపక్కల ఉన్న కొండలూ లోయలూ చూసి ఆనందిస్తారంట. ప్రధాన్ అక్కడికి దారితీసింది అందుకోసం కాదు. మా విషయమంటారా, సుందర దృశ్యాలు తిలకించే మానసిక స్థితిలో మేము లేము, ఉన్నా దానికి కావలసిన వెలుతురూ లేదు. అయితే ఆ స్థలం దరింగబాడి గ్రామానికే కాక దరింగబాడినుండి బాలిగుడకు వెళ్లే రహదారికి కూడ కనిపించనంత లోపలికి ఉంది. అందుకే ప్రధాన్ అక్కడ ఆగాడు. అతని వెంటే బండ్లమీద వచ్చిన అతని అనుచరులు కూడ ఆగారు. అప్పుడుగానీ అతను మాట్లాడలేదు. అతను మాకు చెప్పిన విషయాలకంటే ఆ విషయాలు చెప్పడానికి అతను – పాలకపార్టీకి చెందిన మాజీ ఎంఎల్ఏ – తీసుకున్న జాగ్రత్తలు మాకు ఎక్కువ అవగాహన కల్గించాయి.



చంపి పడేసిన మృతదేహాలు

ఆ రాత్రి, మరుసటిరోజు పొద్దున్న మేము బాలిగుడలో కొందరితో మాట్లాడి ఆ తర్వాత అత్యధికంగా దాడులకు గురయిన రైకియాబ్లాక్ వైపు వెళ్లాము. రైకియాకు చెందిన కొందరు పాణో క్రైస్తవుల ఫోన్ నెంబర్లు మాకెవరో ఇచ్చారు. వారికి ఫోన్ చేయగా రైకియాలో తాము మాట్లాడలేమనీ ఆ ఊరిలోకి ప్రవేశించకముందే ఫలాన చోట ఆగమనీ చెప్పారు. అక్కడికి వారు మోటార్‌సైకిళ్లపైన



దాదాపు 50 వేల మంది ఇళ్లు, ఊళ్లూ వదిలిపెట్టి ఇలా శరణార్థుల శిబిరాలకు తరలి వెళ్లారు.

వచ్చారుగానీ రోడ్డు పక్కన మాట్లాడడానికి ఇష్టపడలేదు. ఒక కచ్చారోడ్డులోకి తమ బండ్లను పోనిచ్చి మమ్మల్ని వెంటరమ్మన్నారు. ఆ కచ్చారోడ్డు బజరంగ్‌దళ్ వాళ్ళు సాధారణంగా పోని గ్రామానికి దారితీస్తుందని మాకు వివరించారు. అందులో కొంత దూరం పోయి అక్కడ ఆగి రోడ్డుమీద కూర్చుని మాట్లాడసాగారు. అయినప్పటికీ కొద్దిసేపటికి వారిని భయం ఆవరించింది. తాము రైకియానుండి బయటికొచ్చి చాలాసేపు అయిందనీ ఇంకా ఎక్కువసేపు ఉంటే అనుమానిస్తారని చెప్పి వెళ్లిపోయారు. బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని గురించి కొంత మేరకయినా వివరంగా మాట్లాడగలిగింది శిబిరాలలోనే – కంధమల్ జిల్లాలోని శిబిరాలలో కాదు, భువనేశ్వర్‌లోనూ కటక్‌లోనూ ఉన్న శిబిరాలలో; విశాఖపట్నం వంటి పట్టణాలలో తలదాచుకున్న స్థలాలలో.

## కొన్ని ఉదంతాలు

- రవీంద్రనాథ్ ప్రధాన్ మాజీ సైనిక ఉద్యోగి. పాణో క్రైస్తవుడు. అతనిది చకాపద సమీపంలోని గటర్‌గాం గ్రామం. 24 ఆగస్టునాడు, లక్ష్మణానంద మృతదేహం చకాపద చేరుకోకముందే, 350 మంది 'జైబజరంగ్‌బలి', 'జైమాత', 'భారత్‌మాతాకీ జై' అన్న నినాదాలు ఇచ్చుకుంటూ కత్తులు చేతబట్టుకొని అతని గ్రామం మీదికొచ్చారు. గ్రామంలోని చర్చిని ధ్వంసం చేసారు. కాగడాలు వెలిగించి క్రైస్తవుల ఇళ్లు తగలబెట్టసాగారు. క్రైస్తవులంతా పారిపోయారుగానీ రవీంద్రనాథ్ తమ్ముడు రసానందప్రధాన్ (35) పక్షవాతం కారణంగా పారిపోలేక ఇంట్లో ఉండిపోయాడు. 'నన్ను ఇంటినుండి బయటకు లాగిపడేసి ఏమయినా చేసుకోండి' అని అతను కేకలు వేసినా దుండగులు ఖాతరు చేయలేదు. దూరంనుండి చూస్తున్న రవీంద్రనాథ్‌తో వాళ్లు హేళనగా నీ తమ్ముడ్ని చంపుతున్నాం చూడు అంటూ, రసానంద ఇంట్లో ఉండగానే వారి ఇంటికి నిప్పుపెట్టారు. అతను సజీవంగా దహనమై చనిపోయాడు. మొత్తం 37 ఇళ్లు ఆ రోజు ఆహుతి అయ్యాయి. పారిపోయిన క్రైస్తవులు ఆ రాత్రీ మరొక రెండు పగళ్లూ రాత్రులూ తిండి లేకుండ అడవిలో దాక్కొని చివరికి కాలినడకన కంధమల్ జిల్లాను దాటి భువనేశ్వర్


రవీంద్రనాథ్ ప్రధాన్


చేరుకున్నారు. అక్కడ వైఎంసిఎ లోని శిబిరంలో వారికి చోటు దొరికింది. అక్టోబర్ 8వ తేదీన రవీంద్రనాథ్ గ్రామానికి తిరిగి వెళ్లగా, కాలిపోయిన తన యింటి గోడలమీద 'క్రైస్తవ రాజ్యం సాగనివ్వం. హిందుస్తాన్‌లో హిందువులు మాత్రమే ఉంటారు. క్రైస్తవరాజ్యం నెలకొల్పాలని చూస్తే అగ్గిపుడుతుంది' అని రాసి ఉండడం చూసాడు. ధ్వంసమైన గ్రామచర్చి గోడలమీద జైశ్రీరాం, జైబజరంగ్‌బలి అని రాసిఉంది. అతని తమ్ముడి ఎముకలు రెండు లభ్యంకాగా, వాటిని ఖననం చేసాడు.

✠ క్రైస్తవ పాస్టర్‌ను పెళ్లిచేసుకున్న రైకియా నివాసి అయిన బ్రాహ్మణ స్త్రీ పుష్పాంజలి పాండా విషయం మీడియాలో బాగానే ప్రచారం అయింది. తనతో పాటు అధ్యాపకుడిగా ఉండిన దివ్య సుందర్ డిగాల్ అనే పాణో క్రైస్తవుడిని ఆమె పెళ్లి చేసుకుంది. తదుపరి డిగాల్ కె. నువాగాం బ్లాక్‌లోని ద్రెపంగా గ్రామంలో పాస్టర్ వృత్తి స్వీకరించి, రైకియాకు నివాసం మార్చాడు. పుష్పాంజలి రైకియాలో టైలరింగ్ పనినేర్పే ఉద్యోగం సంపాదించుకుంది. వాళ్లకు మోనాలిసా అనే కుమార్తె ఉంది. డిగాల్ 23 ఆగస్ట్‌నాడు ఎప్పటిలాగే చర్చికి వెళ్లాడు. 24వ తేదీన లక్ష్మణానంద హత్య గురించి విని, ఆరోజు ఇంటికి రాననీ తనూ పాపా జాగ్రత్తగా ఉండాలనీ పుష్పాంజలికి కబురు పంపాడు. 24 రాత్రి రైకియాపైన దాడి చేసిన వారు పుష్పాంజలి ఇంటి తలుపులు పదేపదే కొట్టారు. ఆ యింటిని కిరోసిన్ పోసి తగలబెడతాం అని బెదిరించారు. పుష్పాంజలి వారిని ప్రాధేయపడి ఆ రాత్రి గట్టెక్కించింది. 25న డిగాల్ ఫోన్ చేసి మరుసటిరోజు వస్తానన్నాడు. రైకియాలో అప్పటికే జరిగిన హింసాకాండ చూసిన ఆమె అక్కడ ఉండవద్దని నిర్ణయించుకుని కుమార్తెను తీసుకొని ద్రెపంగాకు బయలుదేరి వెళ్లింది. ఇంకా ఊరిబయట ఉండగానే ఎదురుగా వస్తున్న హిందువులు 'పాస్టర్‌ను చంపేసారు' అని ఆమెకు చెప్పారు. కుమార్తెతోబాటు ఆమె వెనక్కి రైకియాలోని శిబిరానికి వెళ్లింది. అయితే అక్కడ ఆర్ఎస్ఎస్‌కు చెందినవారు తిరిగి హైందవం తీసుకొమ్మని ఆమెపైన ఒత్తిడిపెట్టారు. ఆమె తండ్రికూడ హైందవం తీసుకుంటేనే ఇంటికి రానిస్తానని అన్నాడు. ఈ ఒత్తిడులు తప్పించుకోవడానికి ఆమె ఒక రాత్రి శిబిరంనుండి పాపతోసహా జారుకొని 20 లేక 25 కిలోమీటర్లు నడిచి ఏదో ఒక బండిపట్టుకొని భువనేశ్వర్ చేరుకుంది. అక్కడ వైఎంసిఎ క్యాంపులో


పుష్పాంజలి పాండా

ఉంటున్నది.

- చాలా క్రూరంగా చంపబడ్డ అక్బర్ డిగాల్ అనే పాస్టర్ మృతి గురించి అతని సోదరుడు బుల్గన్ డిగాల్ చెప్పిన కథ ఇది. బుల్గన్‌డిగాల్ కూడ మాజీ సైనికుడు. పాణో క్రైస్తవుడు. జి. ఉదయగిరి బ్లాక్‌లోని సులేసారుగ్రామ నివాసి. ఆగస్టు 25 నాడు లక్ష్మణానంద సరస్వతి అంత్యక్రియల కోసం కొన్ని వాహనాలు ఆ గ్రామం మీదుగా పోవడం క్రైస్తవులు చూసారు. వాహనాలలో ఉన్నవారు విద్వేష పూరితమైన నినాదాలు ఇవ్వడం విన్నారు. ఏమవుతుందో అని భయపడిన ఆ ఊరిలోని 22 క్రైస్తవ కుటుంబాలవారు ఒక టెంటు తీసుకొని పక్కనే ఉన్న గుట్టపైకి పోయారు. రాత్రి వాహనాలు వెనక్కి వెళ్లడం చూశారు కాని రెండు ఇంకా రాలేదని గమనించి గుట్ట సగభాగం దాకా కిందికి దిగి ఆ రెండు కూడ వచ్చేదాకా ఆగారు. ఆ జాగ్రత్త వాళ్ల ప్రాణాలు కాపాడింది. రాత్రి 9-30కు ఆ రెండు వాహనాలు (అవి ట్రాక్టర్లు) వెనక్కి వెళుతూ ఊరిలో ఆగాయి. అందులో ఉన్నవారు క్రైస్తవుల ఇళ్ల దగ్గర దిగి అన్ని ఇళ్లనూ తగలబెట్టారు. క్రైస్తవులు మళ్లీ గుట్ట ఎక్కి రాత్రంతా నడిచి నడిచి జి. ఉదయగిరిలోని శిబిరం చేరుకున్నారు. బుల్గన్ డిగాల్ ఆ రకంగా తన ప్రాణం కాపాడుకున్నాడుగానీ టొటోమహా గ్రామనివాసి అయిన అతని సోదరుడు అక్బర్ డిగాల్ (47) కు ఆ అదృష్టం లేకపోయింది. ఆ గ్రామంపైన దాడి ఆగస్టు 28న జరిగింది. దాడి మొదలుకాగానే అతను తన కుటుంబాన్ని పంపించేసాడు. కొంతసేపటికి అతను కూడ చెట్టు చేమలను చాటుచేసుకుని ఊరు విడిచిపెట్టి పోయే ప్రయత్నం చేసాడు గానీ అప్పటికే ఆలస్యం అయిపోయింది. దుండగులు అతనిని చుట్టుముట్టి పట్టుకున్నారు. మొదట అతని కాళ్లు నరికారు. తరువాత గొంతుకోసి చంపారు. *(ఈ కేసులో ఐదుగురికి ఫూల్‌బని ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ఈ సెప్టెంబర్ 22వ తేదీన జీవిత ఖైదు విధించింది.)*



బుల్గన్ డిగాల్

- ప్రమోద్‌కుమార్ ప్రధాన్ కంధా క్రైస్తవుడు. జి.ఉదయగిరి బ్లాక్‌లోని బాఖికంబ నివాసి. రాష్ట్ర ప్రభుత్వ సాయిల్ కన్సర్వేషన్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఆ ఊరిలో కంధ క్రైస్తవులు చాలామందే ఉన్నారు. కంధాలు కావడం వల్ల కాబోలు వారిపైన వెంటనే దాడి జరగలేదు. అయితే క్రైస్తవం విడిచిపెట్టమని వారిపైన ఒత్తిడి పెట్టారు. ఒకతను ఒత్తిడికి లొంగి మతం మార్చుకొని మరొక నలుగురిచేత కూడ మార్పించాడు. ఈ అయిదుగురూ కొంత ఆస్తిపరులనీ ఊరు విడిచిపెట్టి వెళ్లిపోవడానికి సిద్ధంగా లేరనీ ప్రమోద్ కుమార్ ప్రధాన్ అంటాడు. వీరి మత మార్పిడి సెప్టెంబర్ 16, 17 తేదీలలో జరిగింది. అప్పటినుండి మతం మార్చుకోవడానికి ఇష్టపడని వారి బతుకులు ప్రమాదంలో పడ్డాయి. 23 రాత్రి వారిపైన దాడి జరిగింది. పారామిలిటరీ బలగాలు అప్పటికి ఆ ప్రాంతంలో పహారా కాస్తున్నాయిగానీ

దుండగులు వారిని తప్పుబాట పట్టించి రాత్రి 10 గంటలప్పుడు క్రైస్తవుల ఇళ్లపైన దాడిచేసారు. ఆరు ఇళ్లు తగలబెట్టారు. క్రైస్తవులు అందరూ పారిపోగా దాడిచేసిన వారు వెంటబడ్డారు. వీళు ్ల ఊరిపక్కన ప్రవహిస్తున్న వాగులో నిలబడ్డారు. వాళ్లు వాగు దగ్గరకొచ్చి టార్చిలైటు వేయగా కిందికి వంగి నీళ్లలో మునిగి ఊపిరి బిగబట్టి తమ ఆచూకీ తెలియకుండ జాగ్రత్తపడ్డారు. తరువాత జి. ఉదయగిరికి పోయి అగ్నిమాపకదళ సిబ్బందిని మంటలు ఆర్పడానికి గ్రామానికి రమ్మని అడిగారు. పోలీసులు అడిగితే తప్ప రామని వారు అన్నారంట. వీళ్లు తెల్లారాక గ్రామానికి తిరిగి వచ్చారు. తమపైన దాడిచేసింది తోటి ఆదివాసులే కాబట్టి వారిని నిలదీసారు. అయితే వాళ్లు ఏమాత్రం వెనక్కి తగ్గకుండ, దాడి చేసింది బయటివారనీ తాము కాదనీ దబాయించారు. తమకు గ్రామంలో భద్రత లేదని అర్థం చేసుకున్న క్రైస్తవులు ఊరు విడిచిపెట్టి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. క్రైస్తవేతరులు వారిని చుట్టుముట్టి వెళ్లిపోకుండ నిరోధించాలని ప్రయత్నించారు గానీ వారు తప్పించుకుని జి.ఉదయగిరి శిబిరం చేరుకున్నారు. అయితే ఆ శిబిరంలో ఆర్ఎస్ఎస్ వాళ్లు యధేచ్ఛగా వచ్చి పోతుండడం గమనించి అక్కడినుండి భువనేశ్వర్ సమీపంలోని జాన్లాలోని శిబిరానికి వెళ్లిపోయారు.

✠ సైమన్ నాయక్ కె. నువాగాం బ్లాక్‌లోని పిరిగడ నివాసి. పాణో క్రైస్తవుడు. 24 ఆగస్టునాడు బజరంగ్‌దళ్ వాళ్లు వస్తున్నారని విని ఆ ఊరిలోని 15 క్రైస్తవ కుటుంబాలూ అడవిలోకి పారిపోయారు. అడవిలో మూడు రోజులు తిండిలేకుండ ఉన్నారు. 27వ తేదీన ఆ గ్రామానికి చెందిన క్రైస్తవేతర పాణోలు వచ్చి వారిని తిరిగి గ్రామానికి రమ్మన్నారు. వాళ్లు వెళ్లారు. 28వ తేదీన ధరంపూర్‌లో ఒక మీటింగ్‌కు వారిని రమ్మని పిలిచారు. దాని భావం వారికి అర్థం అయింది. ధరంపూర్ ఆర్ఎస్ఎస్ నాయకుల కేంద్రం. వారంతా గిరిజనేతరులు. అక్కడ వారిని మతం మార్చుకొమ్మని ఒత్తిడి చేసారు. సంఘ్‌పరివార్ దానిని 'పునరాగమనం' అంటుందని పైన చెప్పాము. ఒక కాగితం తీసుకొచ్చి దానిపైన సంతకం చేయమన్నారు. దానిపైన తాము విదేశీ మతాన్ని విడిచిపెట్టి హిందూ సమాజంలోకి తిరిగివస్తున్నట్టు రాసిఉంది. అందరూ దానిపైన సంతకం చేసారు. ఆ తరువాత వారందరికీ గుండుగీసి, నుదుటిమీద తిలకం దిద్ది ఆవుపేడ కలిపిన నీళ్లు (గోబర్‌పానీ) వారిచేత తాగించి, నెయ్యి కలిపిన అన్నం తినిపించారు. అయితే అక్కడినుండి వాళ్లెవ్వరూ తిరిగి గ్రామానికి వెళ్లలేదు. కె.నువాగాంలోని శిబిరానికి వెళ్లారు. వాళ్ల 'పునరాగమనం' స్వచ్ఛందం కాదనడానికి ఇంతకంటే రుజువు అక్కరలేదు. అయితే అక్కడకూడ భద్రంగా అనిపించక కటక్ పట్టణంలో ఎల్‌టిఎఫ్ సెంటర్ నెలకొల్పిన శిబిరానికి వెళ్లిపోయారు.



సైమన్ నాయక్



ఘర్‌వాపసి పేరిట జరిగే ప్రక్షాళన

✠ జి.ఉదయగిరి బ్లాక్‌లోని కొటింగియా గ్రామపంచాయితిలో సిపాయెజు అనే ఊరు ఉంది. రహదారి నుండి బాగా లోపలికి ఉన్న ఈ ఊరులోని 110 కుటుంబాలలో 50 క్రైస్తవులవి. లోపల ఉన్నాము కాబట్టి ఏమీ కాకపోవచ్చునని వారు ఆశించినట్టున్నారు. అయితే ఆగస్ట్ 26వ తేదీన 150 మంది గుంపు క్రైస్తవబస్తీ మీదికి దాడికి వచ్చింది. క్రైస్తవులంతా అడవిలోకి పారిపోయారు. దాడిచేసిన వారు వాళ్ల ఇళ్లన్నీ తగలబెట్టి వాళ్ల వెంటపడ్డారు. పొదలచాటున దాక్కున్న పాస్టర్ సుఖదేవ్ డిగాల్‌ను చూసి బయటకులాగారు. కర్రలతో విపరీతంగా కొట్టారు. వాళ్లు పని ముగించుకొని వెళ్లిపోవాలన్న తొందరలో ఉండడం అతని ప్రాణాన్ని కాపాడింది. క్రైస్తవులంతా నాలుగురోజులు తిండి, నీళ్లు లేకుండ అడవిలోనే ఉండిపోయారు. తర్వాత నెమ్మదిగా బయటికొచ్చి రహదారిపైన ఉన్న బాంజ్‌నగర్ చేరుకున్నారు. జి.ఉదయగిరిలో శిబిరం ఆ బ్లాక్‌లోని వారికోసం నెలకొల్పినదే కానీ 'దారిలో హిందూ గ్రామాలు చాలా ఉండడంవల్ల' అక్కడికి పోలేదని పాస్టర్ డిగాల్ అంటాడు. భువనేశ్వర్‌కు పోయి వైఎంసిఎలోని శిబిరంలో చేరారు.



ప్రభాసేని నాయక్

✠ కె. నువాగాం బ్లాక్‌లోని పిరిగుడకు చెందిన ప్రభాసేని నాయక్ సాహసి. 24 ఆగస్ట్‌నాడు గ్రామంలో పెద్దపెట్టున నినాదాలు వినపడడంతో 'ఊరు వదిలిపెట్టి పోవలసి వస్తుందేమోనని క్రైస్తవులు అన్నంకూడ వండుకోలేదు' అంటుంది ఆమె. తక్కిన వాళ్లంతా అడవులలోకి పారిపోయారుగానీ ఆమె భర్త ఆంథోనికి తీవ్ర అనారోగ్యం ఉన్న కారణంగా ఆమె ఒక్కతే ఉండిపోయింది. 25వ తేదీన దాడి జరిగింది.


సిస్టర్ మీనా లలిత

ఆంథోనిని ఇనుపరాడ్లతో బాగా కొట్టారు. క్రైస్తవేతర పాణోలు ఆమెను కూడ వెళ్లిపొమ్మని చెప్పారు. ఆమె భర్తనూ తొమ్మిదేళ్ల కొడుకునూ తీసుకుపోయి బాలిగుడలోని ఆస్పత్రిలో చేర్పించింది. 17 సెప్టెంబర్‌నాడు ఇంటి సామాన్లేమయినా ఉంటే తెచ్చుకుందామని గ్రామానికి తిరిగిపోయింది. కాని అక్కడ క్రైస్తవుల ఇళ్లన్నీ కాలిపోయి ఉన్నాయి. సగం కాలిన బైబిల్ ప్రతి ఒకటి దొరకగా అది తీసుకుని వెనక్కి వచ్చేసింది.

✠ కంధమల్ ఘోరానికి ప్రతీకగా నిలిచిన ఉదంతం సిస్టర్ మీనా లలితపైన జరిగిన మూకుమ్మడి లైంగిక హింస. ఆమె అక్టోబర్ 24న ఢిల్లీలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు బయటపెట్టేదాకా ఈ నోటా ఆ నోటా ఒక వదంతిగా వినడమే తప్ప వివరాలు ఇరుగు పొరుగు ఊర్లవాళ్లకు సహితం తెలియలేదు. ఆగస్ట్ 25న కె.నువాగాంలో ఒక క్రైస్తవ సన్యాసిని పైన అత్యాచారం జరిగిందని మాత్రమే – అనేక దుర్మార్గాలలో ఒక దుర్మార్గంగా – బయటినుండి వెళ్లిన నిజనిర్ధారణ కమిటీలకు స్థానికులు చెప్పారు.

సిస్టర్ మీనా కె.నువాగాంలోని దివ్యజ్యోతి పాస్టరల్ సెంటర్‌లో ఉండేది. 24 ఆగస్ట్ సాయంత్రం ఒక పెద్దగుంపు ఆ సంస్థ గేట్ దగ్గర గుమికూడి ద్వేషపూరితమైన నినాదాలు ఇవ్వసాగారు. సంస్థలోని వారు వెనక తలుపునుండి అడవిలోకి పారిపోయారు. రాత్రి బయటికొచ్చి ప్రహ్లాద్ అనే హిందువు ఇంట్లో తలదాచుకున్నారు. అప్పటికే దివ్యజ్యోతి సెంటర్ అగ్నికి ఆహుతి అయిపోయింది. 25వ తేదీ మధ్యాహ్నం ఒక గుంపు ఆ యింటికి వచ్చారు. సిస్టర్ మీనాను జుట్టు పట్టుకొని బయటకు గుంజుకుపోయారు. బయట గొడ్డళ్లు, కత్తులు, కర్రలు, కొడవళ్లు, ఇనుపరాడ్లు పట్టుకున్న 40–50 మంది ఉన్నారు. అప్పటికే ఫాదర్ థామస్ చెల్లన్ అనే మతగురువును కూడ పట్టుకున్నారు. ఇద్దరినీ తగలబడుతున్న జనవికాస్ కేంద్రం అనే సంస్థ భవనం దగ్గరికి తీసుకుపోయారు. ఆ మంటలలో వేస్తారేమోనని వారు అనుకున్నారు. అయితే ఆ భవనం వరండాలోకి వారిని తీసుకుపోయి సిస్టర్ మీనా బట్టలు చింపి కిందపడేసి రెండు చేతులమీద ఇద్దరు నిలబడ్డారు. ఫాదర్ థామస్ చెల్లన్ అభ్యంతరం తెలపగా ఆయనను కొట్టి అక్కడినుండి తీసుకుపోయారు. సిస్టర్ మీనాను మూడవ వ్యక్తి రేప్ చేసాడు. ఆ తరువాత మరొకడు ఆమెను మెట్ల దగ్గరికి తీసుకుపోయి కిందపడేసి రేప్ చేయబోయాడుగానీ అంతలో పెద్ద గుంపు అక్కడికి వచ్చింది. గుంపులో ఒకరు అతనిని వారించగా అతను ఆగాడు. సిస్టర్ మీనా మెట్లకింద దాక్కునే ప్రయత్నం చేసింది. ఆమెను బయటకు లాగమని జనంనుండి కేకలు వేసారు. వందమంది ఆమెను రేప్ చేయాలని అరిచారు. ఆమెను రోడ్డు మీదికి గుంజుకొచ్చారు. అక్కడ మోకాళ్లమీద నిలబడిన ఫాదర్ థామస్ చెల్లన్‌ను జనం కర్రలతో కొడుతుండడం ఆమె చూసింది. ఇద్దరినీ తాడుతో కట్టి మంటలలో వేయాలని ఒకరు, నగ్నంగా

ఊరేగించాలని ఒకరు తలా ఒక విధంగా కేకలు వేసారు. చివరికి ఇద్దరినీ కె.నువాగాం మార్కెట్‌దాకా నడిపించారు. సిస్టర్ మీనా దాదాపు ఒంటిమీద బట్టలు లేకుండా ఉంది. మార్కెట్‌లో ఆమె స్పెషల్ పోలీసు బృందాన్ని చూసి వారి దగ్గరకు వెళ్లి వాళ్లమధ్య కూర్చుంది. ఆ పోలీసులు కనీసం ఆమె వైపు చూడను కూడ లేదు. జనం మళ్లీ ఆమెను గుంజుకుపోయారు. పోలీసులు ఆమెను కాపాడడానికి ఏ ప్రయత్నమూ చేయలేదు. చివరికి జనమే ఆమెనూ, ఫాదర్ థామస్ చెల్లన్‌నూ కె.నువాగాం పోలీస్ అవుట్‌పోస్ట్‌లో అప్పగించారు. ఆక్కడ ఆమె వివరంగా ఫిర్యాదు చేయగా ఇన్‌స్పెక్టర్ 'ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుకుంటున్నావా?' అని అడిగాడు. 'దాని పర్యవసానాలు ఎట్లా ఉంటాయో తెలుసా?' అన్నాడు. ఆమె తన ఫిర్యాదు వివరంగా రాయబోగా అంతెందుకు రాస్తున్నావు, అట్లాగా రాసేది అంటూ మూడుసార్లు దానిని కుదించి రాయించాడు.

## పథకం ప్రకారం జరిగిన దాడులు

ఒక్కొక్క ఘటన గురించి విడివిడిగా చెప్పుకుంటూ ఉంటే వాటివెనక ఉన్న పథకం కనిపించకపోవచ్చు. కానీ ఈ మొత్తం హింసాకాండ పథకం ప్రకారమే జరిగిందనడానికి దాఖలాలున్నాయి. లక్ష్మణానందను మావోయిస్టులు చంపుతారని సంఘ్‌పరివార్ ఊహించి ఉండకపోవచ్చునుగానీ, ఏ అవకాశం లభించినా క్రైస్తవులపైన దాడి చేయడానికి కావలసిన సంసిద్ధత వారి చర్యలలో స్పష్టంగా కనిపిస్తుంది. రైకియా, కె.నువాగాం బ్లాక్‌లను ఉదాహరణలుగా తీసుకోవచ్చు. అత్యధికంగా దాడులు ఈ రెండు బ్లాక్‌లలో జరిగాయి. రైకియాలోనయితే ఆగస్ట్ 24 నుండి 28 దాకా నిర్విరామంగా దాడులు జరిగాయి. 25వ తేదీ నుండి ఆ ప్రాంతమంతా 144 సెక్షన్ అమలులో ఉన్నా దాడులకు అది ఆటంకం కాలేదు. పెద్దపెద్ద చెట్లు కొట్టి రహదార్లకు అడ్డం వేసారు. సెప్టెంబర్ 9 నాటికి 500 చెట్లను ఆ విధంగా కొట్టి పడేసారని అధికారులు లెక్కించారు. రాకపోకలను ఈ విధంగా అటకాయించిన గుంపులు ఒక ఊరినుండి ఇంకొక ఊరికి పోతూ దహనానికీ, హత్యాకాండకూ పాల్పడ్డారు. రైకియా బ్లాక్‌లో ఒకే గుంపు మొదట కటింగియా గ్రామానికి, అక్కడినుండి గుడ్రికియాకు, అక్కడినుండి కిటింగియాకు, అక్కడినుండి మొండేకియాకు వెళ్లి బీభత్సకాండకు పాల్పడింది. కె.నువాగాం బ్లాక్‌లోనయితే ప్రధాన గ్రామమే పెద్దెత్తున హింసాకాండను చవిచూసింది. సిస్టర్ మీనాపైన అత్యాచారం జరిగింది ఇక్కడే. ఒక కాథలిక్ చర్చినీ, పెంతెకోస్త్ చర్చినీ, జనవికాస్, దివ్యజ్యోతి అనే సంఘసేవా సంస్థల కట్టడాలను తగలబెట్టారు. కె.నువాగాంను ఆనుకొని ఉన్న జుగాపదర్ అనే క్రైస్తవ బస్తీని పూర్తిగా కాలబెట్టారు. బయటినుండి వచ్చిన గుంపు వెళ్లిపోయిన తరువాత ఆ ఊరికే చెందిన 200–300 గుంపు కత్తులు, పెట్రోల్, డీజిల్ పట్టుకొని 11 పంచాయితీలలో అన్ని చర్చిలను, క్రైస్తవులందరి ఇళ్లను దహనం చేసింది. ఈ దాడిలో కంధాలతోబాటు 'ఒరియాలు' (అంటే సవర్ణ హిందువులు) కూడ పాల్గొన్నారని జుగాపదర్ బస్తీకి చెందిన పాస్టర్ సూరత్ నాయక్ కరాఖండిగా అన్నాడు.

హత్యలు ఆగిన తరువాత కూడ ఇళ్లనూ చర్చిలనూ తగలబెట్టడం కొనసాగింది. ఉదాహరణకు సెప్టెంబర్ 18 నాడు బాలిగుడను జి. ఉదయగిరికి కలిపే రహదారిపైన అనేక గ్రామాలలో దహనకాండ జరిగింది. వాటిలో ఒక గ్రామమయిన లకెబాడిలో క్రైస్తవ పాణోలతో మేము మాట్లాడగలిగాము. అక్కడ క్రైస్తవుల ఇళ్లు 40 ఉన్నాయి. అవి ఊరికి కొంత దూరంగా విడిగా


మురికి వాడలను తలపిస్తున్న శిబిరాలు

ఉన్నాయి. ఆ ఊరి చర్చిని ఆగస్ట్ 25న తగలబెట్టారు. సెప్టెంబర్ 18 న చీకటి పడుతుండగా తుపాకులు పట్టుకున్న గుంపు 'భారత్‌మాతాకీ జై' అనీ 'జైశ్రీరాం' అనీ నినాదాలు ఇస్తూ లకెబాడిపైన దాడిచేసారు. వారిని చూసి భయపడిన పాణోలు అడవిలోకి పారిపోగా, దుండగులు ఒక్కొక్క ఇల్లు తీరికగా లూటీచేసి 40 ఇళ్లూ కాలబెట్టారు.

## పోలీసులు ఏం చేస్తున్నారు?

ఏం చేయడంలేదు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయలేదు, దాడి గురించి సమాచారం ఇస్తే విచారించడానికి ఎవరినీ పంపలేదు. ఎవరి స్టేషన్‌లో వారు నిమ్మకు నీరెత్తినట్టు కూర్చున్నారు. క్రైస్తవులను సంఘ్‌పరివార్ గుంపులకు అప్పగించి చేతులు కట్టుకు కూర్చున్నారు. రాపిడ్ ఆక్షన్ ఫోర్స్‌ను దించిన తరువాతే క్రైస్తవులకు కొంత రక్షణ లభించింది, వారి ఫిర్యాదులకు కొంత స్పందన లభించింది. స్థానిక పోలీసుల ఆలోచనలు సంఘ్‌పరివార్ దృక్పథానికి అనుకూలంగా ఉండడం దీనికి కారణం కావచ్చు. మైనారిటీల పట్ల సగటు పోలీసు సిబ్బంది సంఘ్‌పరివార్ వైఖరే ప్రదర్శించడం చాలామందికి ఎదురయిన అనుభవం. లేదా సంఘ్ పరివార్ రాజకీయ ముఖం అయిన భారతీయ జనతాపార్టీ ఒరిస్సాలో అప్పట్లో అధికారం పంచుకుంటున్న కారణంగా బజరంగ్‌దళ్‌పైన ఎంత తీవ్రంగా చర్యలు చేపట్టవచ్చునో పోలీసులకు అర్థంకాక తటపటాయించారనుకోవాలి. 'తుపాకులు మా చేతిలో ఉన్నాయి గానీ తూటా నవీన్ పట్నాయక్ చేతిలో ఉంది. ఆయన ఊ అంటే రెండు రోజులలో అల్లర్లను అదుపుచేస్తాం' అని పోలీస్ అధికారులు తమతో అన్నట్టు చాలామంది చెప్పారు. మూడవ కారణం భయంకావచ్చు. 'మీ ప్రాణాలు మీకెంతో మా ప్రాణాలు మాకు అంతే'నని పోలీసులు తమతో అన్నట్టు కూడ జనం చెప్పారు. వెరసి దాడులు

జరుగుతున్నప్పుడు క్రైస్తవులకు పోలీసులనుండి లభించిన సహాయం శూన్యం. తిరిగి తమ స్వంత గ్రామాలలో పోయి ఉండడానికి పోలీసులు అంతకంటే సహాయం చేస్తారన్న నమ్మకమూ లేదు. వాళ్లు తిరిగి వెళ్లాలంటే క్రైస్తవాన్ని విడిచి పెట్టాలన్న షరతు సంఘ్‌పరివార్ నిర్ద్వంద్వంగా పెడుతున్నది. అయితే శరణార్థులుగా మారిన క్రైస్తవులలో అత్యధికులు శాశ్వతంగా కాందిశీకులుగా ఉండడానికి సిద్ధంగా ఉన్నారేతప్ప ఈ షరతుకు తలవొగ్గడం లేదనేది చెప్పుకోదగ్గ విషయం. టికాబలి బ్లాక్‌లోని బడిముండా గ్రామానికి చెందిన గేబ్రియల్ నాయక్‌ను మేము భువనేశ్వర్ సమీపంలోని జాన్లా శిబిరంలో కలిసాము. వాళ్ల ఊరిలో ఆగస్ట్ 25న ఒక వ్యక్తి చనిపోగా 26వ తేదీన అతని అంత్యక్రియలు జరుగుతుంటే క్రైస్తవులంతా అక్కడ ఉండగా ఊరిపైన బజరంగ్‌దళ్ దాడిచేసింది. 500 మంది బజరంగీలు దాడిచేసి కమ్యూనిటీహాలు, మూడు ఇళ్లు ధ్వంసం చేసారు. ఊరిలోని 80 క్రైస్తవ కుటుంబాలూ ఊరు విడిచిపెట్టి అడవిలోకి వెళ్లిపోయాయి. దుండగులు అక్కడినుండి దోమగుడకు పోయి అక్కడ కూడ చాలా ఇళ్లు తగలబెట్టారు. బడిముండాకు చెందిన క్రైస్తవులు కొంతకాలం తరువాత గ్రామానికి తిరిగి వెళ్లారు. వెళ్లిన రెండురోజులకు వారికి బెదిరింపులు వచ్చాయి. తమకు చర్చి ఫాదర్లు, సిస్టర్లు డబ్బులివ్వగా తాము మతం మార్చుకున్నామనీ ఇప్పుడు తిరిగి హైందవం స్వీకరిస్తున్నామని రాసివ్వాలనీ లేకపోతే మళ్లీ దాడి తప్పదనీ వారిని బెదిరించారు. 80లో 33 కుటుంబాల పెద్దలు రాసిచ్చారు. తక్కినవారు దానికి ఇష్టపడక ఊరు విడిచిపెట్టి టికాబలిలోని శిబిరంలో చేరారు. అయితే టికాబలి శిబిరంపైన దాడి చేసి పాస్టర్లను చంపే పథకం ఉందని ఒక హిందూ స్నేహితుడు హెచ్చరించగా పాస్టర్ అయిన గేబ్రియల్ నాయక్ అక్కడినుండి జాన్లాకు పోయి అక్కడి శిబిరంలో చేరాడు. గ్రామాలలో శాంతి పునరుద్ధరణ గురించి అతనిని అడిగితే 'ఏ రోజయితే ఆ 33 కుటుంబాలు తాము క్రైస్తవులమని ప్రకటించుకుంటాయో ఆ రోజు శాంతి తిరిగి వచ్చిందని నమ్ముతాను' అంటాడు.

> **శిబిరాలు ఆగస్ట్ 26న మొదలయ్యాయి. సెప్టెంబర్ 1 నాటికి 12,500 మంది, మరుసటి రోజు సాయంత్రానికి 19,642 మంది, 3వ తేదీనాటికి 18 శిబిరాలలో 23,746 మంది ఉన్నారు. దాడులు ఎంత ఘోరంగా జరిగాయనడానికి ఇదే తార్కాణం.**

## శరణార్థులు 50వేల పైనే

ఒరిస్సా ప్రభుత్వం అభిప్రాయం మాత్రం అదికాదు. శిబిరాలలోని నిర్వాసితుల సంఖ్యను తగ్గించి చూపించడంపైననే మొదటినుండి వారి దృష్టి. బాధితులను వీలయినంత త్వరగా వెనక్కి పంపించేయాలని చూసారు. శిబిరాలు ఆగస్ట్ 26న మొదలయ్యాయి. 30 నాటికి శిబిరాలలో 7500 మంది ఉన్నారు. సెప్టెంబర్ 1 నాటికి 12,500 మంది, మరుసటి రోజు సాయంత్రానికి 19,642 మంది, 3వ తేదీనాటికి 18 శిబిరాలలో 23,746 మంది ఉన్నారు. దాడులు ఎంత ఘోరంగా జరిగాయనడానికి వేగంగా పెరిగిన ఈ శరణార్థుల సంఖ్యకంటే తార్కాణం అవసరం లేదు. పైగా ఇది కంధమల్ జిల్లాలో ఉన్న గుర్తింపు పొందిన శిబిరాలలోని సంఖ్య మాత్రమే. దూరం పారిపోయి తమంతట తాము నీడ వెతుక్కున్నవారి ఖచ్చితమైన లెక్క ఆనాడు ఈనాడు కూడ లేదు. మొత్తం 50,000 మంది

శరణార్థులయ్యారన్న క్రైస్తవ సంస్థల అంచనా వాస్తవికమనే అనిపిస్తుంది. కాగా సెప్టెంబర్ 3 తరువాత శిబిరాలలోని సంఖ్యను ఎట్లాగయినా తగ్గించాలన్నదే ఒరిస్సా ప్రభుత్వం వైఖరిగా ఉంది. క్రైస్తవులు గ్రామానికి తిరిగి రావాలంటే మతం విడిచిపెట్టాల్సిందేనని బజరంగ్‌దళ్ పెట్టిన షరతులలో సడలింపు ఏమీ లేకపోయినప్పటికీ శిబిరాలలోని శరణార్థుల సంఖ్య వేగంగా తగ్గసాగింది. సెప్టెంబర్ 20న మా బృందం కంధమల్ వెళ్లేసరికి 13000కు దిగింది. 12,934 అని అక్టోబర్ 12న ఒరిస్సా ప్రభుత్వం సుప్రీంకోర్టుకు చెప్పింది. డిసెంబర్ వచ్చేసరికి 8,200కు దిగింది. దీనివెనక ఉన్న రహస్యాన్ని ఆ రాష్ట్ర దక్షిణ ప్రాంత రిలీఫ్ కమిషనర్ మా బృందానికి వెల్లడించారు. ఇళ్లు కోల్పోయిన వాళ్లకు మాత్రమే అధికారిక శిబిరాలలో ఉండే హక్కు ఉందనీ ఇళ్లు భద్రంగా ఉన్నవాళ్లను వెనక్కి పంపించేస్తున్నామనీ ఆయన చెప్పాడు. ఇంకా స్పష్టంగా, 'కేవలం భయంవల్ల పారిపోయిన వాళ్లు వెనక్కి పోవాల్సిందే' అన్నాడు. దీని ఫలితం ఏమిటంటే శిబిరాల నుండి వెనక్కి పంపించబడ్డవారిలో అత్యధికులు తిరిగి గ్రామాలకు పోలేదు. ప్రభుత్వ శిబిరాలనుండి చర్చిలు, ఇతర క్రైస్తవ సంస్థలు నిర్వహించిన శిబిరాలకు వెళ్లారు. లేదా ఆంధ్రప్రదేశ్‌తో సహా ఇతర రాష్ట్రాలకు పారిపోయి అనువయిన చోట తలదాచు కొన్నారు. వీరి సంఖ్య ఎంత అన్నదానికి కచ్చితమైన లెక్కలేదు.

ఏ దశలోనయినా బజరంగ్‌దళ్‌కు సరండరయి తిలకం పెట్టించుకొని 'జైశ్రీరాం' అని ఉంటే క్షేమంగానే ఊరికి తిరిగి పోగలిగి ఉందురు. ఆ రాజీ అతికొద్దిమంది మాత్రమే ఎంచుకున్నారన్నది బలవంతపు మత మార్పిడి అన్న నింద ఎంత అబద్ధమో తెలుపుతుంది.

ఈ శరణార్థులు అనుభవించిన హింస గురించి తెలుసుకుంటే తప్ప కేవలం భయం వల్ల పారిపోయినవారు వెనక్కి పోవలసిందేనన్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిలోని అమానుషత్వం అర్థం కాదు. ఎవ్వరూ నేరుగా ఇంటినుండి శిబిరాలకు పోలేదు. ఊరిమీద బజరంగ్‌దళ్ దాడిచేయగా పారిపోయి అడవులలో మూడు నాలుగు రోజులు తిండీ నీళ్లూ లేకుండ దాక్కున్నారు. గ్రామానికి తిరిగి పోయే అవకాశం లేదని గ్రహించిన తరువాతే కాలినడకన రహదార్లు, గ్రామాలు తగలకుండ శిబిరాలకు నడిచి వెళ్లారు. చాలా సందర్భాలలో పగలు ఇక్కడా అక్కడా దాక్కొని రాత్రివేళ మాత్రం ప్రయాణం చేశారు. కంధమల్‌లోని శిబిరాలలోకి సంఘ్‌పరివార్ కార్యకర్తలు యధేచ్ఛగా వచ్చి పోతుండడంవల్ల అక్కడ కూడ వారికి భద్రత అనిపించలేదు. ముఖ్యంగా పాస్టర్లు, సిస్టర్లు, అక్కడినుండి రోజుల తరబడి నడిచి హైవే ఎక్కి భువనేశ్వర్ చేరుకున్నారు. ఏ దశలోనయినా బజరంగ్‌దళ్‌కు సరండరయి తిలకం పెట్టించుకొని 'జైశ్రీరాం' అని ఉంటే క్షేమంగానే ఊరికి తిరిగి పోగలిగి ఉందురు. ఆ రాజీ అతికొద్దిమంది మాత్రమే ఎంచుకున్నారన్నది బలవంతపు మత మార్పిడి అన్న నింద ఎంత అబద్ధమో తెలుపుతుంది. ఆ స్థితిలో బాధిత కంధమల్ క్రైస్తవులను ప్రధానంగా నడిపించింది వారి బలమైన ఆత్మాభిమానమే.

శ్రీకాకుళం జిల్లాలో రెండుచోట్ల భాషకూడ తెలియని ఊర్లలో శరణుపొందిన వారిని మా బృందం అక్టోబర్ 30న కలిసింది. మందస మండలం కుదంసింగిలో 112 మంది, మెళియాపుట్టి

మండలం సవరకుల్లిగాంలో 140 మంది ఉన్నారు. వీళ్లంతా బాలిగుడ సబ్‌డివిజన్‌లోని వివిధ గ్రామాలకు చెందిన క్రైస్తవ పాణోలు. ఆగస్ట్ 25న వాళ్ల గ్రామాలపైన దాడి జరిగినాక ఊర్లనుండి కట్టుబట్టలతో పారిపోయి వారంరోజులు నిర్జన ప్రదేశాలలో తలదాచుకొని ప్రభుత్వ శిబిరాలు చేరుకున్నారు. అయితే శిబిరాలు అభద్రంగా అనిపించాయి. బజరంగ్‌దళ్, దుర్గావాహిని కార్యకర్తలు శిబిరాలలోకి వచ్చి వారిని బెదిరించారు. శిబిరాల నీటి సరఫరాలో విషం కలిపారన్న వదంతులూ వ్యాపించాయి. శిబిరాలలో 10–15 రోజులు గడిపి అక్కడినుండి బరంపురం వెళ్లారు. బైబిల్ సెంటర్డ్ మినిస్ట్రీస్ అనే చర్చి సహాయం కోరారు. వారికి శ్రీకాకుళం జిల్లాలో మాత్రమే అంతమంది తలదాచుకోగల నిర్మాణాలు ఉండడం వల్ల ఈ జనాన్ని అక్కడికి తరలించారు. కేవలం తినడానికింత తిండి తప్ప వేరే ఏ సదుపాయమూ కల్పించే స్థితిలో ఆ చర్చి నిర్వాహకులు లేకున్నప్పటికీ అక్కడే ఉన్నారు. ఆత్మగౌరవం కాపాడుకోవాలన్న వారి ఆరాటమే ఇన్ని కష్టాలు భరించేటట్టు చేస్తున్నదని గ్రహించలేని ప్రభుత్వం వారిని అర్థం చేసుకోలేదు, వారి ఆకాంక్షను ఆదరించలేదు.

వేదన కారణంగా బాధితులలో ఆగ్రహం వ్యక్తం కావడం సహజం. భువనేశ్వర్ సమీపంలోని జాన్లాలో ఉన్న మదర్ థెరెసాసెంటర్‌లో ఒక శిబిరం ఉందని తెలిసి మేమక్కడికి వెళ్లగా, దాని నిర్వాహకురాలయిన సిస్టర్ సుజిత్ చాలా కోపంగా మాట్లాడింది. శిబిరంలోని ప్రజలతో మాట్లాడడానికి మాకు మొదట అనుమతి ఇవ్వలేదు. తానూ, 12 మంది ట్రైనింగ్‌లో ఉన్న అమ్మాయిలు దుండగులనుండి తప్పించుకోవడానికి పడిన పాట్లు ఆమె చెప్పగా విన్న తరువాత ఆమె కోపానికి కారణం మాకు అర్థం అయింది. ఆమె జి. ఉదయగిరి బ్లాక్‌లో ఉన్న సుకానంద అనే గ్రామంలో ఒక కాన్వెంట్‌లో ఉండేది. ఆమెతోబాటు ఆ 12 మంది అమ్మాయిలు ఉండేవారు. పక్కనే ఉన్న కె.నువాగాం బ్లాక్‌లో సిస్టర్ మీనా లలితపైన జరిగిన అత్యాచారం గురించి వారు విన్నారు. భయం భయంగా ఉన్నారు. సెప్టెంబర్ 15వ తేదీన గ్రామస్తులు వచ్చి ఇక్కడ ఉండడం మంచిది కాదనీ వెళ్లిపొమ్మనీ ఆమెకు సలహా ఇచ్చారు. ఆ హెచ్చరికను వాళ్లు లెక్కచేయడం మంచిదయింది. వాళ్లు ఖాళీ చేసిన రెండవరోజే ఆ కాన్వెంట్‌పైన దాడి జరిగింది. అది పూర్తిగా ధ్వంసం అయింది. అప్పటికే సిస్టర్ సుజిత్, 12 మంది ట్రైనీలు అడవి చేరుకున్నారు. తిండీనీళ్లూ లేకుండ నాలుగు రోజులు అడవిలో ఉండి జి.ఉదయగిరిలోని శిబిరం చేరుకున్నారు. అయితే అక్కడి వాతావరణం కూడ భద్రంగా తోచక ఆ అమ్మాయిలను తీసుకొని ఆమె భువనేశ్వర్ వచ్చి జాన్లా శిబిరానికి నిర్వాహకురాలయింది. మేమెవరమో, ఎందుకోసం వచ్చామో గ్రహించిన తరువాత ఆమె మాతో పూర్తిగా సహకరించింది. శిబిరంలోని బాధితులతో వివరంగా మాట్లాడనిచ్చింది.

## ఇంతకీ మృతులెందరు?

ఇక గణాంకాలు చూద్దాం. ఒరిస్సా ప్రభుత్వం లెక్కల ప్రకారం కంధమల్ దాడులలో మరణించినవారి సంఖ్య 32. క్రైస్తవ సంస్థలు మృతుల సంఖ్య 75 నుండి 123 దాకా ఉందంటున్నాయి. భువనేశ్వర్ ఆర్చ్‌బిషప్ రాఫెల్ చీనత్ సుప్రీంకోర్టుకు ఈ సంవత్సరం ఫిబ్రవరిలో సమర్పించిన 75 మంది మృతుల జాబితాలో మృతుని పేరు, గ్రామం, కొన్ని సందర్భాలలో చనిపోయిన తేదీకూడ ఉంది. అందులో ఒక్కరి గురించయినా వారు బ్రతికే ఉన్నారనీ ఫలానచోట ఉన్నారనీ ఒరిస్సా ప్రభుత్వం అనలేదు కాబట్టి ఆ జాబితాను కాదననవసరం లేదు. ఆవాసాల (ఇల్లు,

# మృతుల జాబితా

ఆర్చ్‌బిషప్ రాఫెల్ చీనత్ సుప్రీంకోర్టుకు సమర్పించిన మృతుల జాబితా. ఇందులో మొదటి 32 పేర్లను మాత్రమే ప్రభుత్వం ఒప్పుకుంటున్నది.

| నెం. | మృతుని పేరు | ఊరు | చనిపోయిన తేదీ |
|---|---|---|---|
| 1. | త్రినాథ్ డిగాల్ | బూడెదిపద | 25 ఆగస్ట్ |
| 2. | దశరథ్‌ప్రధాన్ | తియాంగియా | 25 ఆగస్ట్ |
| 3. | బిక్రంకుమార్ నాయక్ | బూడెదిపద | 25 ఆగస్ట్ |
| 4. | పరిఖిత నాయక్ | బూడెదిపద | 27 ఆగస్ట్ |
| 5. | దీనబంధు ప్రధాన్ | లముంగియా | 29 ఆగస్ట్ |
| 6. | గోపన్‌కుమార్ నాయక్ | బడీముండ | 26 ఆగస్ట్ |
| 7. | శిబన ప్రధాన్ | సిసాపంగ | 25 ఆగస్ట్ |
| 8. | అక్బర్ డిగాల్ | సులాసేరు | 26 ఆగస్ట్ |
| 9. | రసానంద ప్రధాన్ | గడ్రగాం | 24 ఆగస్ట్ |
| 10. | అభిమన్యునాయక్ | బరాపలి | 27 ఆగస్ట్ |
| 11. | రమేశ్‌చంద్ర డిగాల్ | డకారపంగ | 25 ఆగస్ట్ |
| 12. | దిబ్యసుందర్ డిగాల్ | సిపాయెజు | 25 ఆగస్ట్ |
| 13. | మాథ్యూనాయక్ | కన్నాగిరి | 26 ఆగస్ట్ |
| 14. | జనమతినాయక్ | బకింగియా | 26 ఆగస్ట్ |
| 15. | సామ్యూల్ నాయక్ | బకింగియా | 26 ఆగస్ట్ |
| 16. | ఫిదెం నాయక్ | బ్రేకా | 25 ఆగస్ట్ |
| 17. | పబిష్తినాయక్ | అదాసికుప | 25 ఆగస్ట్ |
| 18. | సిద్దేశ్వర ప్రధాన్ | సులాసేరు | 25 ఆగస్ట్ |
| 19. | మదన్‌నాయక్ | బ్రేకా | 25 ఆగస్ట్ |
| 20. | శశికాంత్ నాయక్ | దాకేడి | 25 ఆగస్ట్ |
| 21. | రమణీ నాయక్ | రుడాంగియా | 30 సెప్టెంబర్ |
| 22. | మేఘానంద డిగాల్ | శంకరఖోల్ | 25 సెప్టెంబర్ |
| 23. | ప్రియతమ డిగాల్ | శంకర్‌ఖోల్ | 25 సెప్టెంబర్ |
| 24. | రాఘబ్ డిగాల్ | సిసాపంగా | 25 సెప్టెంబర్ |
| 25. | కంతేశ్వర డిగాల్ | శంకర్‌ఖోల్ | 24 సెప్టెంబర్ |
| 26. | లాలాజీ నాయక్ | గదాగుడ | 30 సెప్టెంబర్ |

| | | | |
|---|---|---|---|
| 27. | పురందర మల్లిక్ | నిలుంగియ | 14 సెప్టెంబర్ |
| 28. | ప్రఫుల్ల ప్రధాన్ | బరాఖమ | 26 ఆగస్ట్ |
| 29. | అజుబాకుమార్ డిగాల్ | బరాఖమ | 26 ఆగస్ట్ |
| 30. | గయాధర్ డిగాల్ | సలపసాహి | 26 ఆగస్ట్ |
| 31. | దుశ్శాసన్ మాఝి | సింధిపన్‌ఖల్ | 2 అక్టోబర్ |
| 32. | సన్యాసి మాఝి | కందామి | 2 అక్టోబర్ |
| 33. | నిరుపమ | కంజమెండి | -- |
| 34. | రాజేశ్ డిగాల్ | బటగుడ | 26 ఆగస్ట్ |
| 35. | బన్సీధర్ నాయక్ | -- | -- |
| 36. | నాధూరాం నాయక్ | దకేడి | -- |
| 37. | పేస్కర్ మల్లిక్ | దకేడి | -- |
| 38. | రాంసేన్ నాయక్ | గదాబిస | -- |
| 39. | శిశిదేవ్ డిగాల్ | దకేడి | -- |
| 40. | బిధుబేంద్ర బిస్వాల్ | పదంపు | 15 సెప్టెంబర్ |
| 41. | బిద్యాధర్ డిగాల్ | కట్టాఘర్ | 15 సెప్టెంబర్ |
| 42. | రజని మాఝి | కాంటాపాలి | -- |
| 43. | ఆంథే డిగాల్ | తేలపాలి | -- |
| 44. | బిద్యాధర్ డిగాల్ | దిమిరిగుడ | -- |
| 45. | సదానంద ప్రధాన్ | తేలపాలి | -- |
| 46. | కుముద్ బర్దన్ | ముకుందపూర్ | -- |
| 47. | బక్షీశ్ సింగ్ | సిసాపంగా | 25 సెప్టెంబర్ |
| 48. | బనదేవ్ ప్రధాన్ | పాజిమహా | 23 సెప్టెంబర్ |
| 49. | బస్తిన మంత్రి | భైలియపడ | 26 ఆగస్ట్ |
| 50. | డానియల్ మల్లిక్ | బకింగియా | -- |
| 51. | గుండూరి నాయక్ | బుడమహ | 27 ఆగస్ట్ |
| 52. | జాకబ్ డిగాల్ | పెటాపంగ | -- |
| 53. | జకానాయక్ | బుడమహ | -- |
| 54. | కమలిని నాయక్ | మందాకియ | -- |
| 55. | కాశిపాత్ర డిగాల్ | తటామహ | 13 సెప్టెంబర్ |
| 56. | కృష్ణ ప్రధాన్ | పంగనాజు | 8 నవంబర్ |
| 57. | మైకెల్ నాయక్ | బకింగియా | -- |
| 58. | నబఘనసాయక్ | బకింగియా | 26 ఆగస్ట్ |

| | | | |
|---|---|---|---|
| 59. | రమేశ్ డిగాల్ | బకింగియా | -- |
| 60. | సువానాయక్ | బుడ్రింగియా | 13 సెప్టెంబర్ |
| 61. | సునపులనాయక్ | బుడ్రింగియా | 12 సెప్టెంబర్ |
| 62. | బిసింగరైత | కమల్‌డిహ | -- |
| 63. | బిరూపాఖ్య మాఝి | పతంగి | -- |
| 64. | ఈశ్వర్ డిగాల్ | మల్లికపడి | 20 సెప్టెంబర్ |
| 65. | శబినాయక్ | బ్రేకా | 25 ఆగస్ట్ |
| 66. | సిద్దేశ్వర్ డిగాల్ | సులాసేరు | -- |
| 67. | బలియామాలిక్ | తెంగంపాడు | 13 సెప్టెంబర్ |
| 68. | బిసేంద్రమాలిక్ | బనమిలా | 13 సెప్టెంబర్ |
| 69. | మేధామాఝి | బినింగియా | 13 సెప్టెంబర్ |
| 70. | శరత్‌దేవ్ | కుర్తంగఢ్ | -- |
| 71. | గులిక మాలిక్ | లుండుగుడ | -- |
| 72. | ప్రియతమ డిగాల్ | -- | -- |
| 73. | శ్రీమతి నాయక్ | జంజాగుడ | -- |
| 74. | సురేశన్ నాయక్ | -- | -- |
| 75. | జుబ్రాజ్ డిగాల్ | నూగాం | 16 డిసెంబర్ |

(చనిపోయినప్పుడు ప్రత్యక్ష సాక్షులెవరూ లేక, ఆ తరువాత శవం దొరికిన సందర్భాలలో చనిపోయిన తేదీ తెలీదు. అయితే ముగ్గురి విషయంలో పేరు తెలిసినా ఊరు తెలీదు. ఊరెందుకు తెలీదో వివరణ లేదు)

**దాడులలో ధ్వంసమైన ఆవాసాల సంఖ్య**

| నెం. | బ్లాక్ | ఆవాసాల సంఖ్య | నెం. | బ్లాక్ | ఆవాసాల సంఖ |
|---|---|---|---|---|---|
| 1. | బాలిగుడ | 610 | 8. | కొట్టాఘర్ | 142 |
| 2. | చకాపద | 87 | 9. | ఫిరింగియ | 282 |
| 3. | దరింగబాడి | 148 | 10. | రైకియా | 1151 |
| 4. | ఫూల్‌బని | 36 | 11. | టికాబలి | 940 |
| 5. | జి. ఉదయగిరి | 822 | 12. | తుముడిబంద | 132 |
| 6. | ఖజూరిపద | 2 | | మొత్తం | 5031 |
| 7. | కె.నువాగాం | 679 | | | |

ఆర్చిబిషప్ రాఫెల్ చీనత్ సుప్రీంకోర్టుకు ఇచ్చిన జాబితా

చర్చిలు, ఇతర క్రైస్తవ సంస్థల) విధ్వంసం లెక్కకూడ ఆర్చ్‌బిషప్ నిర్దిష్టంగా ఇచ్చారు. బ్లాక్‌వారీగా ఇచ్చిన ఈ గణాంకాల ప్రకారం మొత్తం 5031 నిర్మాణాలు ధ్వంసం అయ్యాయి. ఎక్కువ భాగం లూటీ చేసి తగలబెట్టారు. కొన్నిటిని సంపూర్ణంగా కూలగొట్టారు. అందులో 250 చర్చిలు. ప్రభుత్వం మాత్రం 3776 ఇళ్లు, 195 చర్చిలు ధ్వంసం అయ్యాయంటోంది.

హింసాకాండ గురించి మొదట్లో బాధితులు ఫిర్యాదు ఇచ్చినా పోలీసులు పట్టించుకోలేదు. చాలామంది దాడి జరగగానే అడవులలోకి, అక్కడినుండి శిబిరాలలోకి పారిపోయారు కాబట్టి అందరూ ఫిర్యాదులు వెంటనే ఇవ్వలేదు. కొందరు శిబిరాలలోకి చేరిన తర్వాత ఇచ్చారు. తాము గుర్తించినవారి పేర్లు ఫిర్యాదులలో చేర్చారు. మొత్తం 784 ఫిర్యాదులు నేరాలుగా నమోదయ్యాయనీ అందులో పేరు పెట్టిన ముద్దాయిల సంఖ్య 11,348 అనీ 'గుర్తు తెలియనివారు' అందుకు 8 రెట్లనీ పోలీసుల గణాంకాలు తెలుపుతాయి. ఈ సంవత్సరం ఏప్రిల్ నాటికి అందులో 633 మందిని అరెస్టు చేసినట్టు ఒరిస్సా ప్రభుత్వం తెలిపింది. తక్కిన వాళ్లనెందుకు అరెస్టు చేయలేదో చెప్పలేదు. గ్రామాలనుండి నిర్వాసితులయిన వారి సంఖ్య 50 వేలు అన్న క్రైస్తవ సంస్థల అంచనాను పైన ప్రస్తావించాము. అది వాస్తవికమైనదేనని అన్నాము కూడ. కంధమల్ జిల్లాలో క్రైస్తవుల జనాభా 1,17,000. అంటే శరణార్థులు మొత్తం జనాభాలో దాదాపు 43 శాతం అని అర్థం. కంధమల్ హింసాకాండ యావత్తూ లక్ష్మణానంద సరస్వతి హత్య అతని అనుయాయులలో కలిగించిన 'ధర్మ ఆగ్రహం' ఫలితమేనన్న సంఘ్‌పరివార్ దబాయింపును ఈ గణాంకాలతో పోల్చి చూడాలి. ఒక వ్యక్తి హత్యకు జవాబుగా ఒక సామాజిక వర్గానికి చెందిన 75 మందిని చంపి ఆ వర్గం జనాభాలో 43 శాతాన్ని గ్రామాల నుండి బలప్రయోగంతో తరిమేసి 250 ప్రార్థనా స్థలాలతో సహా 500కు పైగా నిర్మాణాలనూ కట్టడాలనూ బుగ్గిచేయడం దానంతటది పెల్లుబికిన ప్రతీకారం కాజాలదు. అది ఒక పథకం ప్రకారం, ప్రణాళిక ప్రకారం జరిగిన మూకుమ్మడి హింసాకాండ తప్ప వేరే ఏమీ అయిఉండే అవకాశం లేదు.

## ప్రభుత్వం ఏం చేస్తున్నది?

ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వ వైఖరి గురించి ఇప్పటికే కొంత చెప్పాము. ఆగస్ట్ 25 నుండి కంధమల్ జిల్లా అంతటా 144 సెక్షన్ ప్రకటించినప్పటికీ లక్ష్మణానంద అంతిమయాత్ర పేరిట సుదీర్ఘమైన మృతదేహ ప్రదర్శనను అనుమతించడం, 2007 డిసెంబర్ నాటి అనుభవం ఉన్నప్పటికీ క్రైస్తవులకు భద్రత కల్పించడానికి ఏ ప్రయత్నం చేయకపోవడం, కనీసం స్థానిక పోలీసు యంత్రాంగానికి కచ్చితమైన ఆదేశాలు ఇవ్వకపోవడం, శరణార్థులు తిరిగి గ్రామాలకు పోయి స్వేచ్ఛగా బతికే పరిస్థితి కల్పించడానికి ఏ కృషీ చేయకపోగా, వీలయినంత త్వరగా శిబిరాలు మూసేసి చేతులు దులిపేసుకోవాలని చూడడం ఇవన్నీ ఇప్పటికే ప్రస్తావనకు వచ్చాయి.

వాస్తవం ఏమిటంటే ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వంలో భారతీయ జనతాపార్టీ భాగస్వామి. హింసా కాండకు పాల్పడింది వారి సోదర సంస్థ అయిన బజరంగ్‌దళ్. ఆగస్ట్ 25న లక్ష్మణానంద హత్యకు నిరసనగా సంఘ్‌పరివార్ సంస్థలు బంద్ పిలుపు ఇచ్చి మరీ దాడులకు పాల్పడ్డాయి. ఆ బంద్‌ను భారతీయ జనతాపార్టీ సమర్థించడంతో కానీ ప్రధాన పాలకపక్షమైన బిజు జనతాదళ్ తన

# మీడియాపాత్ర : సంఘ్‌పరివార్ రెండవగొంతు

ఒరిస్సా దమనకాండ విషయంలో స్థానిక మీడియా పాత్ర గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత గౌరవంగా ఉంటుంది. ప్రధాన ఒరియా దినపత్రికలయిన సమాజ్, సంబాద్, ధరిత్రిలు క్రైస్తవులపైన అమలయిన హింసకు చాలా తక్కువ ప్రచారం ఇచ్చాయి. హింసను సమర్థించడానికి సంఘ్‌పరివార్ చూపిన సాకులకు ఎక్కువ ప్రచారం ఇచ్చాయి. మావోయిస్టులు లక్ష్మణానందను తామే చంపామని చెప్పుకున్నప్పటికీ క్రైస్తవులే చంపారంటున్న సంఘ్‌పరివార్ వైఖరికి అనుకూలమయిన వ్యాఖ్యలు చేసాయి. శరణార్థుల శిబిరాలలోని అమానుష పరిస్థితుల గురించి దాదాపు రాయనేలేదు.

ఒరియా భాషలో అత్యధింగా అమ్ముడుపోయే దినపత్రిక అయిన సమాజ్, ఒకవేళ లక్ష్మణానందను మావోయిస్టులే చంపి ఉన్నా కూడ క్రైస్తవ మిషనరీలే వారికి డబ్బులిచ్చి చంపించి ఉంటారని వ్యాఖ్యానించింది. 'అందులో ఆశ్చర్యమేముంది? మత మార్పిడికోసం వాళ్లు డబ్బుల మూటలు వెదజల్లడం లేదా?' అనింది. క్రైస్తవులను బలవంతంగా హిందువులుగా మార్చే ప్రక్రియకు లక్ష్మణానంద సరస్వతి పెట్టిన ఘర్‌వాపసి (పునరాగమనం) అనే అబద్ధపు పేరును మీడియా స్వంతం చేసుకొని ప్రచారం చేయడం ద్వారా దానికి విశ్వసనీయత కల్పించింది.

పూరిశంకరాచార్యులు, ప్రవీణ్‌తొగాడియా, అశోక్ సింఘాల్, ఇతర విశ్వహిందూపరిషత్ నేతలు క్రైస్తవులపైన నిందలు వేస్తూ చేసిన ప్రకటనలను ఈ పత్రికలు మొదటి పేజీలో ప్రచురించాయి. దాడులకు గురయిన బాధితులు రోజులతరబడి అడవులలో నడిచి భువనేశ్వర్‌కు వచ్చి రాష్ట్ర రాజధానిలోని విలేకరులకు చెప్పుకున్నాకనే వారిపైన జరిగిన హింసాకాండ కనీసం కొన్ని పేపర్లకయినా వార్త అయింది. సిస్టర్ మీనాలలితపైన జరిగిన లైంగిక అత్యాచారం గురించి 'ది హిందూ' దినపత్రిక విలేకరి బయటినుండి వచ్చి రాసేదాకా ఒరిస్సాలో ఎవరికీ తెలియలేదంటే మీడియా వైఖరేమిటో, పాత్ర ఏమిటో అర్థం అవుతుంది. వెరసి ఒరియా పత్రికలు ప్రచారం చేసిన వ్యాఖ్య ఏమిటంటే

1. లక్ష్మణానందను చంపింది క్రైస్తవ మిషనరీలే తప్ప మావోయిస్టులు కాదు.
2. మూలకారణం మత మార్పిడియే
3. లక్ష్మణానంద ఆదివాసులకు దేవుడు
4. ఆదివాసులు హిందువులే, మత మార్పిడి అధర్మం
5. పాణోలు బయటివారు, వారు కంధాల భూములు ఆక్రమించుకున్నారు.
6. క్రైస్తవులు - అంటే మతం మార్చుకున్న పాణోలు - చట్టం ఆదివాసులకిచ్చిన సదుపాయాలను మోసపూరితంగా గుంజుకున్నారు.
7. మత మార్పిడులవల్ల హిందువులు కంధమల్ జిల్లాలో మైనారిటీ అయిపోతున్నారు.
8. జరిగిన ఘటనలను క్రైస్తవులు ఎక్కువచేసి ప్రచారం చేయడం ద్వారా ఒరిస్సా రాష్ట్రానికి అమెరికాలో, ఇంగ్లండ్‌లో చెడ్డపేరు తెస్తున్నారు.
9. పునరాగమనం లేక ఘర్‌వాపసీ అత్యవసరమయిన కార్యక్రమం.

మిత్రపక్షాన్ని కాదని నిర్ణయాలు తీసుకోవడానికి ఇష్టపడలేదు. అంతేకాక సంఘ్ పరివార్ భావజాలం ప్రభావం ఒరిస్సా సమాజంపైన బలంగా ఉండడం వల్ల కూడ అధికార యంత్రాంగంలో కదలిక లోపించింది.

పోలీసుల వైఖరి గురించి చెప్పాము. శిబిరాల నిర్వహణ బాధ్యతగల ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది వైఖరి కూడ అంతకంటే భిన్నంగా లేదు. హిందుత్వవాద సంస్థల కార్యకర్తలు శిబిరాలలోకి స్వేచ్ఛగా వస్తూ పోతూ, శిబిరాలలో తలదాచుకున్న క్రైస్తవులను మళ్లీ బెదిరింపులకూ భయానికీ గురిచేసారు. ఆ భయానికి రెండవసారి పారిపోయినవారు చాలామంది ఉన్నారు. కనీసం శిబిరాలలో పారిశుద్ధ్యం పాటించారా, కడుపునిండా తిండిపెట్టారా అంటే లేదు. పక్కా ప్రభుత్వ భవనాలలో శిబిరాలు ఏర్పాటుచేస్తే బజరంగ్‌దళ్, దుర్గావాహిని లాంటి సంస్థలు జనాన్ని పోగుచేసి అల్లరి చేస్తారని భయపడ్డారు. ఇల్లు, ఊరు విడిచిపెట్టి బలవంతంగా విస్థాపితులయిన వారిపట్ల ప్రభుత్వానికి ఉండే బాధ్యతను వివరించి వారికి నచ్చజెప్పడమో లేక వారి అభ్యంతరాలను ఖాతరు చేయకుండ తమ విధి తాము నిర్వర్తించడమో ప్రభుత్వం చేయవలసింది. దాని బదులు వారి అభ్యంతరాలను మన్నించి శిబిరాలను అధ్వాన్నమయిన స్థితిలో ఉంచారు. వర్షంనీరు నిలిచిన నేలలలోనే గుడారాలు, అందులో శరణార్థులు, పక్కనే వారికోసం వంటలు, అక్కడే తిరుగుతున్న పందులు; అత్యంత బాధాకరమయిన ఈ దృశ్యాలు శిబిరాలు ఉన్నన్నాళ్లూ దర్శనమిచ్చాయి.

సుప్రీంకోర్టులో క్రైస్తవ సంస్థలు వేసిన కేసుకు జవాబుగా మాత్రం ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వం నేర పరిశోధన గురించి, కేసుల విచారణ గురించి, శరణార్థుల స్థితిగతుల గురించి అనర్గళంగా అబద్ధాలు చెప్పింది. అందువల్ల సుప్రీంకోర్టు ఒరిస్సా ప్రభుత్వాన్ని చీవాట్లు పెట్టినప్పటికీ ఏదో చేస్తున్నారు లెమ్మని నమ్మి ఆచరణాత్మకమైన ఆదేశాలు ఏవీ జారీ చేయలేదు. తనపైన జరిగిన అత్యాచారం కేసు పరిశోధన సిబిఐకి అప్పగించాలన్న సిస్టర్ మీరా లలిత అభ్యర్థనను సహితం రాష్ట్ర ప్రభుత్వంపైన విశ్వాసంతో సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

ఇంతగా సంఘ్‌పరివార్‌కు అనుకూలంగా వ్యవహరించిన బిజు జనతాదళ్, మళ్లీ పార్లమెంటుకు ఎన్నికలొచ్చేసరికి బిజెపికి దూరమయి వామపక్షాలతో చేరి 'సెక్యులర్' ముద్ర వేసుకుంది.

## ఇప్పుడు మంచితనం గురించి..

ఘోరమయిన ఈ నివేదిక ముగించే ముందు, అన్యాయమైన ఒత్తిడికి తల ఒగ్గకుండ నిలబడి పాణోల ప్రాణాలను కాపాడిన కంధాల గురించి చెప్పుకోవాలి. మతాన్ని, జాతిని ప్రాతిపదిక చేసుకొని జరిగే ఏ హింసాకాండలోనయినా గుంపులో భాగం కాకుండ మానవత్వాన్ని నిలబెట్టిన వారి గురించి, అటువంటి ఉదంతాల గురించి చెప్పుకోవడం అవసరం. లేకపోతే భవిష్యత్తు గురించి ఆశపెట్టుకోవడానికి ప్రాతిపదిక ఏదీ మిగలదు. కంధమల్‌లో అటువంటి వారు చాలామందే ఉన్నారు.

బాలిగుడ సమీపంలోని బుద్రుకియా గ్రామపంచాయితీలో దమీకియా అనే ఊరు ఉంది. ఆ పంచాయితీ సర్పంచ్ లూర్దుమాలిక్‌ది ఆ ఊరు. ఆమె పేరును బట్టి క్రైస్తవ మతస్తురాలు అయి

ఉండవచ్చునుగానీ ఆమె భర్త దండపాణి మల్లిక్ క్రైస్తవుడు కాదు. వాళ్లు కంధాలు. ఆ గ్రామంలోనూ పరిసర గ్రామాలలోనూ మతపరమైన దాడులు నివారించే బాధ్యత దండపాణి తనమీద వేసుకున్నాడు. 2007 డిసెంబర్ అల్లర్లప్పుడు బాలిగుడలో కుయి సమాజ్ సమన్వయ సమితి పిలుపు మేరకు నడుస్తున్న ఆందోళనలో భాగంగా డిసెంబర్ 27, 28 తేదీలలో బాలిగుడలో ఊరేగింపు జరిగింది. ఈ ఆందోళన డిమాండ్ల గురించి అది క్రైస్తవ పాణోలపైన దాడి రూపం తీసుకున్న వైనం గురించి పైన చెప్పాము. ఇక్కడ కూడ ఆ ప్రదర్శనలో పాల్గొన్నవారు బాలిగుడలోనేకాక పరిసర గ్రామాలలోనూ క్రైస్తవ నివాసాలపైన దాడి చేసారు. (కంధాల ప్రదర్శనలోకి ఆర్ఎస్ఎస్ వారు చొరబడి దాడులకు పాల్పడ్డారు అనేది దండపాణి వ్యాఖ్య). అప్పుడు దండపాణి దమీకియా, సిపంజరి, ముస్కుల్, బిరాగుడ గ్రామాలలోని కంధాలను, పాణోలను ఐక్యంచేసి ఆ గ్రామాలలో స్థానికులుగానీ బయటివారుగానీ హింసకు పాల్పడకుండ నిరోధించడానికి ఒక కమిటీ ఏర్పాటు చేసాడు. 2008 ఆగస్ట్ నెలలో ఆ కమిటీ అక్కరకు వచ్చింది. ఆగస్ట్ 27-28 తేదీలలో బజరంగ్‌దళ్ గుంపులు ప్రదర్శనగా ఒక ఊరునుండి ఒక ఊరికి పోతూ క్రైస్తవులపైన దాడులకు పాల్పడుతున్నప్పుడు ఈ నాలుగు ఊర్లకు రావద్దని ఆ కమిటీ నిలువరించగలిగింది. ఈ నాలుగు గ్రామాలలోనయినా మత హింసాకాండను ఆపగలిగినందుకు మేము అతనిని అభినందించగా, దండపాణి మల్లిక్ నవ్వుతూ 'మావాళ్లే ఇప్పుడు నన్ను శత్రువుగా చూస్తున్నారు' అన్నాడు. అందరినీ అడిగినట్టే అతనిని కూడ మేము 'ఆదివాసులు తమను తాము హిందువులుగా పిలుచుకోవడం ఎప్పుడు మొదలయింది?' అని అడిగాము. కొందరు కాలక్రమంలో ఆదివాసుల హైందవీకరణ జరిగిందని అనగా, కొందరు లక్ష్మణానంద సరస్వతి ప్రచారంతోనే మొదలయిందని అన్నారు. దండపాణి మాత్రం 'క్రైస్తవం పుచ్చుకున్న ఆదివాసులు తమను తాము ఆదివాసీ క్రైస్తవులుగా పిలుచుకోవడం మొదలుపెట్టిన తరువాత మిగిలిన వాళ్లు తమను తాము ఆదివాసీ హిందువులని చెప్పుకోవడం మొదలయింది' అంటాడు.

'క్రైస్తవం పుచ్చుకున్న ఆదివాసులు తమను తాము ఆదివాసీ క్రైస్తవులుగా పిలుచుకోవడం మొదలుపెట్టిన తరువాత మిగిలిన వాళ్లు తమను తాము ఆదివాసీ హిందువులని చెప్పుకోవడం మొదలయింది'

కంధమల్ నారీజాగరణ్‌మంచ్ అధ్యక్షురాలు కేశోమతి ప్రధాన్ గురించి పైన చెప్పాము. ఆమె కంధా తెగకు చెందిన ఆదివాసీ. ఆమెది రైకియా బ్లాక్‌లోని సుకుద్‌బాడి పంచాయితీ పరిధిలో ఉన్న కజూరి గ్రామం అని చెప్పాము. 2007 డిసెంబర్ దాడులప్పుడు ఆమె బారఖమ గ్రామంలో తన బంధువుల దగ్గర ఉండగా 25 డిసెంబర్‌న ఆ ఊరిపైన దాడి జరిగింది. ఆ దాడిలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న కంధాలకు 'ఒరియాలు' (సవర్ణ హిందువులు) నాయకత్వం వహించడం గమనించింది. కంధాలకు వారు నుదుటిమీద తిలకం దిద్ది బజరంగ్ దళ్ చిహ్నం అయిన ఎర్రగుడ్డ తలకు చుట్టడం చూసింది. ఆ దాడిలో పాల్గొనవద్దని ఆమె తనతోటి కంధాలకు నచ్చచెప్పింది. 'అది మనకు మంచిది కాదు' అని వారిని ఆపే ప్రయత్నం చేసింది. కాని ఆ రోజున దాడి ఆపలేకపోయింది గానీ ఆ ఊరిలో మళ్లీ దాడి

జరగకుండ మాత్రం నిరోధించగలిగానని చెప్పింది. 2008 ఆగస్ట్ నెలలో దాడులు జరుగుతున్నపుడు తన స్వంత ఊరయిన కజూరిలో ఆమె ప్రయత్నం ఫలవంతం అయింది. బజరంగ్‌దళ్ ఆ ఊరి మీదికి ఒక గుంపును తీసుకురాగా ఆమె అడ్డుపడింది. ఆమె మత మార్పిడుల్ని సమర్థిస్తున్నదనీ, పాణోలను ప్రోత్సహిస్తున్నదనీ, మావోయిస్టులకు డబ్బులిచ్చి లక్ష్మణానందను చంపించిందనీ బజరంగ్‌దళ్ నాయకులు నోటికొచ్చిన నిందలు వేసినా ఆమె వెనక్కి తగ్గలేదు. చంపుతామని బెదిరిస్తే 'నేను మంచి చేస్తున్నాను, చంపినా చేస్తాను' అనింది. ఆ ఊరిలోని ఏడు క్రైస్తవ కుటుంబాలను ఊరు విడిచిపెట్టి పోవద్దని నచ్చజెప్పి ఆపింది. ఊరు విడిచిపెట్టిపోతే మీ భూములు వేరేవాళ్లు ఆక్రమించుకుంటారని హితవు చెప్పింది. ఆ ఊరిలోని కంధాలెవరూ బజరంగ్‌దళ్‌తో చేతులు కలపకుండ ఆపగలిగింది.

జి.ఉదయగిరి బ్లాక్‌లోని తియాంగియాలో క్రైస్తవులపైన దాడి చేయడానికొచ్చిన బజరంగ్‌దళ్ గుంపుకు దశరథ్‌ప్రధాన్, జగన్నాథ్‌ప్రధాన్ అనే కంధాలు అడ్డుపడ్డారు. దుండగులు దశరథ్ ప్రధాన్‌ను నరికి చంపారు, జగన్నాథ్ ప్రధాన్ ఇల్లు కూల్చారు. రైకియాలో ప్రభుత్వ ఉద్యోగి అయిన సారంగధర్ ప్రధాన్ క్రైస్తవులపైన ఘోరమైన హత్యాకాండ జరుగుతున్న సమయంలోనే రెండు మూడు క్రైస్తవ కుటుంబాలకు తన యింట్లో ఆశ్రయం ఇచ్చాడు. దాడిచేస్తున్న గుంపు అతని ఇంటిమీదికి రాగా, వాళ్లను చంపదలచుకుంటే ముందు నన్ను చంపండి అన్నాడు. అతన్ని చంపడం ఇష్టంలేక కాబోలు రెండు చేతులపైనా కత్తులతో కొట్టి గాయపరిచి వెళ్లిపోయారు.

రాష్ట్ర రహదారి మీద ఉన్న బాంజ్‌నగర్‌లో ఒక పేరు తెలియని బ్రాహ్మణుడి గురించి శిబిరాలలోని క్రైస్తవులు చెప్పారు. ఒక తెల్లవారి ఇంటిముందు తలుపు తెరిచిన ఆ వ్యక్తికి ఆవరణనిండా ఆకలిగొన్న క్రైస్తవులు కనిపించారు. జి. ఉదయగిరి బ్లాక్ గ్రామాలనుండి బరంపురానికో భువనేశ్వర్‌కో పారిపోతూ అక్కడ రాత్రి ఆగినట్టున్నారు. అతను వాళ్లందరికీ ఒళ్లు కడుక్కోవడానికి నీళ్లిచ్చి అన్నంపెట్టి పంపించాడు.

# కర్నాటక

# దాడులు



# కర్నాటక : నేపథ్యం

**కర్నాటక** ఒరిస్సా దాడుల మధ్యనున్న ఒక వికృతమైన సంబంధం గురించి మొదట చెప్పాము. ఒరిస్సాలో క్రైస్తవులపైన బజరంగ్‌దళ్ చేసిన దాడులకు నిరసనగా క్రైస్తవ విద్యాసంస్థలు 2008 ఆగస్ట్ 29నాడు బంద్ పాటించాయి. జాతీయ చర్చిల సంఘం (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్), భారత కాథలిక్ బిషప్‌ల సమావేశం (కాథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఇండియా) ఇచ్చిన పిలుపు మేరకు ఈ బంద్ పాటించారు. బహుశా దేశమంతటా పాటించి ఉంటారు. అయితే కర్నాటకలోని భారతీయ జనతాపార్టీకి చెందిన యెడ్యూరప్ప ప్రభుత్వం ఈ నిరసన కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకుంది. ప్రభుత్వం అనుమతి లేకుండ ఒకరోజు విద్యాసంస్థలు ఎట్లా మూసేసారో క్రైస్తవ విద్యాసంస్థలనుండి సంజాయిషీ కోరమని ప్రాథమిక, మాధ్యమిక విద్యాశాఖమంత్రి తన శాఖ అధికారులను పురమాయించాడు. తదుపరి వివిధ జిల్లాలలో విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ జారీ చేసిన సంజాయిషీ తాఖీదులలో బజరంగ్‌దళ్ చేసిన ఫిర్యాదును ఉటంకిస్తూ క్రైస్తవ సంస్థల నుండి వివరణ కోరడం జరిగింది! తరువాతి రోజులలో బజరంగ్‌దళ్ తదితర సంఘ్‌పరివార్ సంస్థలు చేసిన దాడుల పరంపరకు ఈ ప్రహసనమే నాంది అని మాతో మాట్లాడిన క్రైస్తవులు చాలామంది చెప్పారు. ప్రాణనష్టం, బలవంతపు విస్థాపన ఒరిస్సాలో ఉన్నంత కర్నాటకలో లేవు, హింసాకాండ అక్కడికంటే తొందరగానే అదుపులోకి వచ్చింది. అయితే నైసర్గికంగా మరింత విశాల ప్రాంతంలో జరిగింది. ఆ తేడాలెలా ఉన్నా భారత సామాజిక రాజకీయ జీవితంపైన హిందుత్వవాదులు పైచేయి నెలకొల్పడానికి జరుపుతున్న యత్నాలలో కర్నాటక ఘటనలకు కూడా అంతే ప్రాముఖ్యం ఉంది.

అయితే ఒరిస్సా ఘటనలకొక నేపథ్యం ఉన్నట్లే కర్నాటక సంఘటనలకూ ఉంది. హిందుత్వవాదులు తమ ఆధిపత్య సాధనకు ఒరిస్సాలో అనుసరించినది ఒక మార్గమయితే కర్నాటకది ఇంకొక మార్గం. గడచిన కొద్ది సంవత్సరాలలో ఆర్‌ఎస్‌ఎస్ కర్నాటక సమాజంపైన తన పట్టును బాగా విస్తృతంగా పెంచుకుంది. ఎప్పుడవకాశం దొరికినా ముస్లింలతో (ఇప్పుడు క్రైస్తవులతో) కొట్లాటకు వారి అనుయాయులు కాలుదువ్వుతున్నారు. 1970 ల చివరి భాగం నుండి

మతపరమైన ఘర్షణలు తరచుగా జరగడం మొదలయింది. 2004 నాటికి 80 పెద్ద ఘర్షణలు జరిగినట్టు పరిశీలకులు చెప్పారు. 1992లో బాబ్రీమసీదును కూల్చివేసినప్పుడు ముస్లింలలో తలెత్తిన నిరసన నేపథ్యంలో బెంగుళూరు, మైసూరు, గుల్బర్గా, బీదర్, హుబ్లి-ధార్వార్, దక్షిణ కన్నడ జిల్లాల్లో నెలరోజులపాటు మతఘర్షణలు చెలరేగి 78 మంది చనిపోయారు. అందులో 40 శాతం పోలీసు కాల్పులలో చనిపోగా తక్కినవారు హత్యకు గురయ్యారు.

ఇటువంటి మత ఘర్షణలలో తప్పెప్పుడూ ఒకరిదే అయి ఉంటుందని అనలేం. ఒక ఘటన తీసుకొని అది ఎక్కడ మొదలయింది, దానికి బాధ్యులెవరు అని లెక్కించినట్టయితే తప్పు ఇరుపక్షాలలో ఎవరిదయినా అయి ఉండవచ్చు. అయితే ఘర్షణను దొమ్మీగా లేక దాడిగా మార్చేది ముందుగా ఉన్న సంసిద్ధత, దానికోసం తయారుచేసుకున్న నిర్మాణం. అది సంఘ్‌పరివార్ వద్ద పుష్కలంగా ఉంది. కొన్ని సందర్భాలలో అవకాశం తీసుకోవడానికి ఒక ఘటనకూడ ఉండకపోవచ్చు. ఉద్దేశ్యపూర్వకంగానే దొమ్మీ లేక దాడి మొదలుపెట్టవచ్చు. సంఘ్‌పరివార్ రాజకీయ ముఖమయిన భారతీయ జనతాపార్టీ కర్నాటకలో రాజకీయ ప్రాముఖ్యానికి, తరువాత సగం అధికారానికి, ఆపైన యెడ్యూరప్ప నాయకత్వంలో పూర్తి అధికారానికి ఎగబాకిన క్రమంలో ఇటువంటి ఏకపక్షమైన దాడులు లేక కల్పించిన దొమ్మీల సంఖ్య పెరిగింది. అయితే మత ఘర్షణలు మైనారిటీలను భయపెట్టడానికీ తమ కార్యకర్తలకు ఉత్సాహం ఇవ్వడానికి పనికొస్తాయే తప్ప, విశాల హిందూ సమాజాన్ని సంఘ్‌పరివార్ లక్ష్యాల సాధనకోసం వారి వెంట సమీకరించడానికి పనిచేయవు. దానికి స్థానిక పరిధిని దాటిపోయే ఉద్వేగపూరితమైన చిహ్నాలు అవసరం.

బిజెపి కర్నాటకలో రాజకీయ ప్రాముఖ్యానికి, తరువాత సగం అధికారానికి, ఆపైన యెడ్యూరప్ప నాయకత్వంలో పూర్తి అధికారానికి ఎగబాకిన క్రమంలో ఇటువంటి ఏకపక్షమైన దాడులు లేక కల్పించిన దొమ్మీల సంఖ్య పెరిగింది.

ఇందుకోసం హుబ్లీలోని ఈద్గా మైదానాన్ని హిందుత్వవాదులు కొంతకాలం వాడుకున్నారు గానీ అది ఒక పరిమితిని మించి పనికి రాదు. 1992 నుండి 1995దాకా (మళ్లీ 2001లో ఒకసారి) ప్రతీ సంవత్సరం ఆ మైదానంలో జాతీయ జెండా ఎగురవేసే ప్రయత్నం చేసారు. ఆ మైదానం ఎవరికి చెందినది అన్న సివిల్ వివాదం కోర్టులో నలుగుతూ ఉండింది. కేవలం మతపరమయిన అవసరాలకు వినియోగించుకునే నిమిత్తం తాము ఆ మైదానం పైన లీజు పొందామని అంజుమన్-ఇ-ఇస్లాం అనే ముస్లిం సంస్థ అనింది. వారు కింది కోర్టులలో ఓడిపోయి సుప్రీంకోర్టులో అప్పీల్ వేయగా, సుప్రీంకోర్టు విచారణ పూర్తయ్యేదాకా ఆ మైదానంలోకి ఎవరూ ప్రవేశించవద్దని స్టే ఇచ్చింది. అందువల్ల పదేపదే అక్కడ జాతీయ జండా ఎగరవేయడం హిందుత్వవాదులకు కష్టమయింది. పోలీసులు వాళ్లకు ఇప్పుడున్నంత అనుకూలంగా ఆ రోజులలో లేరు కూడ. పైగా ఈద్గా మైదానంలో మువ్వన్నెల జెండా ఎగరేయాలని ఒత్తిడి చేసే నైతిక అర్హత సంఘ్‌పరివార్‌కు ఉందని దబాయించడం కష్టం. ఎందుకంటే వాళ్ల కార్యాలయాలపైనగానీ కార్యక్రమాలలోగానీ ఆ జెండా వాళ్లెప్పుడూ ఎగరేయరు. దానిలోని

శాంతి, సహజీవనాల సంకేతం వారి భావజాలానికి తగదు. అందువల్ల జాతీయజెండా వారి ప్రయోజనాలకు ఒక పరిమితి దాటి ఉపయోగపడదు.

అయితే రామజన్మభూమి నమూనాలో వాళ్లు వేరొక వివాదం కర్నాటకలో లేవదీసి ఇంకొంచెం ఫలవంతంగా వాడుకోగలిగారు. 'రెండవ అయోధ్య' లేక 'దక్షిణ అయోధ్య' అన్న నినాదం పుట్టించి దానిచుట్టూ కర్నాటకలో ఒక బలమైన 'హిందూ' గుర్తింపును రూపొందించగలిగారు. ఆ నినాదాన్ని తమ కార్యకలాపాలకు కేంద్రం చేసుకున్నారు. అది ముస్లింలమీద ఎక్కుపెట్టిన నినాదం అయినప్పటికీ, హిందువుల సామాజిక చింతనను ఆకట్టుకున్నట్టయితే క్రైస్తవులపైన ద్వేషం రెచ్చగొట్టడానికీ ఉపయోగపడగలదు, సంఘ్‌పరివార్ నిర్వచించే హైందవ జాతికి శత్రువులయిన వారెవరిమీదనయినా వ్యతిరేకత రెచ్చగొట్టడానికీ ఉపయోగపడగలదు. వారు చేసిన, చేస్తున్న ఈ ప్రయత్నాన్ని గురించి, దానిని ఎదుర్కొనడానికి కర్నాటక కౌముసౌహార్ద వేదికె (కర్నాటక మతసామరస్య వేదిక) చేసిన ప్రయత్నాన్ని గురించి తెలుసుకోవడం నిరుడు జరిగిన హింసాకాండను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. నిజానికి, సంఘ్‌పరివార్‌కు వ్యతిరేకంగా జరగగల సమర్థవంతమైన ప్రజాసమీకరణకు ఈ వేదిక కార్యకలాపాలు ఒక మంచి దృష్టాంతం. అది ఇతర ప్రాంతాలకు మార్గదర్శకంగా ఉండగలదు కాబట్టి వారి కృషిని గురించి తెలుసుకోవడం మంచిది.



బాబా బుడన్‌గిరి దర్గా

## బాబా బుడన్‌గిరి దర్గా

'రెండవ అయోధ్య' అనేది చిక్కమగళూర్ జిల్లాలోని పడమటి కనుమల చెంతనున్న బాబా బుడన్‌గిరి అనే దర్గా. అది బాబా బుడన్ (హజ్రత్ దాదా హయాత్ మీర్ కలందర్) *అనే సూఫీ ప్రచా రకుడి దర్గా. అది చిక్కమగ ళూరుకు 30 కిమీలు దూరాన ఉంది. ముస్లింలకే కాక అన్ని దర్గాలలాగ హైందవ సమాజం లోని శూద్ర, దళిత కులాలకు కూడ అదొక పవిత్ర స్థలం. అయితే అది దత్తాత్రేయుడు అనే స్వామి పీఠం అని సంఘ్‌పరివార్ అంటుంది. దానికి దత్తపీఠం అని పేరుపెట్టి, 1984 నుండి దత్తాత్రేయస్వామి జన్మదినోత్సవాలు నిర్వహించే ప్రయత్నం చేస్తున్నది. 6 డిసెంబర్ 1992న బాబ్రీమసీదును కూల్చేసిన తరువాత దీని ప్రాముఖ్యం పెరిగింది. దత్తజయంతి ఉత్సవాలలో ఉద్విగ్నత రెట్టింపయింది. దర్గాను 'విముక్తం' చేస్తామన్న ప్రకటన సంఘ్‌పరివార్ 1998 నుండి చేయడం మొదలుపెట్టింది. 1999లో వారొక జీపుయాత్ర నిర్వహించి

*అరబ్బు జాతీయుడయిన ఇతనికి భారతదేశంలోకి కాఫీ తీసుకొచ్చిన ఘనత దక్కుతుంది. అతను కొన్ని కాఫీ గింజలు తీసుకొచ్చి చిక్కమగళూరు దగ్గర నాటడం దానికి నాంది. ఇవ్వాల్టికీ దేశంలో కాఫీ ఉత్పత్తికి చిక్కమగళూరు ఒక ముఖ్య కేంద్రం.

ఆ దత్తపీఠం చరిత్రగా తాము ముందుకు తెచ్చిన కథను ప్రచారం చేయసాగారు. దానిని అల్లుకొని విద్వేషాన్ని కూడగట్టసాగారు. 2002లో జరిగిన గుజరాత్ మారణకాండ అనంతరం బాబా బుడన్‌గిరి రెండవ బాబ్రీమసీదు కానుందనీ కర్నాటక రెండవ గుజరాత్ కానుందనీ చెప్పసాగారు.

కౌముసౌహార్ద వేదికె (ఇకపై 'వేదికె' అందాం) 1999లో మొదలయిన ప్రయత్నాలనుండి పుట్టింది. ఈ రోజు ఆ సంస్థలో అభ్యుదయ, సెక్యులర్ భావాలు గల వ్యక్తులు, సంస్థలు చాలామంది సభ్యులుగా ఉన్నారు. రచయితలు, కళాకారులు, విలేకరులు, దళిత సంఘాలు, మహిళాసంఘాలు, హక్కుల సంఘాలు, వగైరా. 2004లో దానికి ఈ పేరు పెట్టుకోవడం జరిగింది. మతతత్వ హింస జరిగిపోయిన తరువాత దానిని ఖండించే కార్యక్రమాలు సరిపోవనీ, దాని వ్యూహాలను ఎదుర్కొనడానికి ఆచరణాత్మక కార్యక్రమాలు అవసరమనీ వేదికె ప్రకటించింది. సంఘ్‌పరివార్ 2002లో చిక్కమగళూరులో నిర్వహించిన శోభాయాత్రకోసం 15000 మందిని సమీకరించగా, వెంటనే అదేచోట వేదికె 10000 మందితో తన సందేశం ఇస్తూ ప్రదర్శన నిర్వహించింది. 2003లో రాష్ట్రంలో ఇల్లిల్లూ తిరుగుతూ బాబాబుడన్‌గిరి విషయంలో సంఘ్‌పరివార్ చేసే ప్రచారంలో అబద్ధాలను వివరించే మూడు నెలల కార్యక్రమాన్ని చేపట్టింది. ఆ కార్యక్రమంలో భాగంగా హిందుత్వ భావజాలం స్త్రీలకూ దళితులకూ ప్రమాదకరం అని వివరించడం కూడ చేసింది.

డిసెంబర్ 2003లో ఎస్.ఎం.కృష్ణ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సంఘ్‌పరివార్‌కు శోభాయాత్రకూ దత్త జయంతి సంబరాలకూ అనుమతి ఇవ్వడాన్ని నిరసిస్తూ వేదికె డిసెంబర్ 7వ తేదీన చిక్కమగళూరులో మత సామరస్య ప్రదర్శన తలపెట్టింది. ప్రభుత్వం ఆ ప్రదర్శనకు అనుమతి నిరాకరించగా, ఆ దినం 1500 మంది చిక్కమగళూరులో ప్రవేశించి అరెస్టయ్యారు. 2004లో సంఘ్‌పరివార్ దత్త జయంతి ఉత్సవాల కార్యక్రమం ప్రకటించగానే వేదికె అదే దినం, అదేచోట, అదే సమయంలో మతసామరస్య ప్రదర్శన చేపట్టనున్నట్టు ప్రకటించింది. ప్రభుత్వం ఇద్దరికీ అనుమతి నిరాకరించింది. సంఘ్‌పరివార్ కార్యక్రమం నడవకుండ చూడడం వేదికె ఉద్దేశ్యం. కాబట్టి ఈ నిషేధంతో వారి లక్ష్యం నెరవేరినట్టే. 2005లో మళ్లీ ఇదే జరిగింది.

2006 ఫిబ్రవరిలో భారతీయ జనతాపార్టీ జనతాదళ్ (సెక్యులర్)తో కలిసి కర్నాటకలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సంఘ్‌పరివార్ శక్తులు చిక్కమగళూర్‌లో ప్రదర్శన, దర్గాలో దత్తజయంతి ఉత్సవాలు నిర్వహించే ప్రయత్నాన్ని పునరుద్ధరించారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి దానికి అనుమతిచ్చింది. నిరసన తెలిపిన వేదికె సభ్యులను అరెస్టు చేసింది. దర్గాలోపల దత్తజయంతి సంబరాలు జరుపుకోవడానికి మాత్రం అనుమతి ఇవ్వడానికి సాహసించలేదు. ఈ సంవత్సరం వేదికె సుప్రీంకోర్టులో కేసువేయగా, 1975కు పూర్వం అక్కడ నడిచిన మత సంబంధమైన కార్యకలాపాలు తప్ప వేరే ఏమీ చేపట్టవద్దని సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వేదికె ఆ రాష్ట్రంలో బహుళత్వం, లౌకికతా విలువలను సజీవంగా ఉంచడానికి తరచుగా కార్యకలాపాలు చేపడుతూ, అదే సమయంలో సంఘ్‌పరివార్ చేసే జనసమీకరణకు ప్రతిగా తానుకూడ పెద్దెత్తున జనసమీకరణ చేపట్టి ప్రభుత్వంపైన ఒత్తిడి పెడుతున్నది.

ముస్లింలకు వ్యతిరేకంగా ద్వేషాన్ని రగిలించడానికి అక్కరకొచ్చే మూడవ సంకేతం ఆవు. పశువులను కోతకు తోలడాన్ని వ్యతిరేకిస్తూ ఆ వ్యతిరేకతను నెపంగా మలచుకొని ఈ మధ్యకాలంలో

ముస్లింలపైన దాడులు చేసారు. నిజానికి ఆవుల అమ్మకం మీదగానీ ఆవు మాంసం మీదగానీ కర్నాటకలో నిషేధం లేదు – పశువుల అమ్మకందారులలో ఎక్కువమంది ముస్లింలే అయినప్పటికీ, అందరూ ముస్లింలు కారు. దేశమంతటా పేదలు, ప్రత్యేకించి దళితులు గొడ్డుమాంసం తింటారు. దీనికి కారణమేమిటంటే అన్నిరకాల మాంసాలలోకీ అది చవక. పైగా దళిత కులాల ఆచారాలలో దానిపైన నిషేధం లేదు బ్రాహ్మణీకరణ చాలా లోతుగా జరిగిన ప్రాంతాలలో తప్ప. అంతేకాక దేశవ్యాప్తంగా పనిచేయలేని, తిండిపెట్టలేని రైతులు పశువులను కోతకు అమ్ముతుంటారు. ఆ రైతులలో చాలామంది హిందూ కులవ్యవస్థలో పైభాగాన ఉన్నవారూ ఉన్నారు.

## హజబ్బ, హసనబ్బల ఉదంతం

అయినప్పటికీ గొడ్డు మాంసానికీ ముస్లింలకూ మధ్య సంబంధం సజీవంగా ఉంచబడుతుంది. దాని ఫలితంగా భౌతిక దాడులు జరిగిన సందర్భాలూ ఉన్నాయి. చాలా క్రూరమైన ఒక ఉదాహరణ, ఉడుపి జిల్లా మూలూరుకు చెందిన తండ్రీ కొడుకులు హజబ్బ (60), హసనబ్బ (29)లపైన 13 మార్చి 2005 నాడు జరిగిన దాడి. ఒక దూడను రవాణా చేస్తున్న పాపానికి హజబ్బను హిందూ యువసేనకు చెందిన వ్యక్తులు పట్టుకున్నారు. బహిరంగ ప్రదేశంలో విపరీతంగా కొట్టారు. జనం చుట్టూ చేరి ఏమాత్రం జోక్యం చేసుకోకుండ చూస్తూ నిలబడ్డారు. తన తండ్రిపైన దాడి జరిగిందని తెలుసుకున్న హసనబ్బ అక్కడికి రాగా, అతనిని కూడ విపరీతంగా కొట్టారు. వందలమంది చూస్తుండగా, వారిద్దరినీ బట్టలు విప్పించి కొట్టారు. ఇద్దరికీ తీవ్రగాయాలయి కొన్ని వారాలు ఆస్పత్రిలో ఉన్నారు. హసనబ్బ కాలి ఎముక విరగగా, హజబ్బ వెన్నెముక దెబ్బతినింది. ఆ తర్వాత 2006 అక్టోబర్‌లో, పశువులను తీసుకుపోతున్న ఒక వాహనం ఒక కారును ఢీకొని ఒక మహిళను గాయపరిచిందన్న వదంతిపై బజరంగ్‌దళ్ అక్టోబర్ 5వ తేదీన బంద్ పిలుపు ఇచ్చింది. ఆ బంద్ సందర్భంగా మంగళూరులో మతఘర్షణలు జరిగి కర్ఫ్యూ విధించడం జరిగింది. ఇద్దరు ముస్లింలు చనిపోయారు.

ముస్లింలపైన జరిగిన దాడులలో 'జాతి వ్యతిరేకులు' అన్న నిందకు ఎటువంటి పాత్ర ఉందో, క్రైస్తవులపైన జరిగిన దాడులలో 'మతమార్పిడి' అన్నదానికి అటువంటి పాత్రే ఉంది.

క్రైస్తవులపైన దాడులు ఈ మధ్యనే మొదలయినాయి. 2006కు పూర్వం దాడులు జరిగిన దాఖలాలు లేవు. అయితే భారతదేశం హిందువులది అన్న అభిప్రాయం స్థిరపడినట్టయితే, క్రైస్తవులపైన దాడులు జరగడానికి ఎక్కువకాలం పట్టదు. దానికి ఒక సైద్ధాంతిక సాకు, ఒక సామాజిక సందర్భం కావలసివచ్చాయి. ముస్లింలపైన జరిగిన దాడులలో 'జాతి వ్యతిరేకులు' అన్న నిందకు ఎటువంటి పాత్ర ఉందో, క్రైస్తవులపైన జరిగిన దాడులలో 'మతమార్పిడి' అన్నదానికి అటువంటి పాత్రే ఉంది. సామాజిక సందర్భాన్ని – ఏ ప్రాతిపదికపైన ఒక సామాజిక వర్గంమీద విద్వేషం రెచ్చగొట్టడం జరిగిందన్న విషయాన్ని – అవగాహన చేసుకోవడానికి మరికొంత విశ్లేషణ అవసరం. కర్నాటకలో పశ్చిమతీరానికీ ఇతర ప్రాంతాలకూ జవాబు ఒకటే కాకపోవచ్చు. క్రైస్తవ మత

వ్యాప్తికి సంబంధించినంత వరకు కేరళ నుండి గోవా, ఆపైదాకా దేశ పశ్చిమతీరం కథ భిన్నమైనది. తక్కిన మధ్య, దక్షిణ భారతదేశంలో క్రైస్తవం ప్రధానంగా వ్యాప్తి చెందింది దళితకులాలలో, ఆదివాసీ సమాజంలో, మత్స్యకారులవంటి బాగా వెనుకబడిన కులాలలో. అక్కడ మతమార్పిడిని క్రైస్తవ మిషనరీల హక్కుగా కాక ఆ సామాజిక వర్గాల స్వాతంత్ర్య ప్రకటనగా చూడడం భావ్యంగా ఉంటుంది. అప్పుడే మతమార్పిడులను వ్యతిరేకించడంలో గల ఒక ఆంతర్యం అర్థం అవుతుంది.

భారతదేశంలో క్రైస్తవం ప్రధానంగా వ్యాప్తి చెందింది దళితకులాలలో ఆదివాసీ సమాజంలో మత్స్యకారుల వంటి బాగా వెనుకబడిన కులాలలో. అక్కడ మతమార్పిడిని క్రైస్తవ మిషనరీల హక్కుగా కాక ఆ సామాజిక వర్గాల స్వాతంత్ర్య ప్రకటనగా చూడడం భావ్యంగా ఉంటుంది.

దేశ పశ్చిమ తీరంలో క్రైస్తవం చాలా ప్రాచీనమైనదే కాక, దాని సామాజిక స్వభావం కూడ భిన్నమయినది. ఇక్కడ క్రైస్తవులు కేవలం దీనజనులు కారు. కొందరు క్రైస్తవులు సంపన్నులు, కొన్ని చర్చిలు సంపన్నమయినవి. వారిపైన ద్వేషం రెచ్చగొట్టడానికి దీనిని వాడుకోగల వైనాన్ని గురించి అవగాహన అవసరం. ఒక పోలిక చెప్పాలంటే, 2002లో సంఘ్‌పరివార్ గుజరాత్‌లో సాగించిన మారణకాండలో భాగంగా బరోడా జిల్లాలోని ఛోటా ఉదేపూర్ ప్రాంతంలో ఆర్థికంగా కొంత బాగున్న బోహ్రా ముస్లింలపైన బీద ఆదివాసులను రెచ్చగొట్టిన వైనంలో దొరుకుతుంది. సంఘ్‌పరివార్ గురించి మాట్లాడుకునేటప్పుడు ఆ కూటమి తన వెంట జనాన్ని సమీకరించడం కోసం మత వర్గాల మధ్య ద్వేషాన్ని రెచ్చగొట్టే ఎత్తుగడను పనిగట్టుకొని వాడుకుంటుందనీ, దాని కోసం ఏం చేయడానికీ ఏ సాధనాన్ని వినియోగించుకోవడానికీ వెనకాడదనీ గుర్తుంచుకోవడం అవసరం. ఈ క్రమంలో వాళ్లు రెచ్చగొట్టే ద్వేషం మన చరిత్ర మన సమాజానికి అందిచ్చిన అత్యున్నతమైన విలువలను, ప్రజల జీవన పరిస్థితులు, ఆకాంక్షల నుండి పుట్టిన ఉన్నతమయిన మానవీయ సంప్రదాయాలను ధ్వంసం చేస్తుందనేది వారికి పట్టని విషయం.

## కరావళి

కర్నాటక రాష్ట్ర పడమటి తీరం దక్షిణ ప్రాంతాన్ని కరావళి అంటారు. మంగళూరు కేంద్రంగాగల దక్షిణకన్నడ జిల్లాను, ఉడుపి జిల్లాను కలిపి ఈ పేరుతో వ్యవహరిస్తారు. ఆ ప్రాంతపు సామాజిక రాజకీయ సంస్కృతి దురదృష్టవశాత్తు సంఘ్‌పరివార్ భావజాలానికీ ప్రచారానికీ అనుకూలమయిన వాతావరణాన్ని కలిగి ఉంది. ఆ ప్రాంతంమీద అభ్యుదయ రాజకీయ ఉద్యమాల ప్రభావం తక్కువ. కన్నడ జాతీయ భావం ప్రభావమూ తక్కువ (అక్కడ ప్రధానంగా తుళు భాష మాట్లాడతారు). ఆ ప్రాంతానికి తక్కిన కర్నాటకతో సంబంధాలకంటె ముంబాయినగరపు వ్యాపార ప్రపంచంతో సంబంధాలు ఎక్కువంటే అతిశయోక్తి కాబోదు. ఇక్కడి ప్రధాన కులాలు బ్రాహ్మణులు, బంట్‌లు. బంట్‌లు వ్యవసాయము, వ్యాపారము చేసే శూద్ర అగ్రవర్ణం (తరచుగా పేరు చివర 'శెట్టి' అని ఉంటుంది). వారిద్దరికీ ఆర్‌ఎస్‌ఎస్‌తో ఎప్పటినుండో సన్నిహిత సంబంధాలున్నాయి. దేశంలోని ఇతర ప్రాంతాలకు భిన్నంగా ఇక్కడ ఈ రెండు కులాలకు చెందిన ప్రైవేట్ బ్యాంకులు అనేకం

(కెనెరాబ్యాంకు, సిండికేట్ బ్యాంకు, విజయబ్యాంకు, కార్పొరేషన్ బ్యాంకు, కర్నాటక బ్యాంకు వగైరా) ఉన్నాయి. దేశ బ్యాంకింగ్ పరిశ్రమలో ప్రముఖ స్థానాన్ని పొందాయి. 1969లోనూ ఆ తరువాతా ఇందిరాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బ్యాంకులను జాతీయం చేయడంపట్ల వారిలో సహజంగానే నిరసన చాలా ఉండింది. దీనితో వారు, ప్రత్యేకించి బంట్ కులస్తులు కాంగ్రెస్‌కు మరింత దూరమయి, జాతీయీకరణను మొదటినుండి వ్యతిరేకించిన ఆర్ఎస్ఎస్‌కు మరింత దగ్గరయ్యారు.

అయితే అగ్రకులాలు మాత్రమే సంఘ్‌పరివార్‌తో ఉంటే – ఎంత సంపూర్ణంగా ఉన్నా వారి ప్రయోజనాలకు అవసరమయిన విస్తృతి, ప్రజాబలం ఒనగూడదు. ఆ విస్తృతి వారికి రెండు వెనుకబడిన కులాలలో లభ్యమయింది. ఆ కులాలు బిల్లవ (మరాఠేదార్ అనికూడ అంటారు), మొగవీర. బిల్లవలు కల్లుగీత కార్మికులు కాగా, మొగవీర అనేది మత్స్యకారుల కులం. బిల్లవలకు కొంత భూమికూడ తరచుగా ఉంటుంది. అయితే బ్రాహ్మలకు మరింత సంపద మరిన్ని అభివృద్ధి అవకాశాలు తెచ్చిపెట్టి, బంట్‌లను మరింత సంపూర్ణంగా వ్యవసాయంనుండి పట్టణ జీవితంలోకి తీసుకొచ్చి, మలబారీ ముస్లింలకు (వీళ్లను 'బేరీ' అంటారు), క్రైస్తవులకూ కూడ కొంత మేరకు అభివృద్ధి ఫలాలు అందిచ్చిన వ్యవసాయ, పారిశ్రామిక, వర్తక వికాసం ఈ కులాల ప్రజానీకానికి మాత్రం ఆశ చూపించి ఏమీ ఇవ్వకుండ వెనకే ఉంచేసింది. రాజకీయ సందర్భం వేరేగా ఉంటే దీనినుండి వారిలో పుట్టిన నిరసన ప్రజాతంత్ర ఉద్యమాలకూ సామాజిక పురోగతికీ దారితీసి ఉండేదేమోగానీ కరావళిలోని రాజకీయ సందర్భం వారిని ఆర్ఎస్ఎస్‌కు అప్పగించింది.

## అభివృద్ధి తెచ్చిన అసమానత

కరావళి దేశంలోని అభివృద్ధి చెందిన ప్రాంతాలలో ఒకటి. సగటు ఆదాయం ఎక్కువ. విద్యాప్రమాణాలు ఎక్కువ. వ్యాపారలావాదేవీలు ఎక్కువ. ప్రైవేట్ బ్యాంకింగ్ పరిశ్రమేకాక సూరత్కల్, మణిపాల్‌వంటి పట్టణాల కేంద్రంగా ప్రైవేట్ ఉన్నత విద్యావ్యవస్థకూడ (దేశంలో విద్య ప్రైవేటీకరణ సార్వత్రికం కాకముందే) బాగా అభివృద్ధి చెందింది. కౌలుదారీ సంస్కరణలు ఈ అభివృద్ధిక్రమానికి ఊతం ఇచ్చాయి. కర్నాటకలో కౌలుదార్లకు హక్కులు కల్పించిన భూసంస్కరణలను సమర్థంగా అమలు చేసిన ఘనత ఒకనాటి ముఖ్యమంత్రి దేవరాజ్ అరస్ పొందాడు. ఆ సంస్కరణలు బాగా అమలయిన జిల్లాలలో దక్షిణ కన్నడ ఒకటి. భూస్వాములలో ప్రధాన వర్గం అయిన బ్రాహ్మణులు దీని ఫలితంగా మరింతగా పట్టణ ప్రాంతాలలో స్థిరపడిపోగా, పెద్దకౌలుదార్లలో ప్రధానవర్గమయిన బంట్‌లు భద్రత పొందగలిగారు, వ్యాపార పంటలు మరింతగా పండించి లాభం పొంది కాలక్రమంలో మరింత ఎక్కువగా పట్టణప్రాంత వ్యాపారరంగంలోనికి (ప్రత్యేకించి హొటళ్ల పరిశ్రమలోనికి) విస్తరించగలిగారు. ఎక్కువ భాగం చిన్న కౌలుదార్లయిన బిల్లవలకు కౌలుదారీ హక్కులొచ్చాయి, ఆశ కలిగింది, కానీ పెట్టుబడులు చాలక, రిస్క్‌తీసుకునే స్తోమత లేక, దాని పూర్తి ఫలం దక్కలేదు. మరొక వైపు వారి సంప్రదాయ కల్లుగీత వృత్తిని అదే అభివృద్ధి దెబ్బతీసింది. వేరే మత్తు పానీయాలు దానిని పక్కకునెట్టాయి.

విద్యావ్యాప్తివల్ల క్రైస్తవులలో ఒక వర్గం కూడ ప్రయోజనం పొందింది. మిషనరీలు మొదటినుండి విద్యకిచ్చిన ప్రాముఖ్యం తెలిసిందే. వారు తమ కృషిని మతం మార్చుకున్న వారికే పరిమితం చేయకపోయినప్పటికీ, క్రైస్తవులు దానికెక్కువ స్పందించారు. విద్యాసంస్థలు కొన్ని క్రైస్తవుల చేతిలో ఉండడంవల్ల వ్యాపారరీత్యాకూడ ఈ వ్యాప్తి క్రైస్తవులకు లాభించింది. ముస్లింల విషయానికొస్తే, మత్స్యకారులయిన మొగవీర కులానికీ చేపల వ్యాపారం చేసే మలబారీ (బేరీ) ముస్లింలకూ మధ్య వైరుధ్యం ప్రత్యక్షమైనదే. వ్యాపారం పెరుగుదల ఉత్పత్తిదారుడి కంటే దానిని వర్తకం చేసే వాడికి ఎక్కువ ప్రయోజనం కలిగిస్తుందనేది తెలిసిన విషయమే. అంతేకాక గల్ఫ్‌లో ఉద్యోగ అవకాశాలు దొరకడం కూడ బేరీ ముస్లింల పురోగతికి దోహదపడింది. వీరందరికీ అంతో యింతో లభించిన అభివృద్ధి ఫలాలు బిల్లవ, మొగవీర ప్రజానీకాన్ని మాత్రం ఊరించి వదిలేసాయి. దాని ఫలితంగా ఆ ప్రజానీకంలో పుట్టిన నిరసన పూర్తిగా న్యాయమైనదే. అభివృద్ధి అనేది కొందరి కోసమేనని ఎవరూ అనలేరు, మాకూ దానిలో సమానవాటా కావాలన్న ఆరాటాన్ని ఎవరూ కాదనలేరు. అభ్యుదయ స్వభావంగల రాజకీయ వాతావరణం ఉండి ఉంటే ఈ నిరసన అసమాన అభివృద్ధిని వ్యతిరేకించే ఉద్యమానికి బాటవేసి ఉండేది. దానిని నిర్మాణాత్మకంగా సవాలు చేసి ఉండేది. అది లేని కారణంగా ఈ నిరసన సంఘ్‌పరివార్ విద్వేష రాజకీయాలకు మందుగుండుగా పనిచేసింది. ప్రధానంగా బ్రాహ్మణ, బంట్ కులాలకు చెందిన సంఘ్‌పరివార్ నాయకత్వం, ఈ అసమ అభివృద్ధి నుండి ఎక్కువ ప్రయోజనం పొందిన తమ కులాల మీదకాక, ముస్లింలపైన క్రైస్తవులపైన వెనుకబడ్డ ప్రజల నిరసనను ఎక్కుపెట్టాయి. వారికి దక్కవలసిన అభివృద్ధిని ఎత్తుకుపోయిన పరాయి వర్గాలుగా వీరిని చూపించడంలో కృతకృత్యమయ్యాయి. 2008 కి ముందు దీనిఫలితంగా ముస్లింలపైన చెలరేగిన ద్వేషాన్ని గురించి పైన చూసాము. 2008లో క్రైస్తవులపైన జరిగిన దాడిలో దీని మరొక పార్శ్వాన్ని ఇప్పుడు చూద్దాం.

క్రైస్తవులపైన జరిగే దాడులను సమర్థించుకోవడానికి సంఘ్‌పరివార్ వేసే అభియోగం మతమార్పిడి చేస్తున్నారు అనేది. ఇక్కడ మూడు అంశాలున్నాయి. ఒకటి, అసలు మతమార్పిడి ఏ మేరకు జరిగింది అనేది. రెండు ఈ విషయాన్ని మత మార్పిడులను చేపడుతున్నవారి వైపునుండి చూడాలా లేక మతం మార్చుకుంటున్నవారి వైపునుండి చూడాలా అనేది. మూడు మతమార్పిడుల గురించి భారత రాజ్యాంగం ఏమంటుందనేది. 2001 సెన్సస్ ప్రకారం, దేశ జనాభాలో క్రైస్తవుల నిష్పత్తి 2.4 శాతం, కర్నాటకలో కేవలం 1.9 శాతం. నిరుడు హింస ప్రధానంగా జరిగిన దక్షిణ కన్నడ జిల్లాలో క్రైస్తవుల జనాభా ఇంకా ఎక్కువ ఉన్న మాట వాస్తవమే గానీ దానికి కారణం ఈ మధ్యలో జరిగిన మత మార్పిడులు కావు. దేశ పశ్చిమ తీరం ఎప్పటినుండో క్రైస్తవ మతవ్యాప్తికి కేంద్రంగా ఉంది. అక్కడ క్రైస్తవం దళిత పేటలకు ఆదివాసీ గూడాలకో పరిమితం కాదు, సమాజం ప్రధాన స్రవంతిలో భాగం.

రెండవ విషయానికొస్తే, క్రైస్తవ మిషనరీలకు మతమార్పిడులు చేసే హక్కు ఉందా, అది సబబా అన్న విషయంలో అభిప్రాయ భేదాలకు తావు ఉండవచ్చునేమో గానీ హైందవ సమాజం వెలుపల, అంచున ఉన్న అణగారిన ప్రజానీకానికి క్రైస్తవంగానీ ఇస్లాంగానీ స్వీకరించే హక్కు ఉందన్న విషయాన్ని ఎవ్వరూ కాదనలేరు. నిజానికి మతమార్పిడులు వ్యతిరేకించే వారి నిజమైన ఉక్రోషం అదే. శతాబ్దాలుగా తమ ఆత్మగౌరవం మీద గుదిబండగా కూర్చున్న చాతుర్వర్ణాన్ని వదిలించుకోవడానికి అవర్ణులు కోరుకుంటున్న స్వేచ్ఛను వారు సహించలేకపోతున్నారు.

## రాజ్యాంగం ఏమంటుంది?

మూడవది రాజ్యాంగం ఏమంటుందనేది. దీని గురించి కొంచెం వివరంగా మాట్లాడుకోవడం అవసరం ఎందుకంటే ఈ విషయంలో రాజ్యాంగం స్పష్టంగానే ఉన్నప్పటికీ సుప్రీంకోర్టు అనవసరమైన గందరగోళం సృష్టించింది. సంఘ్‌పరివార్ దానిని చాలా సంతోషంగా స్వీకరించి తన ప్రచారంలో భాగం చేసుకుంది. రాజ్యాంగం అధికరణం 25లో మూడు హక్కులు స్పష్టంగా ఇచ్చింది. మతాన్ని విశ్వసించే హక్కు, ఆచరించే హక్కు, వ్యాప్తి చేసుకునే హక్కు. మూడు హక్కులు ఇచ్చినప్పుడు వాటిని రెండుకు కుదించి విశ్వసించే హక్కు, ఆచరించే హక్కు మాత్రమే రాజ్యాంగం ఇచ్చిందని అనడానికి వీలులేదు. ఈ విషయంలో రాజ్యాంగ నిర్మాతల అభిప్రాయం స్పష్టమే. రాజ్యాంగ పరిషత్ నియమించిన ప్రాథమిక హక్కుల సబ్‌కమిటీ మొదట మతాన్ని విశ్వసించే హక్కు, ఆచరించే హక్కు మాత్రమే అందులో చేర్చింది.

> **అవతలి వ్యక్తి**
>
> **అభిప్రాయాలు విని మన అభిప్రాయాలు మార్చుకోవడం కూడ మన భావస్వేచ్ఛలో భాగమే. నీ మత భావాలను ప్రచారం చేసుకునే హక్కు నీకు ఉందిగానీ మరొకరిని నీ మతంలోకి మారమని అడగడం ఆ వ్యక్తి భావస్వేచ్ఛకు అవరోధం అనడం**
>
> **అర్థరహితం.**

అయితే మైనారిటీ హక్కుల సబ్‌కమిటీ, మతాన్ని వ్యాప్తి చేసుకునే హక్కు మత స్వేచ్ఛలో భాగంగా ఉండాల్సిందేనని అనింది. దానికి వాళ్లు చూపించిన కారణం ఏమిటంటే ఇస్లాం, క్రైస్తవాలు మతాన్ని వ్యాప్తి చేసుకోవడం మతాన్ని ఆచరించడంలో భాగంగా భావిస్తాయనీ, కాబట్టి ఆ హక్కు ఇవ్వాలనీ, లేకపోతే మతస్వేచ్ఛ కల్పించినట్టుకాదనీ. మైనారిటీ హక్కుల సబ్‌కమిటీ సభ్యుడయిన ఎం. రత్నస్వామి చేసిన ఈ ప్రతిపాదనను ఆ సబ్‌కమిటీలోని వారందరూ అంగీకరించి రాజ్యాంగ పరిషత్‌కు నివేదించగా, కొంత చర్చించిన మీదట రాజ్యాంగ పరిషత్ దానికి అంగీకరించింది. 'ఎవరయినా మతాన్ని వ్యాప్తి చేసుకోదలచుకుంటే చేసుకోనీయండి, దానిని ప్రాథమిక హక్కులలో చేర్చడం ఎందుకు?' అని కొందరు ప్రశ్నించారుగానీ, ఆ హక్కులేకుండ మతస్వేచ్ఛనొక హక్కుగా కల్పించామనడంలో అర్థం లేదని చెప్పి రాజ్యాంగ పరిషత్ ఇప్పుడున్న అధికరణం 25ను ఆమోదించింది. సామాజికంగా ఈ హక్కుకుగల ప్రాముఖ్యమేమిటో కూడ రాజ్యాంగ పరిషత్ స్పష్టంగా గుర్తించింది. హైందవ సమాజానికి చెందిన అణగారిన కులాలకు తమ ఆత్మాభిమానాన్ని ఆదరించే మతంలోకి మారే స్వేచ్ఛ ఉండాలన్న గుర్తింపే ఇది అని టి.టి. కృష్ణమాచారి రాజ్యాంగ పరిషత్‌లో చేసిన ప్రసంగంలో స్పష్టం చేసాడు. ఈ విషయంలో రాజ్యాంగం దృష్టి ఎంత విశాలమంటే, ఆర్టికల్ 25లోని హక్కు 'ప్రతీవ్యక్తికీ' ఉంటుంది. అంటే విదేశీయులు సహితం భారతదేశంలో మతవ్యాప్తి చేసుకోవచ్చు. అదే భావప్రకటనాస్వేచ్ఛ, సమావేశ స్వేచ్ఛ, సంచార స్వేచ్ఛ వంటివయితే కేవలం 'పౌరులకే' పరిమితమైన హక్కులు.

రాజ్యాంగం వ్యక్తం చేసిన స్పష్టమైన భావనకు సుప్రీంకోర్టు రెవరెండ్ స్టయినిస్లాస్ వర్సస్ స్టేట్ ఆఫ్ మధ్యప్రదేశ్ అనే కేసు (1977)లో చాలా అజాగ్రత్తగా రాసిన తీర్పుతో తీవ్రనష్టం చేసింది.

మతాన్ని వ్యాప్తి చేసుకునే హక్కు అంటే మతమార్పిడి చేసే హక్కు కాదని సుప్రీంకోర్టు ఈ తీర్పులో అనింది. ఎందుకంటే మతమార్పిడి అనేది అవతలి వ్యక్తి భావస్వేచ్ఛకు భంగకరం అనేది సుప్రీంకోర్టు వ్యాఖ్య. ఈ వ్యాఖ్యను అర్థం చేసుకోవడం కష్టం. అవతలి వ్యక్తి అభిప్రాయాలు విని మన అభిప్రాయాలు మార్చుకోవడం కూడ మన భావస్వేచ్ఛలో భాగమే. నీ మత భావాలను ప్రచారం చేసుకునే హక్కు నీకు ఉందిగానీ మరొకరిని నీ మతంలోకి మారమని అడగడం ఆ వ్యక్తి భావస్వేచ్ఛకు అవరోధం అనడం అర్థరహితం. అంతేకాక మతవ్యాప్తి కూడ మత స్వేచ్ఛలో భాగం అయినప్పుడే మతస్వేచ్ఛ పరిపూర్ణం అవుతుందని మైనారిటీల హక్కుల సబ్‌కమిటీ చేసిన నిర్దిష్టమైన ప్రతిపాదన మేరకే రాజ్యాంగ పరిషత్ మత స్వేచ్ఛలో విశ్వసించడం, ఆచరించడం, వ్యాప్తి చేసుకోవడం అనే మూడు హక్కులు చేర్చిందని పైన చూసాం. ('మతం అనేది ప్రపంచంలో ఉన్నంత కాలం స్వేచ్ఛగా జరిగే మతమార్పిడిని గుర్తించవలసిందే'నని మైనారిటీల హక్కుల సబ్‌కమిటీ సభ్యుడయిన కె.ఎం. మున్షి రాజ్యాంగ పరిషత్‌లో తమ సబ్‌కమిటీ ప్రతిపాదించిన సవరణను వివరిస్తూ అన్నాడు). చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే రెవరెండ్ స్టయినిస్లాస్ కేసులో తీర్పు చెప్పింది దేశప్రధాన న్యాయమూర్తి ఎ.ఎన్.రే. ఈయన 'అభ్యుదయవాది' అని చెప్పి ఇందిరాగాంధీ ప్రభుత్వం ముగ్గురు సీనియర్లను కాదని ఆయనను 1973లో దేశ ప్రధాన న్యాయమూర్తిని చేసింది.

'మతాన్ని వ్యాప్తి చేసుకునే హక్కు అంటే మతమార్పిడి హక్కు కాదు' అన్న సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని సంఘ్‌పరివార్ ఒక నినాదంగా మార్చి, నిజాయితీలేని తమ ప్రచారానికి ఒక ఆచ్ఛాదనగా వాడుకుంటున్నది. హేతుబద్ధంగా తోచే వాదన చెప్పవలసిన అవసరం ఉన్నప్పుడు బలవంతపు మత మార్పిడుల గురించి మాట్లాడుతారు. బలవంతాన్ని ఎవరయినా వ్యతిరేకిస్తారు కాబట్టి ఇది హేతుబద్ధంగా తోచే వాదన. లేదా ఆశలు కల్పించి మత మార్పిడి చేస్తున్నారంటారు. ఇది కొంచెం సందేహాస్పదం, ఎందుకంటే 'ఆశలు కల్పించడం' అంటే ఏమిటన్నదానిపైన దీని మంచి చెడులు ఆధారపడి ఉంటాయి. అయితే గుంపును పోగు చేసి అల్లరి చేసేటప్పుడు, పాస్టర్లపైన ప్రచారకులపైన దాడిచేసేటప్పుడు, బలవంతం, ఆశలు అన్న లక్షణాలేవీ ఆపాదించకుండ మతమార్పిడినే నేరంగా చిత్రిస్తారు. హింసను సమర్థించుకోవడానికి ఈ నిందలు సరిపోవు కాబట్టి, క్రైస్తవ ప్రచారకులు హిందూ దేవతలను అసభ్యంగా చిత్రించడం వల్ల హిందువులు రెచ్చిపోయారని వాదిస్తారు. కర్నాటక దాడుల విషయంలో న్యూలైఫ్ అనే క్రైస్తవ ప్రచారక సంస్థపైన ఈ నింద వేసారు.

ఈ మాటల గారడీ అనివార్యం. ఎందుకంటే సంఘ్ పరివార్ ప్రాథమికంగా అప్రజాస్వామిక స్వభావం గల శక్తి. అయితే వారు భావ స్వేచ్ఛ ఉన్న సమాజంలో బతుకుతున్నారు. కాబట్టి ఒకసారి కాకపోతే ఒకసారి సంవాదానికి దిగక తప్పదు. అప్పుడు సహేతుకంగా కనిపించే కారణాలను, వాదనలను ఆశ్రయించక తప్పదు. అయితే వారు నిరుడు దాడిచేసి ధ్వంసం చేసిన క్రైస్తవ ప్రార్థనా స్థలాల జాబితాను పరిశీలిస్తే వారి ప్రచారం ఎంత అబద్ధమో తెలుస్తుంది. దాడికి గురయిన వాటిలో ఒక్కటి మాత్రమే న్యూలైఫ్ చర్చి. తక్కినవి కాథొలిక్, పెంతెకోస్తు, బాప్టిస్టు, సిఎస్‌ఐ తదితర శాఖల ప్రార్థనా స్థలాలు. న్యూలైఫ్ మీద సహితం అభ్యంతరకరమయిన ప్రచార సాహిత్యాన్ని వాడిన అభియోగం ఎవరూ ఏ అధికారి దగ్గరా చేయలేదు.

# కర్నాటక : హింసాకాండ

**కర్నాటక** లోని క్రైస్తవ ప్రజానీకానికి 2008 చాలా బాధాకరమైన సంవత్సరంగా కనిపించడానికి ఒక కారణం, ఆ సంవత్సరం తక్కువ కాల వ్యవధిలో ఎక్కువ తీవ్రతగల దాడులు జరగడం. రెండవ కారణం ప్రచారం లక్ష్యంగా గల కొత్త చర్చిలనేకాక ఎప్పటినుండో సమాజంలో భాగం అయిపోయి ఉన్న పాత చర్చిలను కూడ దాడికి గురి చేయడం. కర్నాటకలో జరిగిన ఈ దాడులకు ఇంత ప్రాధాన్యం రావడానికి మాత్రం అంతకుముందు ఒరిస్సాలో క్రైస్తవులపైన జరిగిన హత్యాకాండే కారణం. దాంతో సంఘ్‌పరివార్ వైఖరి గురించి దేశమంతటా చర్చ జరుగుతోంది.

అయితే ముందు సంవత్సరం జరిగిన ఘటనలను చూస్తే ఈ దాడులు ఏదో ఒక రోజు జరిగేవే అని అర్థం అవుతుంది. 2007లో క్రైస్తవులపైన 48 దాడులు జరిగాయి. ఒక చోటకాదు, దావణగిరి, బాగల్‌కోట్, గుల్బర్గా, హుబ్లి-ధార్వార్, చిత్రదుర్గ, దక్షిణ కన్నడ, కొడగు, మాండ్యా, కోలార్, ఉడుపి, బెల్గాం, తుంకూర్, షిమోగా, హవేరి, బిజాపూర్, హాసన్, మైసూరు, గడగ్ జిల్లాలలోనే కాక రాష్ట్ర రాజధాని అయిన బెంగుళూరు నగరంలోను దాడులు జరిగాయి. దాదాపు అన్నీ కూడ చిన్న చర్చిల పాస్టర్ల మీద జరిగిన భౌతిక దాడులే. అన్ని చోట్లా 'మత మార్పిడులు' అనే నిందనే సాకుగా చూపించారు. అన్ని చోట్లా దాడులకు పాల్పడింది బజరంగ్‌దళ్, హిందూ జాగరణ్ వేదికె, శ్రీరామసేనె తదితర సంస్థలకు చెందినవారు. మత ప్రచారాన్నే ఈ హిందూ సంరక్షకులు మత మార్పిడిగా చిత్రించి శిక్షిస్తున్నారనేది స్పష్టమే. సువార్త ప్రచారాన్ని సాదాసీదాగా నిర్వహించే చిన్న చర్చిలను మతాంతరీకరణ కేంద్రాలుగా - ఒక పెద్ద మతాంతీకరణ కుట్రగా సంఘ్ పరివార్ ఒకపక్క చూస్తుండగా, ఆలోచనాపరులయిన క్రైస్తవులు వేరే కారణంగా ఈ చిన్న చర్చిల వైపు ఆకర్షితులవుతున్నారని మంగళూరుకు చెందిన ఒక క్రైస్తవుడు మాతో అన్నాడు. అతని అభిప్రాయంలో అన్ని మతాల ప్రజలూ వ్యవస్థిత మత సంస్థలకు దూరం అవుతున్నారు. ఎందుకంటే అవి డబ్బుతోనూ అధికారం తోనూ రాజీపడి అవినీతి మయం అయిపోయాయి. మంగుళూరులో దాడికి గురయిన క్రైస్తవులలో చాలామంది పదవిలో ఉన్న వారితో బిషప్పులు లాలూచీ పడి తమను వెనక్కి లాగకపోతే తాము తమ హక్కుల కోసం మరింత గట్టిగా నిలబడి ఉండేవారమని అన్నారు.



అందరి మొహాల్లోనూ ఆందోళనే

ఇవన్నీ దృష్టిలో పెట్టుకొన్నప్పుడు ఒక సందేహం రాకమానదు. డబ్బుతో, అధికారంతో రాజీ పడకపోవడమేనా చిన్న చర్చిలు చేసిన పాపం? ఆ స్వతంత్రతకేనా వారు మతమార్పిడుల పేరిట శిక్ష అనుభవిస్తున్నారు?

## ఒక్కరోజే 12 చోట్ల దాడులు

2007తో పోలిస్తే, 2008లో జరిగిన దాడులు చాలా తీవ్రమైనవి. 17 ఆగస్ట్, 21 సెప్టెంబర్‌ల మధ్య 28 దాడులు జరిగాయి. వాటిలో 12 ఒక్కరోజే, 14 సెప్టెంబర్‌న దక్షిణ కన్నడ, ఉడుపి జిల్లాలలో జరిగాయి. పైన చెప్పినట్టు, న్యూలైఫ్ అనే చర్చి చేపట్టిన అభ్యంతరకరమైన ప్రచారాన్ని దాడి చేసినవారు కారణంగా చూపించినప్పటికీ, ఆ 28 చర్చిలలో ఒక్కటి మాత్రమే న్యూలైఫ్ చర్చి. ఈ దాడులలో, ప్రత్యేకించి మంగళూరు నగరంలో, కొట్టొచ్చినట్టు కనిపించే విషయం ఏమిటంటే పోలీసులు బజరంగ్‌దళ్‌తో చేదోడుగా వ్యవహరించడం. బజరంగ్‌దళ్‌వాళ్లు మొదట క్రైస్తవ ప్రార్థనా స్థలాలపైన దాడి చేస్తారు. ఆస్తి ధ్వంసం, మనుషులకు గాయాలు కలిగిస్తారు. తరువాత పోలీసులు రంగంలోకి దిగుతారు. దాడి చేసిన వారిని పట్టుకోవడానికి కాదు. క్రైస్తవులు ప్రతీకారంగా బలప్రయోగానికి పాల్పడకుండ నిరోధించడం కోసం. ఆ పేరుమీద వాళ్లు మళ్లీ క్రైస్తవుల పైన బలప్రయోగానికి పాల్పడతారు. ఘటనల క్రమాన్ని జాగ్రత్తగా విశ్లేషించినట్టయితే ఈ వ్యవహారమంతా ముందుగా వేసుకున్న పథకం ప్రకారమే జరిగిందన్న దాఖలాలు చాలా కనిపిస్తాయి.

14 సెప్టెంబర్‌నాడు ఒకే సమయంలో దాడి జరిగిన 12 స్థలాలలో మంగళూరు నగర పరిసరాలలోని కొడికల్ ఒకటి. అక్కడికి ప్రవేశించగానే మాకు మొట్టమొదట కనిపించింది రెండు చెట్లకు అడ్డంగా కట్టిన కాషాయం రంగు బ్యానర్. దానిపైన లక్ష్మణానంద సరస్వతికి జోహార్లు అని కన్నడంలో రాసిఉంది. కంధమల్ మమ్మల్ని ఇక్కడ కూడ వదిలిపెట్టేటట్టులేదు అని అనుకుంటూ, ధ్వంసమయిన కొడికల్ చర్చి వద్దకు వెళ్లాము. అది ఆ ఊరిలో చాలాకాలంగా ఉంటున్న తమిళులు (ఎక్కువగా దళితులు) ప్రార్థన చేసే సిఎస్ఐ చర్చి. 14 సెప్టెంబర్ ఆదివారం. ఆ చర్చిలో ఆదివారం ప్రార్థనలు మధ్యాహ్నం జరిపే ఆనవాయితీ ఉంది. కాబట్టి పొద్దున్న 10-15కు 30 లేక 35 మంది ముఖానికి పచ్చరంగు గుడ్డలు కట్టుకొని మోటార్‌సైకిళ్లపైన ఆ చర్చి దగ్గరకొచ్చినప్పుడు అక్కడ ఎవరూ లేరు. వారు ఇనుప రాడ్లతో, క్రికెట్ వికెట్లతో చర్చిలో విరగ్గొట్టగల ప్రతీ వస్తువునూ విరగ్గొట్టారు. దిమ్మెర పోయిన ప్రజలు ధైర్యం కూడగట్టుకొని చర్చిదగ్గరకు వచ్చేసరికి వారిపని ముగించుకొని 'జై బజరంగ్‌బలి' 'భారత్‌మాతాకీ జై' అని నినాదాలు ఇచ్చుకుంటూ వేగంగా వెళ్ళిపోయారు. పోలీసులకు ఫిర్యాదు ఇవ్వాలన్న ఆలోచన సహితం ప్రజలకు రాకముందే పోలీస్ సూపరింటెండెంట్ నేతృత్వంలో ఒక పోలీస్ టీం అక్కడికి వచ్చింది. విధ్వంసానికి పంచనామా

నిర్వహించకుండా మొత్తం శుభ్రం చేసి తీసుకుపోయారు. అంటే సాక్ష్యాలు మాయం చేసారని అర్థం.

మంగళూరు నగరంలో అదే సమయంలో దాడికి గురయిన మరొక స్థలం మిలాగ్రెస్‌లోని అడొరేషన్ సెంటర్. అది చర్చికాదు, మత ప్రచార కేంద్రం అంతకంటే కాదు. పూర్తిగా పర్దాలో జీవించి, రోజంతా ప్రార్థనలు చేసే క్రైస్తవ సన్యాసినుల ప్రార్థనా స్థలం. తాము రెండే సందర్భాలలో బయటికిపోతామని వారు అన్నారు. ఒకటి, అవసరమయినప్పుడు ఆస్పత్రికి, రెండు ఎన్నికలొచ్చినప్పుడు ఓటు వేయడానికి. 14 సెప్టెంబర్ ఉదయం 10-10 గంటలకు 15 లేక 16 మంది 'జైశ్రీరాం' 'జై బజరంగ్‌బలి' అని నినాదాలు ఇచ్చుకుంటూ మోటార్ సైకిళ్లపైన వచ్చారు. వాళ్ల ముఖాలకడ్డంగా గుడ్డలున్నాయి, చేతులలో లాఠీలున్నాయి. అప్పుడా ప్రార్థనా స్థలంలో ఆండ్రూ, ఐరీన్ అనే జంటమాత్రం ఉన్నారు. సన్యాసినులు ఎప్పటిలాగే లోపలున్న గదిలో ప్రార్థన చేస్తున్నారు. దుండగులు ఆ జంటను కొట్టి, వారి కారును ధ్వంసం చేసి ప్రార్థనా మందిరాన్ని పూర్తిగా చిత్తుచిత్తు చేసారు. కిటికీల అద్దాలు పగిలాయి. క్రీస్తు బొమ్మ కీళ్లు విరిగాయి. 5 లేక 10 నిమిషాలలో విధ్వంసం పూర్తిచేసిన దుండగులు తుళు భాషలో 'త్వరగా కానీయ్' అని ఒకరికొకరు చెప్పుకుంటూ వెళ్లిపోయారు.

గొడవవిన్న ఇరుగు పొరుగు వచ్చి చూసి పోలీసులకు చెప్పారు. పోలీసులు వచ్చారుగానీ నేరపరిశోధన కంటే సన్యాసినులను ప్రశ్నించడం మీద ఎక్కువ శ్రద్ధ కనబరచారు. వాళ్లకు లైసెన్స్ ఉందా అని అడిగారు (దేనికో? ప్రార్థన చేయడానికా?) సన్యాసినులు తమను తాము జాతీయ సమాజంగా భావిస్తారా లేక అంతర్జాతీయ సమాజంగా భావిస్తారా అని అడిగారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో పోలీసు యంత్రాంగం కాషాయీకరణ గురించి వస్తున్న అభియోగాల నేపథ్యంలో ఈ ప్రశ్నను అర్థం చేసుకోవాలి. మైనారిటీలలో జాతీయత కరువయిందనేది సంఘ్‌పరివార్ నింద. మేము అడొరేషన్ సెంటర్‌కు పోయినప్పుడు మా బృందంలో కొందరికి బయట కాపలా ఉన్న పోలీసుల నుండి అదే స్వభావంగల ప్రశ్న ఎదురయ్యింది. మాది మానవహక్కుల బృందం అని చెప్పగానే 'అయితే మీరు అస్సాంకు



అడొరేషన్ సెంటర్‌లో ధ్వంసమైన క్రీస్తు విగ్రహం

పోయివచ్చారా?' అన్న ఎదురుప్రశ్న వచ్చింది. ఆ రోజులలో అస్సాంలో బంగ్లాదేశ్‌నుంచి వలస వచ్చిన వారికీ బోడో తెగలకూ మధ్య ఘర్షణ జరుగుతుండింది. ఆ ఘర్షణకు బాధ్యత 'బంగ్లాదేశీ చొరబాటుదార్ల'దేనన్న సంఘ్‌పరివార్ వ్యాఖ్యానం కన్నడ దినపత్రికలలో విస్తృతంగా ప్రచారం అయింది. మానవ హక్కుల గురించి మాట్లాడేవాళ్లు ముస్లింలు చేసే హింసను చూడరన్న సంఘ్‌పరివార్ నిందే, 'అస్సాంకు పోయి వచ్చారా' అని ఆ పోలీసు సిబ్బంది అడిగిన ప్రశ్న వెనక ఉంది.

పోలీసులు విచారణ ముగించుకొని వెళ్లిపోయిన తరువాత కొద్దిసేపటికి వారిలో ఒకడు (ఇతని పేరు మణికంఠన్ అని సన్యాసినులు చెప్పారు) తిరిగి వచ్చి జరిగిన దాని గురించి పత్రికలవారితో మాట్లాడవద్దనీ, విధ్వంసాన్ని ఫోటోలు గానీ వీడియోగానీ తీయనియ్యవద్దనీ చెప్పి వెళ్లిపోయాడంట. ఆ మధ్యాహ్నం అడొరేషన్ సెంటర్ బయట క్రైస్తవులు ఆందోళనకు దిగారు. ఆ సెంటర్ వారికి అత్యంత పవిత్రమైనదని వారిపట్ల సానుభూతి లేని పోలీస్ అధికారులు సహితం ఒప్పుకుంటున్నారు. ఆందోళనలో భాగంగా వారు రాస్తారోకో నిర్వహించినట్టున్నారు. పోలీసులు వాళ్లను కొట్టి తరిమారు. బాష్పవాయువు ప్రయోగించారు. క్రైస్తవులు అడొరేషన్ సెంటర్ ఆవరణలోకి పారిపోయి వస్తే పోలీసులు వారిపైకి రాళ్లు విసిరారు, బాష్పవాయువు తూటాలు పేల్చారు. మరికొన్ని అద్దాలు పగిలాయి. జనం ఆ రాళ్లను వెనక్కి పోలీసులపైకి విసిరారు. ఆ సాయంత్రం ఆ విధంగా ముగిసాక రాత్రి పోలీసులొచ్చి కిందపడి ఉన్న రాళ్లనూ గాజుపెంకులనూ ఏరి తీసుకుపోయారు.

గ్రామీణ ప్రాంతాలలో దాడులు మరింత తీవ్రంగా జరిగాయి. 14 సెప్టెంబర్ నాడే పొద్దున్న 10-45 గంటలప్పుడు దక్షిణ కన్నడ జిల్లా పుత్తూరు తాలూకాలోని నెట్టెన పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న అడొరేషన్ ఆఫ్‌గాడ్ చర్చిపైన దాడి జరిగింది. కత్తులు, కర్రలు పట్టుకున్న 30 మంది చర్చిలోకి ప్రవేశించారు. వారిలో నలుగురు పాస్టర్ టి.ఐ.జాయ్‌ని పట్టుకొని కొట్టారు. చర్చిలో అప్పుడు 30 లేక 35 మంది ఉన్నారు. దుండగులు వారందరినీ బాగా కొట్టారు. పాస్టర్‌కు ఒళ్లంతా దెబ్బలు తగిలాయి, రెండు వేళ్ల ఎముకలు విరిగాయి. అతనిచేత 'జై శ్రీరాం' అనిపించాలని ప్రయత్నం చేసారు. సహాయ పాస్టర్ కుమార్తె 21/2 సంవత్సరాల జూలియాను పట్టుకొని బయటకు విసిరేసారు. పాస్టర్‌ను మిగిలిన జనం అతని ఇంటికి మోసుకొనిపోతే దుండగులు అతని యింటికి కూడ వదిలిపెట్టకుండా వచ్చి మళ్లీ కొట్టారు. అయితే అప్పటికే బాధితులు పోలీసులకు కబురుపంపడంతో దుండగులు వెళ్లిపోయారు. పాస్టర్ జాయ్ పుత్తూరు ఆస్పత్రిలో నాలుగు రోజులు, మంగళూరులో ఎనిమిది రోజులు వైద్యం చేయించుకున్నాడు. అతను మాతో చెప్పిన మరొక విషయం ఏమిటంటే అతను చర్చికి అనుబంధంగా మౌంట్ సియాన్ పబ్లిక్ స్కూల్ అనే పాఠశాల నడుపుతాడు. దానిలోని అధ్యాపకులంతా హిందువులే, విద్యార్థులలో 90 శాతం హిందువులే. అయితే ఒక సంవత్సరం కింద హిందూజాగరణ వేదికె కార్యకర్తలు అతని దగ్గరకొచ్చి, మతమార్పిడులు చేయడం మానుకోకపోతే తీవ్ర పర్యవసానాలుంటాయని హెచ్చరించారు.

పై మూడు దాడులూ ఒకేదినం, ఒకే సమయంలో, ఒకే పద్ధతిలో జరిగాయి. అదే సమయంలో దాడికి గురయిన మరికొన్ని ప్రార్థనా స్థలాలు: ఉడుపిజిల్లాలోని బన్నూర్‌లో బిలీవర్స్ చర్చి, షిరూర్‌లో లైఫ్ అండ్ లైట్ మినిస్ట్రీ ప్రేయర్ హాల్, కోటేశ్వర్‌లో కార్మెల్ ఆశ్రమ్ చర్చి, ముడూర్‌లో మిషన్‌వన్

మిలియన్ లైఫ్ సెంటర్, ఉడుపి పట్టణంలోని న్యూలైఫ్ ఫెలోషిప్ హాల్, దక్షిణ కన్నడ జిల్లాలోని బిరినెలె గ్రామంలో అసెంబ్లీ ఆఫ్ గాడ్ చర్చి, కలంజా గ్రామంలో ఇండియన్ పెంతెకోస్తల్ ప్రేయర్ హాల్, మదంత్యార్‌లో మహిమప్రేయర్ హాల్, శక్తినగర్‌లో జీసస్ క్రైస్ట్ చర్చి, మంగళూరు పట్టణంలో అసెంబ్లీ ఆఫ్ ప్రేయర్ ఫెలోషిప్. ఈ దాడులన్నిటిలోనూ ప్రార్థనా స్థలాల కట్టడాలకు చాలా హాని జరుగగా, షిరూర్, ముదూర్, ఉడుపి, కలంజా, మదంత్యార్‌లలో జరిగిన దాడులలో వ్యక్తులకు గాయాలయ్యాయి. కొందరికి తీవ్రగాయాలే అయ్యాయి. ఈ దాడులకు కొద్ది గంటల ముందు, 13, 14 తేదీల మధ్యరాత్రి బెంగుళూరు సమీపంలోని చిక్కబళ్లపూర్ జిల్లా చిక్కకెడిగెనహల్లి గ్రామంలో కూడా ఒక చిన్న చర్చి పైన దాడి చేసి ధ్వంసం చేసారు.

## నిరసనపై పోలీసు దాడి

ఈ దాడులు క్రైస్తవులకు సహజంగానే ఆందోళన కలిగించాయి. మిలాగ్రెస్‌లోని అడొరేషన్ సెంటర్ కాథలిక్కులకు చాలా పవిత్రమైనదని ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (పశ్చిమ రేంజ్) ఒప్పుకుంటాడు. దాని పైన దాడి క్రైస్తవులకు చాలా ఆగ్రహం కలిగించిందని అంగీకరిస్తాడు. ఈ కారణంగా 14వ తారీఖు మధ్యాహ్నం మిలాగ్రెస్‌లోనే కాక మంగళూరు పట్టణంలోని కొన్ని ఇతర చర్చిల బయటకూడ దోషులపైన చర్యతీసుకోవాలంటూ క్రైస్తవులు నిరసన ప్రదర్శనలు చేసారు. నిరసనకారులు రాస్తారోకో నిర్వహించే ప్రయత్నం చేసారని పోలీసులు అంటారు. అది నిజమే అయి ఉండవచ్చు. మంగళూరు పట్టణంలోని వామంజూర్ ప్రాంతంలో ఉన్న సెయింట్ జోసఫ్ ది వర్కర్ చర్చి బయట బజరంగ్‌దళ్ కార్యకర్తలొచ్చి నిరసనకారులపైన దాడిచేసారు. ఆ సాయంత్రం మరికొందరు వచ్చి చర్చిగేటు దగ్గర ఒక శిలువ పడేసారు. ఇది జరిగినప్పుడు పోలీసులు అక్కడే ఉన్నారు. వాళ్లను నివారించమనీ లేకపోతే క్రైస్తవ యువకులు రెచ్చిపోయే ప్రమాదం ఉందనీ ఆ చర్చి ఫాదర్ పోలీసులతో చెప్పినా ప్రయోజనం లేకపోయింది.

మరుసటిరోజు, అంటే 15 సెప్టెంబర్ నాడు క్రైస్తవులు భవిష్యత్తు కార్యాచరణ గురించి మాట్లాడుకోవడానికి వివిధ చర్చిలలో సమావేశం అయ్యారు. మంగళూరు పట్టణంలో మూడు చర్చిలలో పెద్ద సమావేశాలు జరిగాయి. అవి పెర్మన్నూర్‌లోని సెయింట్ సెబాస్టియన్ చర్చి, కులశేఖరలోని హోలీక్రాస్ చర్చి; వామంజూర్‌లోని సెయింట్ జెసెఫ్ ద వర్కర్ చర్చి. పోలీసులు సెక్షన్ 144 ప్రయోగించి, చర్చిలలో సమావేశం అయిన వారు వెళ్లిపోవాలని ఒత్తిడి చేసారు. పెర్మన్నూరులో 400–500 మంది గుమిగూడారు. కులశేఖరలో చర్చి ఆవరణలోనే స్కూలు ఉంది. అక్కడ 1000 మంది దాకా గుమిగూడారు. వామంజూరులో గుంపు 500 దాకా ఉన్నారు. పోలీసులు చర్చి ఆవరణ బయట నిలబడి గుమిగూడిన వారిని వెళ్లిపొమ్మని ఒత్తిడి చేసారు. వాళ్ల ఆగ్రహం న్యాయమైనదని పోలీసులు గుర్తించి ఉంటే వారితో సులభంగా వ్యవహరించి ఉండవచ్చు. చర్చి అధినేతలతో మాట్లాడి ఉండవచ్చు, తాము న్యాయం చేస్తామన్న విశ్వాసం కలిగించే ప్రయత్నంచేసి ఉండవచ్చు, నిరసన శాంతియుతంగా ఉండాలని నచ్చచెప్పి ఉండవచ్చు. కాని క్రైస్తవులు ఎకె 47తోనో ఆర్‌డిఎక్స్‌తోనే మంగళూరులో బీభత్సం సృష్టించబోతారన్నట్టు పోలీసులు ప్రవర్తించారు. ఇది అపార్థం చేసుకోవడం కాదు. అర్థం చేసుకోవడానికి ఇష్టపడకపోవడం. క్రైస్తవులకు అన్యాయం జరిగిందనీ వారికి నిరసన తెలిపే హక్కుందనీ గుర్తించడానికి నిరాకరించడం. పోలీసులు చేసిందేమిటంటే చర్చిలలోని జనాన్ని తరిమేయడం కోసం విపరీతంగా బలప్రయోగానికి పాల్పడడం.



లాఠీచార్జిని తప్పించుకునేందుకు పరిగెడుతున్న విద్యార్థులు

పెర్మన్నూరులో ప్రార్థన 11-45కు అయిపోయింది. అయిపోగానే పోలీసులొచ్చారు. దక్షిణ కన్నడ జిల్లా ఎస్‌పి స్వయంగా వచ్చాడు. స్థానిక ఎంఎల్ఎ కూడ వచ్చాడు. ముందురోజు ఆ చర్చిబయట జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నవారి పేర్లు కావాలని ఎస్‌పి అడిగాడు. అతను చర్చి నిర్వాహకులతో మాట్లాడు తుండగా, కొంత మంది అక్కడున్న జనం ఫోటోలు తీయసాగారు. వాళ్లు ఆనాటి సమావేశంలో పాల్గొన్నవారి రికార్డు తయారుచేయడానికి ఫోటోలు తీస్తున్న పోలీసు ఫోటోగ్రాఫర్‌లయి ఉంటారని భావించిన జనం అభ్యంతరం తెలిపారు. ఇరుపక్షాలూ రాళ్లు విసురుకున్నారు. ముందు వాళ్లు విసిరారని వీళ్లు, వీళ్లు విసిరారని వాళ్లు అంటున్నారు. ఏమయితేనేం ఎస్‌పి లాఠీచార్జికి ఆదేశం ఇచ్చాడు. పోలీసులు బాష్పవాయువు ప్రయోగించుకుంటూ జనాన్ని లాఠీలతో కొట్టుకుంటూ చర్చి ఆవరణలోకి ప్రవేశించారు. నిలబడి సరండర్ అయిన వారిని సైతం లాఠీలతోనూ తుపాకి మడమలతోనూ కొట్టారు. ఇది 45 నిముషాలసేపు సాగింది. చివరికి పోలీసులు 113 మందిని అదుపులోకి తీసుకున్నారు. వాళ్లను నేలమీద కూర్చోబెట్టారు. ఇన్‌స్పెక్టర్ జయంత్‌శెట్టి వాళ్లనుద్దేశించి హేళనగా 'ఇప్పుడు ప్రార్థనలు చెప్పండిరా' అన్నాడు. వాళ్లను కొట్టే క్రమంలో పోలీసులు చర్చి అద్దాలు పగులగొట్టారు. జనానికి దెబ్బలు తీవ్రంగా తగిలాయి. అరెస్టు చేసినవారి మీద పోలీసులు కేసులు పెట్టగా, జనం దక్షిణ కన్నడ జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్‌ను, ఉల్లాల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జయంత్ శెట్టిని ముద్దాయిలుగా చూపిస్తూ కేసుపెట్టారు.

కులశేఖరలోని హోలీక్రాస్ చర్చివద్ద కూడ ఇదే చిత్రం నడిచింది. ఆ చర్చికి పొద్దున వచ్చిన ప్రజలు ఉదయం 7-30, 8-00 సమయంలో ప్రార్థన ముగించుకొని బయటకు రాగా, ముందు రోజులాగా రాస్తారోకో చేస్తారన్న అనుమానంతో కాబోలు పోలీసులు లాఠీచార్జి చేసి వారిని తిరిగి ఆవరణలోకి తరిమారు. అయితే త్వరలో ఇంకా ఎక్కువమంది క్రైస్తవులు చర్చి ఆవరణలోకి వచ్చారు. 9-30 సమయంలో పోలీసులు ఆవరణలోకి వచ్చి నిషేధాజ్ఞలున్నాయంటూ గుంపుపై లాఠీ చార్జి చేసారు. బాష్పవాయువు ప్రయోగించి వారిని చర్చిలోకి స్కూలులోకి తరిమారు. గేటుబయట పోలీసులతో పాటు బజరంగ్ దళ్, శ్రీరామసేనె కార్యకర్తలు నిలబడి లోపల ఉన్న క్రైస్తవులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసారు. వాళ్లు లోపలికి రాళ్లు విసరగా, లోపలున్న జనం ఆ రాళ్లు తీసుకొని తిరిగి వాళ్లమీదికి విసిరారు.

పోలీసులు ఆవరణలోపల జనాన్ని తరిమితరిమి కొట్టిన క్రమంలో తీవ్రంగా దెబ్బలుతిన్న ఇద్దరు

సిస్టర్ డెమిసా (71), సిస్టర్ సెహ్నో (61). బాష్పవాయువువల్ల మండుతున్న కళ్లు కడుక్కోవడానికి సిస్టర్ డెమిసా ఒక వాష్ బేసిన్ దగ్గర ఆగగా పోలీసులు వెనకనుండి ఆమెను లాఠీతో కొట్టారు. ప్రార్థన చేసుకోవడానికి వచ్చిన నిషెల్ డిసౌజా అనే విద్యార్థిని ఈ దాడిలో చిక్కుకొని భయపడి స్కూలులో దాక్కోగా పోలీసులు ఆమెను బయటకు లాగి కొట్టి ఇంటికి పొమ్మని తరిమేసారు.

కులశేఖర చర్చినుండి పోలీసులు ఆ తర్వాత వామంజూరు చర్చికి పోయారు. చర్చి ఆవరణలో గుమిగూడిన క్రైస్తవుల చేతిలో నల్లజెండాలున్నాయి. పోలీసులతోపాటు గేటు దగ్గరకొచ్చిన బజరంగ్‌దళ్ కార్యకర్తలు ఒక నల్లజెండాను గుంజుకొని పరుగెత్తారు. క్రైస్తవ యువకులు కొందరు వెంటబడి తరిమారు. బజనంగ్‌దళ్ వాళ్లు కొంచెం దూరం పోయి ఆగి తమను వెంటాడిన యువకులను ఇనపరాడ్లతో కొట్టి వెనక్కి పంపారు. వెనక్కి వచ్చిన ఆ యువకుల కోసమని చెప్పి పోలీసులు ఆవరణలోకి ప్రవేశించారు. నిరసన తెలిపిన ప్రజలను లాఠీలతో కొట్టారు. వారికోసం వెతికే నెపంమీద చర్చికి అనుబంధంగా ఉన్న అన్ని గదులూ గాలించారు. కిటికీల అద్దాలు పగలగొట్టారు. చివరికి 12 మంది క్రైస్తవ యువకులను అరెస్టు చేసి తీసుకుపోయారు.



నిరసన తెలిపేందుకు గుమిగూడుతున్న క్రైస్తవులు

పెర్మన్నూర్‌లో జరిగిన దాడిని సంపూర్ణంగా చిత్రించిన వీడియో ఉంది. దాడి జరుగుతుండగానే క్రైస్తవులలో కొందరు దానిని వీడియో తీసారు. పోలీసులు చర్చి ఆవరణలోనూ చర్చిలోనూ ప్రజలను మూలమూలలకు తరిమి పశువులను బాదినట్లు బాదిన వైనం ఆ వీడియో చూపుతుంది. పోలీసుల చర్య పూర్తిగా అనవసరమైనది. క్రైస్తవులు మహా అయితే ఒక ఊరేగింపు చేసేవారు లేదా రాస్తారోకో నిర్వహించేవారు. ముందు రోజు జరిపిన దాడుల తీవ్రతను దృష్టిలో పెట్టుకున్నప్పుడు అందులో తప్పేమీ లేదు. పోలీసులు వారి నిరసన కార్యక్రమంలో వివరాలు అడిగి తెలుసుకొని ఉండవచ్చు, శాంతియుతంగా నడుచుకొమ్మనీ, తాము ముదురోజు దాడి చేసినవారిపైన చర్యలు తీసుకుంటామనీ నచ్చజెప్పి ఉండవచ్చు. పోలీసులు అందుకు భిన్నంగా తమ పక్షపాతమంతా ప్రదర్శించారు. దాడికి గురయిన వారినే దుండగులుగా పరిగణిం చారు. ఈ అణచివేత కార్యక్రమంలో బజరంగ్‌దళ్ కార్యకర్తలూ భాగమయి, పోలీసులకు లాఠీలతో రంగప్రవేశం చేయడానికి అవసరమయిన సాకులు కల్పించారు.

జాతీయ మైనారిటీల కమిషన్ సమర్పించిన నివేదికను బట్టి, మొదటివారం దినాలలో పోలీసులు బజరంగ్‌దళ్ కార్యకర్తలకంటె క్రైస్తవులనే ఎక్కువ అరెస్టు చేసారని అర్థం అవుతుంది.


క్రైస్తవ నిరసనకారులపై బాష్పవాయు ప్రయోగం

అరెస్టు చేసింది 83 మంది కాగా అందులో 47 మంది క్రైస్తవులు, 36 మంది బజరంగ్‌దళ్ కార్యకర్తలు. కాగా, బజరంగ్‌దళ్ దాడుల కారణంగా మూడు పడమటి జిల్లాలలో కలిపి క్రైస్తవ ఆస్తులకు జరిగిన నష్టం రాష్ట్ర ప్రభుత్వం లెక్కల ప్రకారమే 12,98,000 రూపాయలు. 11 ప్రార్థనా స్థలాలపైన దాడి జరిగిన దక్షిణ కన్నడ జిల్లాలో 6,01,000 నాలుగు ప్రార్థనా స్థలాలపైన దాడి జరిగిన ఉడుపి జిల్లాలో 5,85,000, 6 ప్రార్థనా స్థలాలపైన దాడి జరిగిన చిక్కమగళూరు జిల్లాలో 1,12,000 రూపాయలు.

సంఘ్‌పరివార్‌తో ప్రభుత్వ యంత్రాంగం లాలూచీ ఒక్క పోలీసు శాఖకే పరిమితం కాదు. పచ్చనాది అనే ప్రదేశంలో ఒక గుట్టమీద ఉన్న మేరీ విగ్రహం గురించి మంగళూరులో మేము విన్నాము. క్రైస్తవులు ఆ విగ్రహాన్ని ఆరాధించేవారు. వాళ్ల రాకపోకలవల్ల కాల క్రమంలో ఒక బాట ఏర్పడింది. భక్తులు దారి పొడవునా చెక్కతో చేసిన శిలువలు నిలబెట్టారు. దానినొక ప్రార్థనా స్థలంగా అభివృద్ధి చేసే ఉద్దేశ్యంతో క్రైస్తవులు 2008 తొలి నెలలలో ఆ భూమిని తమకు ఇమ్మని ప్రభుత్వానికి అర్జీ పెట్టుకున్నారు. అధికారులు అవుననీ, కాదనీ అనకుండ అర్జీని పక్కన పెట్టారు. అంతలో, జూలై 2008లో ఒక రోజు మేరీ విగ్రహం మాయమయిపోయి బజరంగ్‌దళ్ జెండా అక్కడ వెలిసింది. క్రైస్తవులు పోలీసులకూ రెవెన్యూ అధికారులకూ ఫిర్యాదు చేసారు. అది ప్రభుత్వ భూమే అయినప్పటికీ దానిలోకొ మొదట ప్రవేశించింది క్రైస్తవులు కాబట్టి, దానిపైన హక్కులు కోరుతూ వారు పెట్టుకున్న అర్జీ ప్రభుత్వం వద్ద పరిశీలనలో ఉంది కాబట్టి వేరే ఎవరి ఆక్రమణనూ దానితో సమానంగా చూడడానికి వీలులేదు. అధికారులు ఆమాటే అన్నారు కూడ. వెనక వచ్చిన బజరంగ్‌దళ్‌ను తొలగించి భూమి మీచేతిలో పెడతాం అని హామీ యిచ్చారు. అయితే అకస్మాత్తుగా 144 సెక్షన్ కింద నిషేధాజ్ఞలు ప్రకటించి ఇరువర్గాలనూ ఆ భూమిలోకి ప్రవేశించవద్దని ఆదేశించారు. ఈ విధంగా పరిపాలనాధికారాన్ని చట్టబద్ధంగా వినియోగించే పేరిట మంగళూరు రెవెన్యూ యంత్రాంగం బజరంగ్‌దళ్ లక్ష్యాన్ని నెరవేర్చింది.

2008లో దావణగిరి జిల్లాలో కూడా మళ్లీ స్థానిక చర్చిల పైన, ప్రార్థనా బృందాలపైన దాడులు జరిగాయి. పాస్టర్లపైన గురి పెట్టి దాడిచేసారు. గతంలో లాగ ఈ ఘటనలలో కూడ క్రైస్తవ ప్రార్థనా కార్యక్రమాలనే మతాంతరీకరణ కార్య క్రమాలుగా చిత్రీకరించడం, ఏ మతమార్పిడి అయినా అభ్యంతరకరం అన్నట్టు వ్యవహరించడం జరిగింది. దావణగిరి క్రైస్తవ సంక్షేమ సంఘం ప్రభుత్వానికి సమర్పించిన అర్జీలో 14 దాడులను ప్రస్తావించింది. గత సంవత్సరాలలో లాగే ఈ దాడులకు



కారకులు

గ్రామీణ ప్రాంతాల చర్చిలపైనా జరిగిన దాడులు

శ్రీరామసేనె, హిందూ జాగరణ వేదికె, బజరంగ్‌దళ్. కాగా పోలీసులూ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌లూ క్రైస్తవ పాస్టర్లపైనా ప్రచారకులపైన శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారంటూ సిఆర్‌పిసి సెక్షన్ 107 కింద సెక్యూరిటీ ప్రొసీడింగ్స్ చేపట్టారు. శాంతి భద్రతలకు భంగం కలిగించబోతాడన్న సందేహం ఉన్న వ్యక్తి నుండి శాంతంగా నడుచుకుంటానని బాండ్ తీసుకోవడానికి ఉద్దేశించిన ఈ అధికారాన్ని దావణగిరి జిల్లాలో 13 మంది పాస్టర్లపైన ప్రయోగించారు. వాస్తవానికి శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్న వారెవరయినా ఉంటే అది బజరంగ్‌దళ్ కార్యకర్తలే తప్ప తమ మత ప్రార్థనలు, ప్రచారం నిర్వహిస్తున్న క్రైస్తవ పాస్టర్లు, ప్రచారకులు కాదు. వీరిపైన భద్రతా చర్యలు చేపట్టడం పచ్చి అధికార దుర్వినియోగం తప్ప వేరే ఏమీ కాదు.

సెప్టెంబర్ 13, 14 తేదీల మధ్యరాత్రి చిక్కబళ్లాపూర్ జిల్లాలోని చిక్కకడిగెనహల్లిలో ఒక చర్చిపైన జరిగిన దాడి గురించి పైన చెప్పాము. సెప్టెంబర్ 20వ తేదీన బెంగుళూరు నగరంలోని హెబ్బాల్ ప్రాంతంలో ఉన్న మరియన్నపాలయ చర్చిపైన అటువంటి దాడే జరిగింది. రెండు ఘటనలలోనూ గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి చర్చిలను ధ్వంసం చేసారు, బీభత్సం సృష్టించారు, వస్తువులను విరగ్గొట్టారు. ఈ దాడుల వెనక ప్రణాళిక, పథకం ఉందనేది స్పష్టమే ఎందుకంటే దాడి ఎవరు చేసిందీ ఎవరూ చెప్పలేకపోతున్నారు. ఈ రెండు చోట్ల హిందూ ప్రజలు కూడ బాధపడుతున్నారు. గ్రామంలోని వారెవరూ దాడిలో పాల్గొనలేదని అందరూ కచ్చితంగా చెప్తున్నారు. దాడికి పాల్పడింది బయటినుండి అందుకోసమే వచ్చిన బజరంగ్‌దళ్ కార్యకర్తలేననేది అందరికీ అర్థమయింది.

## సోమశేఖర కమిషన్

దేశవ్యాప్తంగా ఈ దాడుల గురించి వెల్లువెత్తిన నిరసన కారణంగా ఆ రాష్ట్ర ప్రభుత్వం ఒక న్యాయ విచారణ కమిషన్‌ను నియమించింది. ఆ రాష్ట్ర హైకోర్టులోనూ మన హైకోర్టులోనూ కూడా జడ్జిగా పనిచేసి రిటైరయిన జస్టిస్ బి.కె. సోమశేఖరను న్యాయ విచారణ కమిషనర్‌గా ఎంపిక

చేసింది. ఆ విచారణ ఇంకా సాగుతున్నది. దానిని సోమశేఖర గారు క్రైస్తవంపైన న్యాయ విచారణగా మలచి నడుచుకుంటున్న తీరు అపూర్వమని చెప్పుకోవాలి. జడ్జిగా ఉన్నప్పుడు సోమశేఖర గారు తన విధి నిర్వహణకు సంబంధించిన నియమాలను గాలికి వదిలాడన్న చెడ్డపేరేమీ లేదు. రిటైరయిన పిదప మన రాష్ట్రంలో ఏలేరు స్కాంపైన న్యాయ విచారణ జరపటానికి ఆయననే నియమించారు. కాని మతం విషయానికొచ్చేసరికి అన్ని న్యాయ సంబంధమయిన నియమాలు మరిచిపోయాడు. బజరంగ్‌దళ్, శ్రీరామసేన, హిందూ జాగరణ్ మంచ్‌లను బోను నుంచి తప్పించి ఏసుక్రీస్తును బోనులో నిలబెట్టి విచారణ చేస్తున్నాడు. 2006 నుంచి ఆ రాష్ట్రంలో క్రైస్తవులపైన హిందుత్వవాద సంస్థలు చేస్తున్న దాడులను, వేధింపులను, అధికార యంత్రాంగం విచారించకపోగా తానుకూడ అందులో భాగం అయిందని పైన చూసాం. పోలీసులే కాదు ఇతర పాలనా శాఖలూ అయినాయి. ప్రార్థనా స్థలాల పైన దాడిచేసి పాస్టర్‌ను కొట్టి కుర్చీలనూ చిత్రపటాలనూ మత చిహ్నాలనూ ధ్వంసం చేసిన వారే పోలీస్ స్టేషన్‌కు పోయి అక్కడ బలవంతపు మతమార్పిడి జరుగుతున్నదని ఫిర్యాదు చేస్తారు. హింసకు పాల్పడిన వారిపైన చర్య తీసుకునే బదులు పోలీసులు ప్రార్థనా స్థలాల నిర్వాహకులపైన శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నారని కేసులు పెడతారు. ఒక్కొక్కసారి అరెస్టు చేస్తారు. ఒక్కొక్కసారి తాసీల్దారు వద్ద హాజరయి బాండు ఇమ్మని ఆదేశిస్తారు. జిల్లా అధికారులు చర్చిలను మూసివేసి తాళం వేసిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. ఇదంతా రెండేళ్లకు పైగా జరుగుతుండగా నిరుడు దాడులు తీవ్రరూపం తీసుకున్న విషయాన్ని, ఆ సందర్భంగా అధికార యంత్రాంగం పాత్రను పైన వివరంగా చెప్పుకున్నాం.

న్యాయ విచారణ అంటూ జరిగితే స్థానిక అధికార యంత్రాంగం నిర్వాకం గురించి, యెడ్యూరప్ప ప్రభుత్వం స్పందన గురించి జరగవలసి ఉండింది. అయితే ఆ రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాంగం వైఫల్యాలతోబాటు 2008 సెప్టెంబర్‌లో జరిగిన దాడులకు 'దారి తీసిన పరిస్థితుల' పైన కూడ విచారణ జరపమనింది. దాడుల గురించి యెడ్యూరప్ప ప్రభుత్వం అనుసరించిన వైఖరిని దృష్టిలో పెట్టుకున్నప్పుడు ఇది ఉద్దేశ్యపూర్వకంగా జరిగిందనే భావించాలి. సోమశేఖర గారు దానిని వాడుకొని న్యాయవిచారణను క్రైస్తవంపైన, మత స్వేచ్ఛపైన విచారణగా మలచారు. హిందుత్వ వాదులు విచారణ ముందు హాజరయి బైబిల్‌ను డాక్యుమెంటుగా ప్రవేశపెట్టి, తమపైన జరిగిన హింస గురించి వాంగ్మూలం ఇవ్వడానికి వచ్చిన క్రైస్తవులను బైబిల్ గురించి క్రాస్ ఎగ్జామిన్ చేస్తున్నారు. విగ్రహారాధనను విమర్శించే బైబిల్ వాక్యాలు హిందువుల మనోభావాలను కించపరిచేవిగా లేవా అనీ, హిందువుల పైన ద్వేషం రెచ్చగొట్టేవిగా లేవా అనీ, సామాజిక శాంతికీ, దేశ సమగ్రతకూ సమైక్యతకూ ఆ బైబిల్ వాక్యాలు అవరోధం కాదా అనీ ఎదురు ప్రశ్నలు అడుగుతున్నారు. 'అందువల్లనే దాడులు జరిగాయి' అనే నిర్ధారణకు న్యాయ విచారణ కమిషన్ రావడానికి తగిన 'మెటీరియల్' జస్టిస్ సోమశేఖర గారికి అందిస్తున్నారు. ఆయన తనకు పురమాయించబడ్డ కర్తవ్యానికి ఈ ప్రశ్నలు అసందర్భమైనవి అని చెప్పి వాటిని నివారించే బదులు ఆ ప్రశ్నలకు తావిచ్చే దిశగా తన విచారణ పరిధిని పెంచుకున్నాడు. ఆయనిచ్చిన అవకాశాన్ని పూర్తిగా వాడుకుంటున్న హిందుత్వ వాదులు బైబిల్‌లోని కొన్ని వాక్యాలను తొలగించవలసిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించమని ఆయనను కోరారు. ఆయన ఆ అభ్యర్థనను కూడా పరిశీలిస్తున్నాడు.

సోమశేఖర కమిషన్ ఈ సంవత్సరం జూలై 12వ తేదీన బెంగుళూరులోని ఒక న్యాయ

కళాశాలతో కలిసి నిర్వహించిన సెమినార్ ఆయన వైఖరికి అద్దం పడుతుంది. న్యాయ విచారణ కమిషన్ అవగాహన పెంపొందించడం కోసం, విజ్ఞుల అభిప్రాయాలు వినడం కోసం ఈ సెమినార్ నిర్వహిస్తున్నట్టు కమిషన్ చైర్మన్ హోదాలో ఆయన ప్రకటించుకున్నాడు. సెమినార్‌లో ఆయనతో సహా పలువురు వక్తలు మాట్లాడారు. మొత్తం 6 ప్రసంగాలు ఏర్పాటు చేశారు. వాటిలో ఒకటి మాత్రం ఆయనకు నిర్దేశించిన కర్తవ్యానికి సంబంధించినది ('మత మైనారిటీలకు చట్టపరమైన రక్షణ'). తక్కిన అయిదు, 'మత ప్రచారంలో సామాజిక భద్రత, నైతికతలకు సంబంధించిన సమస్యలు', 'మతమార్పిడికి సంబంధించి ప్రస్తుతం ఉన్న చట్టాలు, వాటి సామాజిక ప్రభావం, ఏవయినా సవరణలు లేక కొత్త చట్టాలు అవసరమా'? 'మత మార్పిడి మత ద్వేషాలను రెచ్చగొట్టే నేరం కిందికి వస్తుందా'? 'మత మార్పిడి సామాజిక శాంతిని భగ్నం చేయడం అనే నేరం కిందికి వస్తుందా?' 'మతాన్ని విశ్వసించడం, ఆచరించడం, ప్రచారం చేయడం – వీటిలోని చట్టపరమైన అంశాలు' అనేవి. వక్తలలో ఒకరు తప్ప అందరూ మతమార్పిడి అనేది సామాజిక శాంతికీ భద్రతకూ దేశ సమైక్యతకూ భంగకరం అనే మాట్లాడారు. దాదాపు 3 శతాబ్దాల మత ప్రచారం తరువాత కూడ దేశ జనాభాలో 3 శాతం దాటని క్రైస్తవాన్ని గురించి ఇంతటి ఆందోళన వ్యక్తం చేయడం – హక్కులు, న్యాయాన్యాయాల సంగతి అటుంచి – కనీస విజ్ఞత గల అభిప్రాయమా అన్న సందేహం జడ్జిగారికిగానీ వక్తలకు గానీ రాకపోవడం హిందుత్వ వాదులు మెదళ్ల తలుపులు మూసేసే ద్వేష వాతావరణాన్ని దేశంలో ఎంతగా రెచ్చగొట్టారన్న దానికి సూచిక.

అదట్లా ఉంచి, మైనారిటీలపైన జరిగిన దాడుల విషయంలో అధికార యంత్రాంగం ప్రదర్శించిన నిర్వ్యాపకత్వం గురించి, లాలూచీ గురించి విచారణ జరపమని కూర్చోబెట్టిన కమిషన్ ఈ చర్చ చేపట్టడం సబబా అని జస్టిస్ సోమశేఖర గారికి సందేహం రాకపోవడం అత్యంత ఆందోళనకరం. దావణగిరి జిల్లాలో అధికార యంత్రాంగం తాళాలు వేసిన క్రైస్తవ ప్రార్థనా స్థలాలను తెరిపించాలని కోరుతూ కొందరు క్రైస్తవులు సోమశేఖర కమిషన్‌ను అభ్యర్థించగా ఆయన జారీచేసిన ఆదేశం వారి కమిషన్ చేయబోయే న్యాయ నిర్ణయానికి అద్దం పడుతుంది. తాళాలు తీయడాన్ని తప్పక అనుమతించవలసిందేనని ఉపోద్ఘాతంలో అంటూ, దానికి ఆయన 19 షరతులు విధించాడు. ఇతర మతస్తుల భావాలను గాయపరిచే మాటలు మాట్లాడకూడదనీ, ఎటువంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడకూడదనీ, ప్రార్థనకు వెళ్లే ప్రతి వ్యక్తీ తన పేరు, చిరునామా, ప్రార్థనా స్థలం పేరు, దాని నిర్వాహకుల వివరాలు, ప్రార్థన సమయం వగైరాలన్నీ లిఖితపూర్వక వాంగ్మూలం రూపంలో అధికార యంత్రాంగానికి ఇచ్చి వెళ్లాలి వగైరా షరతులు పెట్టారు. అదృష్టవశాత్తు, వేరే కొందరు దావణగిరి క్రైస్తవులు అదే అభ్యర్థనతో హైకోర్టులో కేసు వేయగా హైకోర్టు అధికార యంత్రాంగాన్ని బాధితులకు కాక దాడిచేసిన వారికి అండగా ఉన్నందుకు అభిశంసించి, పోలీసులు సమర్పించిన నివేదిక ప్రకారమే బలవంతపు మతమార్పిడి జరిగిన ఆధారాలేమీ లేవని ప్రకటించి, ప్రార్థనా స్థలాలను పోలీసు తాళాలనుంచి విముక్తం చేసింది.

# 'సాంస్కృతిక' పోలీసులుగా పరివార్

**సెప్టెంబర్** 2008లో జరిగిన దాడుల తరువాత కొంతకాలం బజరంగ్‌దళ్, దాని మిత్ర సంస్థలు వార్తలలో కనిపించలేదు. అయితే 2009 జనవరిలో మళ్లీ వార్తలకెక్కారు. మంగళూరులోని ఆమ్నీసియా అనే పబ్‌పైన దాడిచేసి అక్కడ ఉన్న స్త్రీలను బూతులు తిట్టి, కొట్టి బయటకు తరిమేసిన ఘటన వారిని మళ్లీ వార్తలకెక్కించింది.

కానీ అప్పటికి కొంతకాలంగా ఈ గుంపులు 'మన సంస్కృతి' అని తాము నిర్వచించేదానిని పరిశుద్ధంగా ఉంచడం కోసం విచ్చలవిడిగా బలప్రయోగానికి – ప్రత్యేకించి స్త్రీలపైన – పాల్పడడం, పోలీసులు చూస్తూ ఊరుకోవడం జరుగుతున్నది. స్థానిక పత్రికలలో ఆ వార్తలు వస్తూనే ఉన్నాయిగానీ డబ్బు, హెూదా ఉన్న స్త్రీలు పోయే పబ్‌పైన దాడిచేసినప్పుడే బయటి ప్రపంచానికిది వార్త అయింది.

పబ్‌పైన దాడి కూడ భయం గొలిపే పద్ధతిలో జరిగింది. జనవరి 24 సాయంత్రం 4.00 గంటలప్పుడు ఒక 40 మంది తలకు కాషాయరంగు బట్ట కట్టుకున్నవారు ఆమ్నీసియా పబ్ దగ్గరకొచ్చారు. గేటు బయట రెండు నిముషాలు కళ్లుమూసుకుని ప్రార్థన చేసారు. ఆ తరువాత 'జైశ్రీరాం', 'భారతమాతాకీ జై', 'బజరంగ్‌దళ్‌కీ జై', 'శ్రీరామసేనకీ జై' అంటూ నినాదాలు ఇచ్చుకుంటూ లోపలికి చొరబడే ప్రయత్నం చేసారు. పబ్ సిబ్బంది బయటి తలుపు మూసేయగా వెనక తలుపు నుండి లోపలికి దూసుకు వెళ్లారు. లోపల ఉన్న స్త్రీలపైన దాడి చేసారు. వాళ్ల బట్టలు లాగి వాళ్లను తీవ్రంగా అవమానపరచారు బూతులు తిట్టారు, కొట్టారు. అక్కడున్న మగవాళ్లలో పవన్ కుమార్ శెట్టి అనే ఒక్కతనే అడ్డుపోయాడు. అతనిమీద దుండగులు విరుచుకుపడ్డారు. అది ఆ స్త్రీలకు తప్పించుకోవడానికి అవకాశం కల్పించింది.

## హిందూ తాలిబన్లు

అప్పట్లో కేంద్ర ప్రభుత్వంలో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న రేణుకా చౌదరి వారి చర్యను తీవ్రంగా ఖండిస్తూ, వారిని తాలిబన్లతో పోల్చింది. సనాతన ఆచారాలను, నియమాలను

బలప్రయోగంతో అమలు చేసే ప్రయత్నాన్ని తాలిబన్ల ప్రధాన లక్షణంగా గుర్తించినట్టయితే ఈ పోలికలో తప్పేమీ లేదు. ముస్లిం తాలిబన్లలాగ ఈ హిందూ తాలిబన్లు కూడ స్త్రీలపైనే ఎక్కువ దృష్టి పెట్టారు. ఏ సమాజంలోనయినా సరే సనాతన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడడం అనే దానికి అర్థం స్త్రీల నడవడికనూ అలవాట్లనూ కఠినంగా నియంత్రించడమే అనేది చరిత్ర నేర్పే పాఠం.

ముస్లిం లేక క్రైస్తవ యువకులతో స్నేహంగా ఉన్న హిందూ స్త్రీలను శిక్షించడం, కేవలం కలిసి ఒక బస్సులో ప్రయాణం చేసినా, కాలేజీ క్యాంటిన్‌లో కాసిని టీ తాగినా దండించడం, భిన్న మతాలకు చెందిన స్కూలు లేక కాలేజి పిల్లలు కలిసి పిక్నిక్ గానీ ఎక్స్‌కర్షన్‌కుగానీ (విద్యాసంస్థ ఆధ్వర్యంలోనే అయినా) పోయినట్టయితే బలప్రయోగంతో ఆపడం – ఇటువంటి ఘటనలు కరావళి ప్రాంతంలో అనేకం జరిగాయి.

## కొన్ని ఘటనలు

- ఆమ్నీసియా పబ్ ఘటనలాగ వార్తలకెక్కిన మరొక దౌర్జన్యం 2009 ఫిబ్రవరి 5వ తేదీన జరిగింది. బాధితురాలు శ్రుతి కేరళకు చెందిన యువతి. ఆమె తండ్రి సిహెచ్ కున్‌హబ్బు, మంజేశ్వరం నియోజకవర్గంఎంఎల్ఏ. సిపిఐ(ఎం)కు చెందినవాడు. ఆరోజు సాయంత్రం ఆ అమ్మాయి కేరళలోని కాసర్‌గోడ్ నుండి మంగళూరు వచ్చే బస్సు ఎక్కింది. దారిలో ఆమె స్నేహితురాలి అన్న అయిన షబీబ్ బస్సు ఎక్కాడు. ఆమె పక్కన కూర్చున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మంగళూరుకు చెందిన బజరంగ్‌దళ్ కార్యకర్తలు (వాళ్లకెట్లా తెలుస్తుందో దిగువ చూద్దాం) ఆ పట్టణంలోకి బస్సు ప్రవేశించగానే బస్సు ఎక్కారు. పంప్‌వెల్ అనే స్టేజిలో ఎక్కి తరువాత స్టేజికంటె ముందే బస్సును ఆపి శ్రుతినీ హబీబ్‌నూ బలవంతంగా బస్సునుండి దింపి ఆటో ఎక్కించి తీసుకుపోయారు. ఒక యింట్లోపెట్టి కొట్టారు. శ్రుతిని సాయంత్రం 6 గంటలకు విడిచిపెట్టారు. షబీబ్‌ను ఇంకొంచెం కొట్టి రాత్రి విడిచిపెట్టారు. శ్రుతి ఎంఎల్ఏ కుమార్తె కావటంవల్ల ఈ ఉదంతం బాగా ప్రచారం అయింది. కానీ ఇటువంటి ఉదంతాలు చాలా ఉన్నాయి.
- ఫిబ్రవరి నెలలోనే (బహుశా 11వ తేదీ కావచ్చు) కిన్నిగొలి అనే గ్రామంలో ఇద్దరు హిందూ అమ్మాయిలు రఫీక్ అనే బస్సు కార్మికుడితో కలిసి బస్సెక్కారు. అది రఫీక్ పనిచేస్తున్న బస్సే. బస్సులో వారికి అబ్దుల్ సలీం అనే మిత్రుడు కలిసాడు. ఆ ఇద్దరమ్మాయిలు, అబ్దుల్ సలీం మూడ్‌బిద్రి అనే చోట దిగారు. వాళ్లు కొంచెం దూరం నడవగానే ఒక సంఘపరివార్ గుంపు వారిని చుట్టుముట్టి పరాయి యువకుడితో స్నేహంగా ఉన్నందుకు అమ్మాయిలను దూషించి, ముగ్గురినీ కొట్టారు. ఆ తరువాత ముగ్గురినీ మూడ్‌బిద్రి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఆ బస్సు తిరిగి వస్తున్నప్పుడు దానిని ఆపి రఫీక్‌ను బయటకులాగి కొట్టి అదే పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అక్కడ పోలీసులు వారిని తిట్టి ఆ అమ్మాయిల తల్లిదండ్రులను పిలిపించారు. ఒకమ్మాయి తల్లిదండ్రులు వచ్చారు. పోలీసులు సలీంచేత క్షమాపణ చెప్పించారు. అయితే ఆ అమ్మాయి ఇంటికి పోయి అవమానంతో ఆత్మహత్య చేసుకుంది. చేసింది చాలక ఆమెతో అసభ్యంగా ప్రవర్తించి ఆమె ఆత్మహత్యకు కారణం అయ్యాడని పోలీసులు సలీంపైననే కేసు పెట్టారు. అమ్మాయి పేరు అశ్విని అని కొన్ని పత్రికలు రాసాయి. ఆమె వయసు 16.

✠ దక్షిణ కన్నడ జిల్లాలోని విఠల అనే ఊరిలో విఠల ఫ్రెండ్స్ సర్కిల్ అన్న అమాయకమైన పేరుగల హిందుత్వవాద 'సాంస్కృతిక' పోలీసు సంస్థ ఉంది. వాళ్లు నిరుడు సెప్టెంబర్ నెలలో ఆ ఊరికి చెందిన నందిత అనే అమ్మాయి కస్బాకు చెందిన బషీర్ అనే యువకుడితో కలిసి తిరగడం ఒకటి రెండు సార్లు గమనించారు. ఆమెను దూషించడమే కాక ఆమె పనిచేసే చోటికి పోయి ఆమెను బర్తరఫ్ చేయమని యజమాని పైన ఒత్తిడి పెట్టారు. ఒకనాడు బషీర్‌నూ నందితనూ పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తీసుకుపోయారు. పోలీసులు వాళ్ల నుండి ఇంకెప్పుడూ ఇటువంటి తప్పుడు పనులు చేయం అన్న రాతపూర్వకమైన హామీ తీసుకొని విడిచిపెట్టారు.

✠ ఫిబ్రవరి 14వ తేదీన మంగళూరుకు చెందిన ఒక ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు ఇంటర్ కాలేజియేట్ పోటీలలో పాల్గొనడానికి ఒక ప్రైవేట్ బస్సులో బెంగుళూరుకు బయలుదేరారు. అందులో భిన్న మతాలవారున్నారు. బస్సు మంగళూరు పట్టణం నుండి బయటపడక ముందే బజరంగ్‌దళ్ కార్యకర్తలు దానిని ఆపారు. విద్యార్థులందరూ ఇంటికి పోవలసిందేనని ఆదేశించారు. స్థానిక పోలీసులు, కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి అది అధికారికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమమని నచ్చచెప్పే ప్రయత్నం చేసారు. అయినా కాషాయ బృందం ఒప్పుకోలేదు. ప్రోగ్రాం రద్దు చేసుకోకపోతే బస్సు బెంగుళూరు చేరే లోపల దానిపైన దాడి జరుగుతుందని హెచ్చరించారు. విద్యార్థులందరూ ఇళ్లకు వెళ్లిపోయారు.

✠ అంతకు ముందే 2008 డిసెంబర్ 27నాడు మంగళూరులోని శ్రీమాతా ఎడ్యుకేషన్ ట్రస్టువారి కాలేజీకి చెందిన విద్యార్థులు మైసూరుకు, బెంగుళూరుకు ఎక్స్‌కర్షన్‌గా బయలుదేరారు. బస్సులో వారితో పాటు వారి అధ్యాపకులు కూడ ఉన్నారు. అయితే అందులో హిందూ అమ్మాయిలూ ముస్లిం అబ్బాయిలూ ఉన్నారని తెలిసిన బజరంగ్‌దళ్ కార్యకర్తలు బస్సును ఆపి అందరినీ బెదిరించి వెనక్కి పంపించేసారు.

✠ 2008 సెప్టెంబర్ 8వ తేదీన 'ది హిందూ' దిన పత్రిక కొన్ని ఘటనల జాబితా ఇచ్చింది. బంట్వాల్ తాలూకాలోని విఠలగ్రామంలో రూపశ్రీ అనే హిందూ స్త్రీని, ఆమె మిత్రుడు వికార్ అహ్మద్‌నూ బజరంగ్‌దళ్ కార్యకర్తలు పట్టుకొని కొట్టి రోడ్లో ఊరేగించారు. మంగళూరు పట్టణంలో ఒక హోటల్‌లో ఫలహారం చేస్తున్న సుగంధి, రాఘవ్, అనిత, రషీద్ అనే స్నేహితులను హోటల్‌లోనే పట్టుకొని కొట్టారు – ముగ్గురు హిందువులు (అందులో ఒక స్త్రీ) ముస్లిం స్నేహితుడితో కలిసి ఉన్నందుకు. మంగళూరులోనే జూలియా, రాబర్ట్, వహీద్, అబ్దుల్, సునీల్ అనే అయిదుగురు ఒకే క్లాసుకు చెందిన విద్యార్థులు రోడ్డు పక్కన నిలబడి నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటున్నందుకు వారిపైన దాడి చేసి దూషించారు. పుత్తూరు తాలూకా కేంద్రానికి చెందిన దివ్య అనే అమ్మాయి ఆయేషా అనే ముస్లిం స్నేహితురాలి యింటి తరచుగా పోతూ ఉందని చెప్పి బజరంగ్‌దళ్ గుంపు దారికాచి ఆ అమ్మాయిపైన దాడి చేసారు.

✠ బెల్తంగడికి చెందిన ఒక హిందూ అమ్మాయి ఇద్దరు క్రైస్తవ మిత్రులతో కలిసి బస్సులో కేరళకు పోతున్నది. దారిలో బజరంగ్‌దళ్ కార్యకర్తలు బస్సు ఆపి ముగ్గురినీ బలవంతంగా బస్సు నుండి దించి, వాళ్లిద్దరూ ఈ అమ్మాయిని మతాంతరీకరణ కోసం తీసుకుపోతున్నారని చెప్పి స్థానిక పోలీసులకు అప్పగించారు. ఆ అమ్మాయి అది నిజంకాదని చెప్పినప్పటికీ పోలీసులు ఆమెను

ఇంటికి పంపించేసి, క్రైస్తవులిద్దరినీ ఇంకెప్పుడూ ఇట్లాంటి పనులు చేయవద్దని హెచ్చరించి విడిచిపెట్టారు.

## నిఘా వ్యవస్థ!

బస్సులలో హిందూ స్త్రీలు ముస్లింలతో గానీ క్రిష్టియన్లతోగానీ కలిసి ప్రయాణం చేస్తున్నట్టయితే దారిలో బజరంగ్‌దళ్ లేక శ్రీరామ్‌సేనె గుంపు బస్సు ఆపి వారిని దించి తిట్టిన, కొట్టిన సంఘటనలు అనేకం జరిగాయి. ఎవరికయినా వచ్చే సందేహం బస్సులో ఫలానవాళ్లు ప్రయాణం చేస్తున్నారని వాళ్లకు ఎట్లా తెలుస్తుందని. ఆ రహస్యమేమిటంటే ప్రైవేట్ బస్సుల సిబ్బందిలో బజరంగ్‌దళ్ కార్యకర్తలూ సానుభూతిపరులూ చాలామంది ఉన్నారు. వారు బస్సులో 'భారతీయ సంస్కృతికి'కి హాని కలిగించగల విషయాలేమయినా – అంటే హిందూ అమ్మాయిలు క్రైస్తవ లేక ముస్లిం అబ్బాయిలతో కలిసి ప్రయాణం చేయడం, నవ్వుతూ మాట్లాడడం, పక్కపక్కనే కూర్చోవడం వగైరా జరుగుతున్నట్టయితే సెల్‌ఫోన్‌లో రాబోయే ఊరిలో లేక స్టేజిదగ్గర ఉండే తమ వారికి తెలియజేస్తారు. వారు తక్కినపని చూసుకుంటారు.

ఈ దాడులు చేసింది తామేనని బజరంగ్‌దళ్ బహిరంగంగా ఒప్పుకుంటుంది. ఆ సంస్థ దక్షిణ కన్నడ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ మూడ్‌బిద్రి, హిందువులు ఇతర కులస్తులతో స్నేహంగా ఉండడం అనే 'అనైతికత'కు పాల్పడిన 200 ఘటనలను తమ సంస్థ 'పరిష్కరించిందని' పత్రికలకు చెప్పాడు. 'అప్పుడప్పుడు బలప్రయోగం తప్పదు. ఆ భయమే మరొకసారి తప్పు చేయకుండ ఆపుతుంది. అమ్మాయిని ఒకసారి బహిరంగ స్థలంలో కొట్టి, అవమానపరిచినట్టయితే తన నడవడికను సంస్కరించుకుంటుంది. అబ్బాయిలను అదుపు చేయడం అంత సులభం కాదు' అన్నాడు. హింస తప్పుకదా అంటే 'మా కుర్రవాళ్లు ఒక్కొక్కసారి తమ ఆవేశాన్ని ఆపుకోలేక తక్షణ న్యాయం చేసే బాధ్యత తమమీద వేసుకొంటారు. కానీ మాది ప్రాథమికంగా చట్టాన్ని గౌరవించే సంస్థ. తప్పు చేసే వాళ్లను పోలీసులకు అప్పగిస్తాం' అని జవాబు చెప్పాడు.

హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు కలిసి తిరగడం సుదర్శన్ మూడ్‌బిద్రి గారి దృష్టిలో 'అనైతికం' కావచ్చును గానీ, వాళ్లను పోలీసులకు అప్పగించడానికదేం నేరం కాదుకదా, వీళ్లు అప్పగించడమేమిటి, వాళ్లు అదుపులోకి తీసుకోవడమేమిటి అనుకుంటున్నారా? కరావళిలో నడిచే రాజ్యాంగం వేరు.

మూడ్‌బిద్రి పోలీస్‌స్టేషన్‌కు ఇద్దరు హిందూ అమ్మాయిలను, వారితో బస్‌లో ప్రయాణం చేసిన ఇద్దరు ముస్లిం అబ్బాయిలను బజరంగ్‌దళ్‌వారు అప్పగించిన విషయం, అందులో ఒక అమ్మాయి ఆ తరువాత ఆత్మహత్య చేసుకున్న విషయం పైన చెప్పాము. ఆ ఘటన గురించి పియుసిఎల్ నిజనిర్ధారణ కమిటీ అప్పటి దక్షిణ కన్నడ జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్‌ను ప్రశ్నించగా చట్టాన్ని చేతిలోకి తీసుకోకూడదనీ తప్పు చేసినవాళ్లను పోలీసులకు అప్పగించాలనీ బజరంగ్‌దళ్‌కు తానే ఆదేశం జారీ చేసినట్లు తెలిపాడు. ఆ అమ్మాయిలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకురావడాన్ని ప్రశంసించాడు. 'మహిళా పోలీసులు ఉన్న స్టేషన్‌ను వెతికి అక్కడికి తీసుకొచ్చారు. వాళ్లు తమ చర్యల గురించి స్పృహ కలిగి ఉన్నారనడానికి ఇది నిదర్శనం' అన్నాడు.

# వారికే మీడియా వత్తాసు

ఒరిస్సాలాగే కర్నాటకలో కూడ మీడియా స్పష్టమైన పక్షపాత వైఖరిని అవలంబించడమే కాక, సంఘ్‌పరివార్ పరిభాషను ప్రచారం చేయడం కనిపిస్తుంది. క్రైస్తవులపైన దాడులు జరగుతున్నప్పుడు కన్నడ భాషలోని రెండు ప్రధాన దినపత్రికలు 'ఉదయవాణి, విజయకర్నాటక' దాడులకు మద్దతు కలిగించే పద్ధతిలో రాసాయి. 2008 సెప్టెంబర్ 15వ తేదీన మూడు చర్చిలలో క్రైస్తవులపైన పోలీసులు పాల్పడిన లాఠీచార్జి గురించి వ్యాఖ్యానిస్తూ 'వాళ్లు రాళ్లు విసిరారు, వీళ్లు కొట్టారు' అని రాసారేతప్ప ముందు రోజు క్రైస్తవ ప్రార్థనాస్థలాలపైన జరిగిన దాడులు, వాటి విషయంలో పోలీసుల వైఖరి, అది క్రైస్తవులలో కలిగించిన న్యాయమయిన నిరసన ఎక్కడా వార్తలలో ప్రస్తావనకు రాలేదు. క్రైస్తవులు ఉబుసుపోక పోలీసులపైన రాళ్లు వేసి లాఠీచార్జిని కొని తెచ్చుకున్నారన్న అభిప్రాయం కలిగించాయి ఆ వార్తలు. పైగా పోలీసుల పక్కన బజరంగ్‌దళ్ కార్యకర్తలు ఉండి వాళ్లు కూడ చర్చి ఆవరణలోని క్రైస్తవులపైన రాళ్లు వేసారనీ దూషించి రెచ్చగొట్టారనీ ప్రస్తావించనేలేదు. రాళ్లు ఎవరు ముందు వేసారన్న సంగతి అటుంచి, న్యాయమయిన నిరసన వ్యక్తం చేస్తూ గుమిగూడిన క్రైస్తవులను చెదరగొట్టే ఉద్దేశ్యంతో పోలీసులు మోహరించడమే 15వ తేదీనాటి ఘటనలకు నాంది అన్న విషయం తమ పాఠకులకు అందకుండ అవి జాగ్రత్తపడ్డాయి.

ముస్లింల గురించి ఎప్పుడు ప్రస్తావించినా ఈ పత్రికలు 'అన్యమతస్తులు' అన్న మాట వాడుతాయి. ముస్లింలు హిందువులకు అన్యమతస్తులు అవుతారుకానీ దేశానికే అన్యమతస్తులు కారు కదా. వాళ్లను ఏ సందర్భంలోనయినా సరే 'అన్యమతస్తులు' అనడం ఈ దేశం హిందువులకు చెందింది, ఇతర మతాలు ఆచరించేవారు పరాయివారు అన్న సంఘ్‌పరివార్ భావజాలాన్ని వ్యక్తం చేయడమే అవుతుంది.

ఎస్‌పి చిన్నస్థాయి అధికారి కాదు, అజ్ఞానంలో ఉన్నాడు అనుకోవడానికి. అయితే చట్టాన్ని గురించి, నేరాల గురించి ఈ రకమైన అవగాహన ఎస్‌పి దగ్గర కూడ ఆగిపోలేదు. 2008 డిసెంబర్ 27న మంగళూరులో ఒక ఘటన జరిగింది. సీక్రెట్ హార్ట్ కాన్వెంట్‌కు చెందిన ఒక క్రైస్తవ సన్యాసిని తన దగ్గర పనిచేసే హిందూ అమ్మాయితోపాటు ఒక బస్‌స్టాప్ దగ్గర నిలబడింది. ఆ అమ్మాయి పేరు అంజలి. ఇద్దరూ కొద్దిసేపు ఏవో మాట్లాడుకున్నారు. అంతలో ఆ సన్యాసిని ఏదో తేవడానికి వెనక్కి వెళ్లి కొంతసేపటికి తిరిగి వచ్చింది. అప్పటికే కొందరు బజరంగ్‌దళ్ కార్యకర్తలు అంజలిని చుట్టుముట్టి ప్రశ్నిస్తున్నారు. ఈమె దగ్గరికి రాగానే ఈమె మీద వాళ్లు విరుచుకుపడి విపరీతంగా దూషించారు. పనమ్మాయితో మాట్లాడొద్దు, దగ్గరకు రావద్దు అని తిట్టారు. పియుసిఎల్ నిజనిర్ధారణ కమిటీ ఈ ఘటనను ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (వెస్టర్న్ రేంజ్) ఎ.ఎం. ప్రసాద్‌గారి దృష్టికి తీసుకుపోయి ఆమెను దూషించడం నేరంకాదా అని అడిగితే 'ఆమె పనమ్మాయి అంజలిని క్రైస్తవురాలిగా మార్చిందని వాళ్లు అంటున్నారు కాబట్టి ఆమెను వారించే హక్కు చట్టపరంగా వారికి

ఒరిస్సాలో జరిగిన లక్ష్మణానంద సరస్వతి హత్యకు నిరసనగా అఖిలభారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) కర్నాటకలో బంద్ పిలుపు ఇచ్చినప్పుడు క్రైస్తవ విద్యాసంస్థలు సహకరించలేదని చెప్పి ఆ సంస్థలు మతాంతీకరణ చేపడుతున్నాయని ఆరోపిస్తూ ఎబివిపి పత్రికా ప్రకటన ఇచ్చింది. దానిని ఈ రెండు పత్రికలూ ప్రచురించాయి. అది అబద్ధమనీ బంద్‌కు సహకరించనందుకు ఈ నిందవేసారనీ క్రైస్తవ విద్యాసంస్థలు ఇచ్చిన వివరణను ప్రచురించలేదు.

2005లో ఉడుపి సమీపంలోని మూలూరులో హాజబ్బ, హసనబ్బలపైన జరిగిన దాడి గురించి పైన చెప్పాము. దానికి నిరసనగా ఉడుపిలో జరిగిన ఒక ప్రదర్శనలో చాలామంది ముస్లింలు పచ్చరంగు జెండాలు పట్టుకున్నారు. ఆ ఫోటో ప్రచురించిన 'ఉదయవాణి', దాని కింద 'ఇది పాకిస్తాన్ కాదు, ఉడుపి' అన్న క్యాప్షన్ పెట్టింది. నిరసనకారులు ఇస్లాంకు గుర్తుగా పచ్చరంగు జెండాలను పట్టుకోగా, దానిని పాకిస్తాన్ జెండాగా చూపించడం ఉద్దేశ్యపూర్వకమైన దుర్మార్గం. భిన్నమతస్తులు కలిసితిరగడం, స్త్రీలు 'పాశ్చాత్యం' అని భావించబడే వస్త్రాలు ధరించడం, పబ్‌లకు వెళ్లడం మొదలయినవి 'అనైతికం' అంటూ సంఘ్‌పరివార్ చేసే దాడుల గురించి రిపోర్టు చేసేటప్పుడు దాడికి గురయినవారి నడవడిక తప్పు, అనైతికం అనే అభిప్రాయాలనే ఈ పత్రికలూ వ్యక్తం చేయడం ద్వారా దాడులకు మద్దతు కలిగిస్తున్నాయి.

కన్నడంలో 'వార్తాభారతి' అనే మరొక దినపత్రిక ఉంది. దాని యజమాని ముస్లిం కావడం వల్లనే కాబోలు ఆ పత్రిక ఈ వరవడిలో భాగం కాలేదు. గత సెప్టెంబర్ నెలలో ఉడుపి, మంగళూరులో క్రైస్తవులు ఆ పత్రిక ఏజెంట్లను అడిగి మరీ పత్రిక కాపీలు తీసుకునేవారు. అయితే ఉడుపి పట్టణంలో ఆ పత్రిక ఏజెంటు ముందురోజు పేపర్ ప్రతి అడిగిన వారికి ఇచ్చినందుకు పోలీసులు అతనిని కొట్టారు. పత్రిక ఏజెంటు ఈరోజు పత్రిక అమ్మవచ్చును గానీ నిన్నటి పత్రిక అమ్మడానికి వీలులేదన్నారు!

ఉంది' అన్నాడు. ఏ చట్టం ప్రకారం ఆ రకమైన హక్కు ఉందో, అట్లా అందరూ తాము నేరంగా భావించే చర్యలకు పాల్పడేవారిని దూషించడం, బెదిరించడం మొదలుపెడితే సామాజిక శాంతి భద్రతల గతి ఏమవుతుందో ఆయన చెప్పలేదు. పరమత స్నేహం చేసే వాళ్లను పోలీసులకు అప్పగించడం గురించి ఆయనను ప్రశ్నించగా 'ఎవరయినా చట్టాన్ని అతిక్రమించినట్టు అనిపిస్తే వారిని పోలీసులకు అప్పగించే అధికారం అందరికీ ఉంది' అన్నాడు. అంటే ఈ ఐజిగారి అభిప్రాయంలో కూడ పరమత స్నేహం చట్ట వ్యతిరేకమే.

ఇక్కడ చెప్పుకున్న ఎస్‌పి సతీశ్ కుమార్, ఐజి ఎ.ఎం. ప్రసాద్‌లే, సెప్టెంబర్ 2008 నాటి దాడులప్పుడు మంగళూరులో పదవులు వెలగబెడుతున్నారు. సతీశ్ కుమార్ స్వయంగా పెర్మనూరు చర్చిపైన జరిగిన దాడిలో పాల్గొన్న విషయంపైన చెప్పాము.

ఈ అనాగరికమైన దాడులలో బజరంగ్‌దళ్ పేరు ఎక్కువగా వినపడినప్పటికీ వారొక్కరే కాదు, శ్రీరామసేనె, హిందూజాగరణ్ వేదికె, హిందూ జాగరణ్ సమితి మొదలయిన సంస్థలు కూడ

ఉన్నాయి. వీటిని టోకున సంఘ్‌పరివార్ (అంటే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం యొక్క పరివారం) అని అనడం జరుగుతుంది. అయితే సంఘ్‌పరివార్ నాయకులు బజరంగ్‌దళ్ వరకు ఒప్పుకుంటారు గానీ శ్రీరామసేనె వగైరాలు పరివారంలో భాగం కాదని అంటుంటారు. శ్రీరామసేనె నాయకుడు ప్రమోద్ మతాలిక్ బజరంగ్‌దళ్‌లో కొంతకాలం ఉండి, వెలివేయబడి, శివసేనలోకి పోయి బయటికొచ్చి శ్రీరామసేనె పెట్టాడు. అయితే వారు మావారు కాదు కాదని కర్నాటక ముఖ్యమంత్రి యెడ్యూరప్ప అంటుండగా ఆమ్నీసియా పబ్‌పైన దాడి బజరంగ్‌దళ్, శ్రీరామసేనె కలిసి చేసారని స్థానిక శ్రీరామసేనె ప్రతినిధి ప్రసాద్ అత్తవార్ మీడియాతో అన్నాడు. ఇద్దరి లక్ష్యం ఒకటేనని వివరించాడు.

**జీన్స్‌వంటి వస్త్రాలు ధరించి ఒంటరిగా తిరగడం బెంగుళూరులో సహితం అమ్మాయిలకు ప్రమాదకరంగా తయారౌతున్నది. ఇవ్వాళ మగవాళ్ల వస్త్రధారణ కూడ ఎక్కువ భాగం 'మన సంస్కృతి'కి చెందినది కాదుగానీ 'సాంస్కృతిక' పోలీసుల దృష్టి కేవలం స్త్రీల మీదనే.**

వాలంటీన్స్ డేని ప్రేమికుల దినంగా జరుపుకునే యువతీ యువకులపైన దాడి తమ ఘనతేనని శ్రీరామసేనె అంటోంది. 'బహిరంగ ప్రదేశాలలో ప్రేమికుల జంటలుగా తిరిగే వారిని వెంటనే ఒక గుడికి తీసుకుపోయి పెళ్లి చేసేస్తాం. దానికోసం మా కార్యకర్తలు పురోహితులను వెంటబెట్టుకొని నిఘావేస్తారు. ఆ తరువాత రిజిస్ట్రార్ ఆఫీసుకు తీసుకుపోయి ఆ పెళ్లిని రిజిస్టర్ చేస్తాము కూడ' అని ప్రమోద్ మతాలిక్ 2009 వాలెంటీన్స్‌డేకి ముందు ప్రకటించాడు.

ఈ ప్రేమికులు భిన్న మతస్తులు కానక్కరలేదని గ్రహించాలి. ఇద్దరూ హిందువులే కావచ్చు. అయినా శ్రీరామసేనె బహిరంగ ప్రదేశాలలో పెళ్లికాని స్త్రీపురుషులు చెట్టపట్టాలు వేసుకొని తిరగడాన్ని సహించదు. పెళ్లికానివాళ్లు కలిసి తిరగడం 'మన సంస్కృతి' కాదంటున్నది. 'మన సంస్కృతి' అనేదాన్ని ఏవిధంగా నిర్వచించినా ఈ అభిప్రాయానికి చారిత్రక ఆధారాలున్నాయా అంటే సందేహమే. అయితే 'మన సంస్కృతి' కాదనేది ప్రేమ పెళ్లిళ్లకు మాత్రమే పరిమితం అయిన అభ్యంతరం కాదు. స్త్రీల వస్త్రధారణకు కూడ విస్తరిస్తుంది. జీన్స్‌వంటి వస్త్రాలు ధరించి ఒంటరిగా తిరగడం బెంగుళూరు నగరంలో సహితం అమ్మాయిలకు ప్రమాదకరంగా తయారవుతున్నది. ఇవ్వాళ మగవాళ్ల వస్త్రధారణ కూడ ఎక్కువ భాగం 'మన సంస్కృతి'కి చెందినది కాదుగానీ 'సాంస్కృతిక' పోలీసుల దృష్టి కేవలం స్త్రీల మీదనే.

2009 ఫిబ్రవరి 24 నాడు బెంగుళూరులోని వసంత్‌నగర్‌లో వందన అనే ఉద్యోగిని డ్యూటీ ముగించుకొని ఇంటికి పోవడానికి బయటికొచ్చింది. అప్పటికి రాత్రి 9-00 అయింది. బెంగుళూరులో అది మరీ రాత్రేం కాదు. అయినప్పటికీ జీన్స్ వేసుకున్న పాపానికి వందన కొద్ది నిముషాలు నరకం అనుభవించింది. ఆటోకోసం వెతుకుతూ నడుస్తున్న ఆమెను నలుగురు వ్యక్తులు వెంబడించారు. ఆమె రోడ్డుకు అవతలివైపుకు దాటితే వాళ్లు ముందుకుపోయి

రోడ్డు దాటి ఆమెకు ఎదురొచ్చారు. జీన్స్ వేసుకున్నందుకు హిందీలో, కన్నడంలో దూషిస్తూ చేయి చేసుకున్నారు. ఆమె వాళ్లను తోసేసి ముందుకు పోబోగా మరింత దౌర్జన్యంగా ప్రవర్తించారు. ఆమెను పిడికిలితో గుద్దారు. జీన్స్‌వేసుకొని మన సంస్కృతిని అవమానపరచినందుకు ఆమెను దూషిస్తూనే ఉన్నారు. ఆమె తనను తాను రక్షించుకుంటూ తప్పించుకునే మార్గం కోసం చూడగా అటువైపు ఒక ఆటో రావడం చూసింది. అమె పరుగెత్తిపోయి ఆటో ఎక్కితే ఆ నలుగురూ ఒక క్షణం బిత్తరపోయి మళ్లీ పరుగెత్తుకొచ్చి ఆమెను ఆటోనుండి బయటకు గుంజే ప్రయత్నం చేసారు. అదృష్టం కొద్దీ ఆటోడ్రైవర్ వేగంపెంచి బండిని ముందుకు తీసుకుపోయాడు.

'భారతీయ సంస్కృతి'కి భిన్నంగా నడుచు కుంటున్నట్టు భావిస్తున్న స్త్రీలను బహిరంగ ప్రదేశంలో పట్టుకొని బట్టలు లాగి వివస్త్రలను చేసి అవమాన పరచడం ఈ హిందుత్వ సంరక్షకులు ఉద్దేశ్య పూర్వకంగా ఎంచుకున్న పద్ధతి.

'భారతీయ సంస్కృతి'కి భిన్నంగా నడుచుకుంటున్నట్టు భావిస్తున్న స్త్రీలను బహిరంగ ప్రదేశంలో పట్టుకొని బట్టలు లాగి వివస్త్రలను చేసి అవమానపరచడం ఈ హిందుత్వ సంరక్షకులు ఉద్దేశ్యపూర్వకంగా ఎంచుకున్న పద్ధతి. ఆమ్నీసియా పబ్‌పైన దాడి చేసినప్పుడు కూడ పబ్‌లో ఉన్న స్త్రీలను కొట్టడం, తిట్టడమేకాదు, వాళ్ల బట్టలు లాగే ప్రయత్నం కూడ చేసారు. బెంగుళూరు నగరంలో పాశ్చాత్య వస్త్రధారణగా బజరంగ్‌దళ్, శ్రీరామసేనెలు భావించే దుస్తులు వేసుకున్న స్త్రీలకు ఇప్పటికి నాలుగైదు సంఘటనలలో ఇదే అనుభవం ఎదురయింది.

వికృతమైన ఈ నడవడికలోనూ అసంబద్ధత ఏమిటంటే – హైందవ సంస్కృతినుండి దూరం అయ్యారు అని తాము భావించే వారిని క్రూరంగా, అవమానకరంగా శిక్షించే ఈ హిందుత్వవాదులు ఇతర మతస్తులు అంతే గాఢంగా తమ సంప్రదాయం అని భావించే దానిని ఆచరించనివ్వరు. కరావళిలో కాలేజీలలో చదువుకునే ముస్లిం అమ్మాయిలు బురఖా వేసుకొని రావడానికి వీలు లేదన్న ఆంక్ష వీళ్లే ఒత్తిడిపెట్టి యాజమాన్యాలచే పెట్టించే ప్రయత్నం చేస్తున్నారు.

సుల్లియా తాలూకాలోని ప్రభుత్వ ప్రీ యూనివర్సిటీ కాలేజీలో ముస్లిం అమ్మాయిలపైన ఈ నిషేధం పెట్టించడంలో హిందూ జాగరణ్ వేదికె కృతకృత్యమయిందని ఆ సంస్థ జిల్లా బాధ్యుడు లక్ష్మేశ గొబ్బల తడక గర్వంగా ప్రకటించుకున్నాడు. వీళ్లు ఈ రకమైన ఒత్తిడి పెడితే, బురఖాలు వేసుకోకుండ బయటకు పోనివ్వని ముస్లిం సనాతనవాదుల ఒత్తిడికీ దీనికీ తలొగ్గి అమ్మాయిలు అసలు చదువుకే దూరం అయ్యే ప్రమాదం ఉందని ముస్లిం తలిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ప్రొఫెసర్ పట్టాభి సోమయాజి మంగళూరు విశ్వవిద్యాలయం ఆంగ్లశాఖలో అధ్యాపకుడు. పియుసిఎల్, కౌముసౌహార్ద వేదికెలలో సభ్యుడు. సంఘ్‌పరివార్ ఆగడాలపైన తన వ్యతిరేకతను దాచిపెట్టుకోకుండ వ్యక్తం చేయడంవల్ల అనేక బెదిరింపులు ఎదుర్కొన్నాడు.

## ప్రజాస్వామ్యంపైన సంఘపరివార్ దాడి

ఆమ్నీసియా పబ్‌పైన దాడి జరిగినప్పుడు ఒక ఆంగ్ల టివిచానెల్ దానిపైన చర్చ నిర్వహించింది. పట్టాభి సోమయాజి అభిప్రాయం కూడ వారు కోరారు. ఆయన వారిని కాలేజీకే రమ్మన్నాడు. తన అభిప్రాయం చెప్పాడు. ఆ సమయంలో చాలామంది విద్యార్థులు కూడ తమ అభిప్రాయం చెప్పారు. వారిలో ఒకరు శ్రీరామసేనెను రావణసేనె అనాలి అన్నాడు.

ఈ వ్యాఖ్యకు నిరసనగా అఖిలభారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) ఆధ్వర్యంలో 2009 జనవరి 29న మంగళూరు యూనివర్సిటీలో బంద్ జరిగింది. ఎబివిపి కార్యకర్తలు పెద్దగుంపుగా వచ్చి క్లాసులు రద్దు చేయించారు. ఆ బంద్ సందర్భంగా శ్రీరామసేనెను రావణసేనె అన్నది పట్టాభి సోమయాజి అనీ అతనిని ఉద్యోగం నుండి బర్తరఫ్ చేయాలనీ ఎబివిపి డిమాండ్ చేసింది. వారు ప్రిన్సిపాల్‌ను కలిసి అతనిని బర్తరఫ్ చేయకపోతే ఊరుకునేది లేదని కూడ బెదిరించారు.

ప్రిన్సిపాల్ ఔననీ కాదనీ అనకపోయేసరికి రాష్ట్ర కేబినెట్‌లో మంత్రి అయిన కృష్ణా పాలెమార్ ఒక గుంపును తీసుకొనివచ్చి ప్రిన్సిపాల్‌ను మళ్లీ బెదిరించాడు. ఇక అప్పుడు ఫిబ్రవరి 4వ తేదీన పట్టాభి సోమయాజికి షోకాజ్ నోటీసు కాలేజినుండి వచ్చింది. అభియోగాలేమిటంటే 1. 28 జనవరి నాడు టివిలో హిందూ మతానికి వ్యతిరేకంగా మాట్లాడాడు 2. తనను కొంతమంది విద్యార్థులు బెదిరిస్తున్నారంటూ ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేయకుండ టివిలో చెప్పాడు 3. భావప్రకటనా స్వేచ్ఛను అడ్డంపెట్టుకొని రెచ్చగొట్టే ఉపన్యాసాలు చేసి శాంతియుత వాతావరణానికి భంగం కలిగిస్తున్నాడు.

సంఘపరివార్ ఒత్తిడికి లొంగి అతనిపైన ఈ రకమైన అభియోగాలు వేయడం అన్యాయం అని భావించిన విద్యార్థులు తమ నిరసనను వ్యక్తం చేస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థులు ఈ విషయంలో చొరవ తీసుకున్నారు. వారొక 300 సంతకాలు సేకరించి ఇవ్వడానికి ఫిబ్రవరి 12వ తేదీన ప్రిన్సిపాల్ ఆఫీసు వద్దకు పోగా ఎబివిపి గుంపు వారిపైన దాడిచేసి పట్టాభిసోమయాజికి వ్యతిరేకంగా నినాదాలు ఇస్తూ ఆ కాగితాలు గుంజుకొని చింపేసారు. అదే రోజు సాయంత్రం వారు సంతకాలు చేసిన ఇద్దరు ముస్లిం విద్యార్థులపైన లైబ్రరీలో దాడిచేసారు. ఆ విద్యార్థులు లైబ్రేరియన్‌కు మొరపెట్టుకోగా ఆమె 'మీరందరూ బయటకు వెళ్లిపోండి, ఇక్కడ గొడవ పెట్టుకోవద్దు' అనింది. బయటకు పోతే కొడతారని భయపడిన ఆ విద్యార్థులు పోలీసులకు సెల్‌ఫోన్‌లో ఫిర్యాదు చేసారు. పోలీసులొచ్చారు, అదే సమయంలో ప్రిన్సిపాల్ కూడ వచ్చారు. ప్రిన్సిపాల్ దాడిచేసిన విద్యార్థులపైన చర్య తీసుకోలేను అని చెప్పాడు. 'ఇక్కడ రాజకీయ పెత్తనం తప్ప వేరే ఏదీ నడవదు' అని తన అశక్తతకు కారణం బయటపెట్టాడు. పోలీసులు దాడికి గురయిన ముస్లిం విద్యార్థులనూ దాడికి నాయకత్వం వహించిన నలుగురు ఎబివిపి వారినీ స్టేషన్‌కు తీసుకుపోయారు. అక్కడ ఎబివిపి విద్యార్థులతో పోలీసులు కొంచెం సేపు సరదాగా ముచ్చట్లు పెట్టుకొని ఇంకెప్పుడూ ఇటువంటి పనులు చేయొద్దు అని హితవు చెప్పి అందరినీ పంపించేసారు.

ప్రొఫెసర్ పట్టాభి సోమయాజి మాత్రం విచారణ ఎదుర్కొంటున్నారు.

# ఉపసంహారం

మొదట్లో చెప్పినట్టు, మేము విషయ సేకరణ చేసేటప్పుడు సంఘ్‌పరివార్ పాల్పడుతున్న హింస, దాని విషయంలో ఆయా రాష్ట్రాల పాలనా యంత్రాంగం నిర్లిప్తత లేక లాలూచీ, ఇద్దరూ తమ చర్యలకు ఇచ్చుకుంటున్న వికృతమైన వివరణలపైన మాత్రమే దృష్టిపెట్టలేదు. సంఘ్‌పరివార్ తన లక్ష్యసాధన కోసం జనాన్ని తన వెనక పోగు చేసుకోడానికి అనుసరిస్తున్న వ్యూహాల మీద కూడ దృష్టి పెట్టాము. ఒరిస్సాలో చారిత్రక కారణాలవల్ల కంధా, పాణో ప్రజల మధ్య నెలకొన్న వైరుధ్యాలను వాడుకున్నారు. కర్నాటకలో భావోద్వేగం కలిగించే చిహ్నాలను వాడుకున్నారు – జాతీయ జెండాను, ఆవును, హిందూస్వామి పీఠంగా చెప్పబడుతున్న స్థలాన్ని వాడుకున్నారు. కరావళిలో అభివృద్ధి మిగిల్చిన నిరసనను వాడుకుని వెనుకబడిన వర్గాల ఆగ్రహాన్ని సొమ్ముచేసుకున్నారు. రెండు చోట్లా, సంక్షోభితమైన సామాజిక వ్యవస్థ కలిగించే అభద్రతా భావాన్ని వాడుకొని క్రైస్తవులను హిందువుల మాతృభూమి అయిన భారతదేశాన్ని నాశనం చేస్తున్న వైరి ప్రజలుగా చూపించారు. క్రైస్తవం ఉనికి, క్రైస్తవ ఆచరణే విద్రోహ చర్యలు. 'మతమార్పిడి' అనేది ప్రశ్నించే వాళ్లను సంతృప్తి పరచడానికి ఇచ్చే వివరణ మాత్రమే. దాడి క్రైస్తవం మీదనే తప్ప క్రైస్తవ మతాంతరీకరణపైన కాదు. ఎవరికి అర్థంకాకపోయినా దాడికి గురయిన క్రైస్తవ ప్రచారకులకూ పాస్టర్లకూ ఈ విషయం అర్థం అయ్యే ఉంటుంది.

భారతదేశానికి గోల్వాల్కర్ వారసులు ఇవ్వాలని చూస్తున్న స్వరూపంతోను, వారు సాధించజూస్తున్న సామాజిక లక్ష్యాలతోనూ విభేదించేవారు తమకు తాము వేసుకోవలసిన ప్రశ్న – ఈ వ్యూహాలను గుర్తిస్తున్నారా, అర్థం చేసుకుంటున్నారా, వాటిని వ్యతిరేకించడానికి అదే ప్రజలలో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారా అనేది. ఇది కేవలం ప్రశ్న కాదు. ఒక అత్యవసరమయిన కర్తవ్యం.



సంఘ్ పరివార్‌కు క్రైస్తవం ఉనికి, క్రైస్తవ ఆచరణే విద్రోహ చర్యలు. 'మతమార్పిడి' అనేది ప్రశ్నించే వాళ్లను సంతృప్తిపరచడానికి ఇచ్చే వివరణ మాత్రమే. దాడి క్రైస్తవం మీదనే తప్ప క్రైస్తవ మతాంతీకరణపైన కాదు. ఎవరికి అర్థం కాకపోయినా దాడికి గురైన క్రైస్తవ ప్రచారకులకూ పాస్టర్లకూ ఈ విషయం అర్థమయ్యే ఉంటుంది.

భారతదేశానికి గోల్వాల్కర్ వారసులు ఇవ్వాలని చూస్తున్న స్వరూపంతోను, వారు సాధించజూస్తున్న సామాజిక లక్ష్యాలతోనూ విభేదించేవారు తమకు తాము వేసుకోవలసిన ప్రశ్న- ఈ వ్యూహాలను గుర్తిస్తున్నారా, అర్థం చేసుకుంటున్నారా, వాటిని వ్యతిరేకించడానికి అదే ప్రజలలో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారా అనేది. ఇది కేవలం ప్రశ్న కాదు. ఒక అత్యవసరమయిన కర్తవ్యం.

HRF
మానవహక్కుల వేదిక ప్రచురణ